శనివారం 21-12-2019

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 270



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'


**మందగమనాన్ని ఎదుర్కోగలం**
సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాలని కార్పొరేట్లకు ప్రధాని పిలుపు –బిజినెస్‌లో


**మీరాబాయికి స్వర్ణం**
ఖతర్ ఇంటర్నేషనల్ కప్ వెయిట్ లిఫ్టింగ్‌లో భారత లిఫ్టర్‌కు అగ్రస్థానం –స్పోర్ట్స్‌లో


SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


# వికేంద్రీకరణకే మొగ్గు...

**ఏపీలో అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ జీఎన్ రావు కమిటీ నివేదిక**

- 3 రాజధానులు.. 4 ప్రాంతీయ అభివృద్ధి మండళ్ల ఏర్పాటుకు సిఫార్సు
- అమరావతిలో అసెంబ్లీ, రాజ్‌భవన్, సీఎం క్యాంప్ ఆఫీసు
- విశాఖలో సచివాలయం, సీఎం క్యాంప్ ఆఫీసు, హెచ్‌ఓడీ ఆఫీసులు
- కర్నూలులో హైకోర్టు.. విశాఖపట్నం, అమరావతిల్లో బెంచ్‌లు

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందేలా అమరావతిలో శాసన రాజధాని(లెజిస్లేటివ్ క్యాపిటల్), విశాఖలో పరిపాలన రాజధాని(ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్), కర్నూలులో న్యాయ రాజధాని(జ్యుడీషియల్ క్యాపిటల్) ఏర్పాటు చేయాలని జీఎన్ రావు కమిటీ తన నివేదికలో సూచించింది. ఏపీ సమగ్రాభివృద్ధి, రాజధాని, పరిపాలన వికేంద్రీకరణపై ఏర్పాటైన ఈ నిపుణుల కమిటీ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి 125 పేజీలతో కూడిన నివేదికను సమర్పించింది. ఏపీలోని 13 జిల్లాల సమగ్రాభివృద్ధి ప్రతిబింబించేలా నివేదికలో పలు సూచనలు చేసింది. విశాఖపట్నంలో సచివాలయం, సీఎం క్యాంపు కార్యాలయం, హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, వేసవిలో అక్కడే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని పేర్కొంది. అమరావతిలో అసెంబ్లీ, గవర్నర్ కార్యాలయం, సీఎం క్యాంపు కార్యాలయం.. కర్నూలులో హైకోర్టు ఉండాలని సూచించింది. వరద ముంపులేని ప్రాంతం ఏపీకి రాజధానిగా ఉండాలని.. రాజధాని కార్యకలాపాల్ని

మిగతా 2వ పేజీలో ▶




**ప్రాంతీయ అభివృద్ధి మండళ్లు..**

1. ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం జిల్లాలు
2. మధ్య కోస్తా
తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా
3. దక్షిణ కోస్తా
గుంటూరు, ప్రకాశం, నెల్లూరు
4 రాయలసీమ
వైఎస్సార్ కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురం

**హైదరాబాద్‌కు రాష్ట్రపతి**


శీతాకాల విడిది కోసం శుక్రవారం హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులకు హకీంపేట విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్. -2లో

**క్రిస్మస్ వేడుకలు**


శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బిషప్ తుమ్మ బాలతో కలసి కేక్ కట్ చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఏకే ఖాన్, కొప్పుల ఈశ్వర్, కేకే తదితరులు -2లో

# అచ్చంపేట ఆస్పత్రిలో దారుణం

**ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నిర్వాకం**

- రక్తస్రావం అవుతున్న గర్భిణికి సాధారణ ప్రసవం కోసం ప్రయత్నం
- బలంగా బయటకు లాగడంతో మొండెం నుంచి వేరుపడ్డ శిశువు తల
- కుటుంబ సభ్యుల వద్ద విషయం దాచిన వైద్యులు
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించిన వైనం
- ఆపరేషన్ చేసి మొండాన్ని బయటకు తీసిన హైదరాబాద్ డాక్టర్లు
- కుటుంబం ఫిర్యాదుతో ఆస్పత్రి సూపరింటెండెంట్, ఓ డాక్టర్ సస్పెన్షన్

అచ్చంపేట రూరల్

వైద్య నిర్లక్ష్యానికి తల్లి కడుపులోని బిడ్డ కడుపులోనే కన్నుమూసింది. మరికొద్ది నిమిషాల్లో భూమ్మీదకు రావాల్సిన గర్భస్థ శిశువు రెండు ముక్కలై ప్రాణాలు విడిచింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో ఈ దారుణం చోటుచేసుకుంది. ఓ గర్భిణికి వైద్యులు సాధారణ ప్రసవం చేస్తుండగా శిశువు తల భాగం మొండెం నుంచి వేరుపడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేట మండలం నడింపల్లికి చెందిన సాయిబాబు భార్య స్వాతి ఈ నెల 18న ఉదయం ప్రసవం కోసం అచ్చంపేట ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో చేరింది. గర్భిణి రిపోర్టులను పరిశీలించిన అనంతరం అదే రోజు ఉదయం 11 గంటలకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తారాసింగ్, వైద్యులు సుధారాణి, సిరాజుద్దీన్ ఆమెకు సాధారణ ప్రసవం చేసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే తీవ్ర రక్తస్రావం అవుతుండటం, శిశువు తలభాగం బయటకు కనిపించడంతో బయటకు లాగేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. ఆ సమయంలో మొండెం నుంచి తల వేరుపడగా మొండెం మాత్రం గర్భిణి కడుపులోనే ఉండిపోయింది. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిన వైద్యులు శిశువు పొట్ట నీరుతో నిండి ఉండటంతో బయటకు రావట్లేదని, మెరుగైన వైద్యం కోసం వెంటనే హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్లాలని రెఫర్ చేశారు. అప్పటికే గర్భిణి పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన హైదరాబాద్‌లోని జజ్జిఖాన ఆస్పత్రికి తరలించారు. గురువారం ఆ ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేసి మృత శిశువును బయటకు తీశారు. శిశువు తలభాగం లేకపోవడం చూసి వారు ఆశ్చర్యపోయారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పారు. కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం అచ్చంపేట ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి వైద్యులతో వాగ్వాదానికి దిగారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని



మిగతా 2వ పేజీలో ▶

# సెంగార్‌కు జీవిత ఖైదు

దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన ఉన్నావ్ అత్యాచారం కేసులో బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. సెంగార్ తన తుది శ్వాస విడిచేవరకు జైలు జీవితం గడపాలని స్పష్టం చేసింది. ఢిల్లీ తీస్‌హజారీ కోర్టు జిల్లా న్యాయమూర్తి జస్టిస్ ధర్మేశ్ శర్మ శుక్రవారం తుది తీర్పు వెలువరించారు. నెల రోజుల్లోగా రూ.25 లక్షలు జరిమానా కూడా చెల్లించాలని సెంగార్‌ను ఆదేశించింది. - వివరాలు 5లో




శుక్రవారం హైదరాబాద్‌లో వింగ్ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్. చిత్రంలో వీ-హబ్ సీఈఓ దీప్తి రావుల, జయేశ్ రంజన్ తదితరులు


పౌరసత్వ సవరణ చట్టాన్ని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద ముస్లింల ఆందోళన






# మహిళల ప్రతిభ వి-హబ్‌తో వెలుగులోకి

- 'వింగ్'కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కేటీఆర్
- మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం
- రూ.15 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు.. రూ.25 లక్షల నుంచి కోటి వరకు గ్రాంటు..

**సాక్షి, హైదరాబాద్:** సామాజిక కట్టుబాట్లు, ఆర్థిక స్వాతంత్ర్యం, విద్య అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో ఇన్నాళ్లూ మహిళల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగుచూడలేదని, మహిళా సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం 'వి–హబ్'ను ఏర్పాటు చేసిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కొందరు మహిళా వ్యాపార వేత్తలు మాత్రమే ఉన్నారని, మహిళల్లోని ప్రతిభను ఇటీవల ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు వెలుగులోకి తెస్తున్నాయని కితాబిచ్చారు. 'వి–హబ్', స్టార్టప్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న 'వింగ్'కార్యక్రమాన్ని కేటీఆర్ ప్రారంభించారు. కేంద్ర పారిశ్రామిక ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు అవసరమైన సాయం అందుతుందన్నారు. దేశంలో 14 శాతం మాత్రమే మహిళా

మిగతా 2వ పేజీలో ▶

**ఇదండీ సంగతి**


అన్ని రకాల పుస్తకాలుండాలని పన్లోపని దొరికిన విప్లవ సాహిత్యం కూడా ఉంచాన్సార్!

# రాజకీయ జోక్యానికి చెక్!

- తెలంగాణ యూనివర్సిటీలో గతంలో చేపట్టిన నియామకాలకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం లేకపోయినా ఓ వీసీ తెల్లవారితే తన పదవీ కాలం ముగుస్తుండటంతో రాత్రికి రాత్రే నియామక ఉత్తర్వులు ఇచ్చేశారు.
- మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఒకే రోజు 200 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చేశారు.
- కాకతీయ యూనివర్సిటీలో చేపట్టిన అధ్యాపకుల నియామకాల్లో తమకు కావాల్సిన ఇద్దరి కోసం రోస్టర్ విధానాన్నే మార్చేశారు. దీంతో 37 మంది అధ్యాపకుల నియామకాలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది.

**వీసీల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట..**

- అధ్యాపక నియామకాలకు స్క్రీనింగ్ టెస్టు
- స్క్రీనింగ్ టెస్టు అర్హుల్లో టాప్ 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూల నిర్వహణ
- థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో పరీక్షకు కసరత్తు
- రోస్టర్, నిబంధనల పరిశీలనకు ఉన్నత స్థాయి కమిటీ
- కమిటీ ఆమోదించాకే నోటిఫికేషన్ జారీ చేసేలా ప్రభుత్వం కసరత్తు




**సాక్షి, హైదరాబాద్:** ఇలా రాజకీయ ఒత్తిళ్లు, ఆశ్రిత పక్షపాతం, ఆమ్యామ్యాల బాగోతంలో యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలు అభాసుపాలయ్యాయి. ఇంటర్వ్యూల్లోనూ తమకు కావాల్సిన వారికి ఇష్టారాజ్యంగా మార్కులు వేసుకొని ఎంపిక చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో యూనివర్సిటీల్లో నియామకాలంటేనే నమ్మకం లేని పరిస్థితి ఏర్పడింది. అందుకే రాజకీయ జోక్యం, వీసీల ఇష్టారాజ్యానికి చెక్ పెట్టే కసరత్తు మొదలైంది.

**స్క్రీనింగ్ టెస్టుతో పారదర్శకత..**

అధ్యాపకుల నియామకాల్లో గతంలో దరఖాస్తులను ఆహ్వానించి, దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు మాత్రమే నిర్వహించి పోస్టులకు ఎంపిక చేశారు. కానీ ఇకపై ఆ విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా మార్పు చేయనుంది. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ యూనివర్సిటీల

మిగతా 2వ పేజీలో ▶

# 'పౌర' ఆందోళనలు హింసాత్మకం

- యూపీలో ఆరుగురు మృతి
- ఢిల్లీలో నిషేధాజ్ఞల ఉల్లంఘన.. భారీ ర్యాలీలు
- దేశవ్యాప్తంగా శుక్రవారం ప్రార్థనల అనంతరం భారీగా వీధుల్లోకి వచ్చిన నిరసనకారులు

భారత్‌లోని అన్ని ప్రాంతాలకు 'పౌర' ఆగ్రహ జ్వాలలు విస్తరించాయి. పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ఆందోళనలతో అట్టుడికింది. నిరసనల సందర్భంగా యూపీలో శుక్రవారం ఆరుగురు చనిపోయారు. పోలీసులు మాత్రం మృతుల సంఖ్యను ఐదుగా పేర్కొన్నారు. బిజ్నోర్‌లో ఇద్దరు, మీరట్, సంభాల్, ఫిరోజాబాద్‌లో ఒక్కరు చొప్పున చనిపోయారని డీజీపీ ఓపీ సింగ్ తెలిపారు. కాన్పూర్‌లోనూ ఒకరు చనిపోయినట్లు సమాచారం.

- వివరాలు 5లో

# నావికులకు వలపు వల

- పాకిస్తాన్‌కు భారత నౌకాదళ రహస్య సమాచారం చేరవేత
- ఫేస్‌బుక్ ద్వారా నావికులకు యువతులతో హనీట్రాప్
- సెక్స్ వీడియోల చిత్రీకరణ.. బ్లాక్‌మెయిల్ చేసి యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్ వివరాల సేకరణ
- ప్రతిఫలంగా నెలనెలా హవాలా సొమ్ము
- 'ఆపరేషన్ డాల్ఫిన్ నోస్'లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి..
- ఏడుగురు నావికుల అరెస్ట్
- జనవరి 3 వరకు రిమాండ్ విధించిన విజయవాడలోని ఎన్ఐఏ కోర్టు

14లో

## జైపూర్ పేలుళ్ల కేసులో నలుగురికి ఉరి

- 2008 నాటి జైపూర్ వరుస బాంబు పేలుళ్ల ఘటనలో నలుగురు దోషులకు నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. ఆ పేలుళ్లలో సుమారు 71 మంది మరణించగా మరో 185 మంది గాయపడిన విషయం తెలిసిందే. దీనిపై ప్రత్యేక కోర్టు విచారణ జరిపింది. సెషన్స్ జడ్జి అజయ్ కుమార్ శర్మ శుక్రవారం గట్టి బందోబస్తు మధ్య తుదితీర్పు వెలువరించారు.

5లో

# పెరగనున్న 'కాళేశ్వరం' అంచనా వ్యయాలు

- మేడిగడ్డ బ్యారేజీ రూ.2,591 కోట్ల నుంచి రూ.4,583 కోట్లకు
- అన్నారం రూ.1,785 కోట్ల నుంచి రూ.2,795 కోట్లకు

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకాల్లోని బ్యారేజీలు, పంప్‌హౌస్‌ల అంచనా వ్యయాలు పెరగనున్నాయి. వ్యయ అంచనాలు వేసిన సమయానికి, ప్రస్తుతానికి స్టీలు, సిమెంట్ ధరల్లో పెరుగుదల జరగడం, అదనంగా అనేక నిర్మాణాలు చేయాల్సి రావడంతో వ్యయాలు పెరిగాయి. ముఖ్యంగా మేడిగడ్డ అంచనా వ్యయం మొదటగా రూ.2,591 కోట్లు ఉండగా, దాన్ని తిరిగి రూ.3,260 కోట్లకు సవరించారు. ప్రస్తుతం అక్కడ ఫ్లడ్‌బ్యాంకులు, ఇతర నిర్మాణాలు పెరిగి, మట్టి, కాంక్రీట్ పనులు పెరగడంతో ప్రస్తుతం వ్యయం రూ.4,583 కోట్లకు చేరింది. దీనికి త్వరలోనే నీటిపారుదల శాఖ ఆమోదం తెలుపనుంది.



ఇక అన్నారం బ్యారేజీ వ్యయం మొదట రూ.1,785 కోట్లు ఉండగా, దాన్ని గతంలోనే రూ.2,456 కోట్లకు సవరించారు. తిరిగి దాన్ని రూ.2,795 కోట్లకు సవరిస్తూ ప్రతిపాదనలు అందాయి. ఇక ఎల్లంపల్లి దిగువన ఉన్న ప్యాకేజీ–7 అంచనా వ్యయం రూ.1,502 కోట్లు ఉండగా, అది రూ.2,030 కోట్లమేర పెరగనుంది. పెరిగిన స్టీలు, సిమెంట్, ఇంధన ధరలకు అనుగుణంగా చెల్లింపులు, ఇతరత్రా కారణాలతో వ్యయాలు పెరుగుతున్నాయి. ఇక ప్యాకేజీ–8 అంచనా వ్యయం రూ.5,166 కోట్లు ఉండగా, ఇక్కడ అదనంగా 600 ఎకరాల మేర భూసేకరణ, ఆడిట్‌టన్నెల్ నిర్మాణం, జీఎస్టీలో మార్పులు, అతిథిగృహాల నిర్మాణం, గ్రావిటీ కెనాల్‌లో అదనపు నిర్మాణాల కారణంగా వ్యయం రూ.6,897 కోట్లకు చేరనుంది. ఈ పెరిగిన వ్యయాలకు నీటిపారుదలశాఖ రాష్ట్రస్థాయి స్థాయీ సంఘంలో చర్చించి ఆమోదించిన అనంతరం ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నారు.

# తెలంగాణ 'విజయ'కు కేంద్రం అనుమతి

**సాక్షి, హైదరాబాద్:** విజయ తెలంగాణ బ్రాండ్‌కు కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించింది. కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఏపీ, తెలంగాణ ఒకే విజయ బ్రాండ్ ఉపయోగిస్తుండటంతో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు విజయ తెలంగాణ లోగోతో కేంద్ర ప్రభుత్వ ట్రేడ్‌మార్క్ అథారిటీని సంప్రదించినట్టు తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ (టీఎస్‌డీడీసీఎఫ్) చైర్మన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



అన్ని అంశాలను పరిశీలించాక ఈ సంస్థ ట్రేడ్‌మార్క్ యాక్ట్–1999 ప్రకారం రిజిస్ట్రార్ ఆఫ్ ట్రేడ్‌మార్క్, విజయతెలంగాణ బ్రాండ్‌ను రిజిస్టర్ చేసి ధృవపత్రాన్ని జారీ చేసినట్లు తెలిపారు. ఇక నుంచి పాలు, పాల ఉత్పత్తులు విజయ తెలంగాణ బ్రాండ్‌తో మార్కెట్‌లో విక్రయించనున్నట్లు పేర్కొన్నారు.

# డిగ్రీ కాలేజీ షిఫ్టింగ్ అంత ఈజీ కాదు!

- నిబంధనల మార్పునకు ప్రభుత్వం చర్యలు

**సాక్షి, హైదరాబాద్:** ఒక మండలం నుంచి మరో మండలానికి ప్రైవేటు డిగ్రీ కాలేజీల షిఫ్టింగ్ ఇకపై అంత ఈజీ కాదు. ముఖ్యమంత్రి ఆమోదంతో మాత్రమే ప్రైవేటు డిగ్రీ కాలేజీలను షిఫ్ట్ చేసేలా నిబంధనల్లో మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మార్పుతో ఉన్నత విద్యా మండలి, విద్యాశాఖ మంత్రిపై ఒత్తిళ్లు లేకుండా చూడొచ్చని భావిస్తోంది. ఇప్పటివరకు మండల పరిధిలో ఒక ప్రాంతంనుంచి మరో ప్రాంతానికి కాలేజీని షిఫ్ట్ చేసేందుకు ఉన్నత విద్యా మండలి అనుమతి ఇస్తుండగా, ఒక మండలం నుంచి మరో మండలానికి కాలేజీని షిఫ్ట్ చేసేందుకు విద్యాశాఖ మంత్రి అనుమతి ఇస్తున్నారు. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు కాలేజీని షిఫ్ట్ చేయాలంటేనే ఫైలు సీఎంకు వెళ్లేది. కానీ ఇకపై ఆ పరిస్థితి లేకుండా నిబంధనలను మార్చే కసరత్తు మొదలైంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో అయితే జోన్‌ను పరిగణనలోకి తీసుకోవాలా? పాత మండలాలను పరిగణనలోకి తీసుకోవాలా అన్న దానిని ఖరారు చేసేందుకు ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలనిప్రభుత్వం నిర్ణయించింది.

# 2020 ఏడాదికి కార్మిక సెలవులు ఖరారు

**కార్మిక శాఖ ఉత్తర్వులు**

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ కార్మిక శాఖ 2020 సంవత్సరానికి కార్మిక సెలవులను ఖరారు చేసింది. తెలంగాణ స్టేట్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం ఈ సెలవులను నిర్ణయించింది. దీంతో పాటు జాతీయ సెలవులు, ఇతర పండుగ రోజుల్లో వారికి వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని యాజమాన్యాలను ఆదేశించింది. వచ్చే ఏడాదిలో తొమ్మిది రోజులు వేతనంతో కూడిన సెలవులున్నాయి. ఈమేరకు కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఇ.గంగాధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**వచ్చే ఏడాది వేతనంతో కూడిన సెలవులు ఇలా...**

| పండుగ | తేది |
|---|---|
| సంక్రాంతి | 15.01.2020 |
| రిపబ్లిక్‌డే | 26.01.2020 |
| మే డే | 01.05.2020 |
| రంజాన్ | 25.05.2020 |
| తెలంగాణ అవతరణ దినోత్సవం | 02.06.2020 |
| ఇండిపెండెన్స్ డే | 15.08.2020 |
| గాంధీ జయంతి | 02.10.2020 |
| దసరా | 25.10.2020 |
| క్రిస్మస్ | 25.12.2020 |

# 28న పెండింగ్ కేసులపై ప్రత్యేక సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** పెండింగ్ కేసుల పరిష్కారంపై హైకోర్టు దృష్టి సారించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను కొలిక్కి తేవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ తేల్చి చెప్పడంతో ప్రభుత్వం దీనికనుగుణంగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా ఈ నెల 28న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో పాటు అడ్వొకేట్ జనరల్, ప్రభుత్వ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైకోర్టు ప్రాంగణంలోని ఫుల్ కోర్టు మీటింగ్ హాల్‌లో ఈ ప్రత్యేక సమావేశం జరుగుతుందని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ సర్క్యులర్ జారీ చేశారు.



క్రిస్మస్ వేడుకల సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విందులో ముఖ్యమంత్రి కేసీఆర్ తదితరులు

# అందరినీ ఆదరిస్తాం

- నూటికి నూరు శాతం సెక్యులర్‌గానే ఉంటాం
- క్రిస్మస్ వేడుకల్లో సీఎం కేసీఆర్

**సాక్షి, హైదరాబాద్:** ఎవరికి ఏరకమైన అభ్యంతరాలు ఉన్నా తెలంగాణ రాష్ట్రం నూటికి నూరు శాతం సెక్యులర్ రాష్ట్రంగానే ఉంటుందని, ఇక్కడ అన్ని మతాలకు సమాన గౌరవం లభిస్తుందని, అందరినీ ఆదరించే రాష్ట్రమని సీఎం కె. చంద్రశేఖరరావు అన్నారు. భారతదేశం గొప్ప దేశమని ఇక్కడ జరుపుకున్నన్ని పండుగలు ప్రపంచంలో మరెక్కడా జరుపుకోరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇస్లామిక్ దేశాలలో రంజాన్, బక్రీద్ పండుగలు, ఇతర దేశాలలో నాలుగైదు పండుగలు జరుపుకుంటారని, కానీ భారతదేశంలో జరుపుకునేవి చాలా ఉన్నాయని అన్నారు. 'ఉత్సవాలు జరుపుకునే గుణం, సహనంతో పాటు మనుషులను ప్రేమించేతత్వం ఉంటే ఇది సాధ్యపడుతుంది. దానికి నా తెలంగాణ రాష్ట్రమే నిదర్శనం. ఇదే ఎల్‌బీ స్టేడియంలో ఇఫ్తార్, బతుకమ్మ, ఇప్పుడు క్రిస్మస్ పండుగలు జరుపుకొంటున్నాము'అని సీఎం అన్నారు. రాష్ట్రంలో తాగు నీరు, సాగునీరు సమస్య లేకుండా చేశామని, కరెంట్ సమస్యను పారదోలామని, పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, అన్ని సంక్షేమ పథకాలు అందరితో పాటు క్రైస్తవులకు అందిస్తున్నామని, ఎవరికైనా పథకాలు అందకపోతే మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి చెప్పాలని సూచించారు. త్వరలో క్రైస్తవ మత నాయకులను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటానని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది నుంచి రెండు పంటలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 70 లక్షల ఎకరాలకు సాగు నీరందించబోతున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. బిషప్ షపర్డ్ రెవరెండ్ గొల్లపల్లి జాన్, బిషప్ తుమ్మబాల, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి కోవింద్‌కు ఘన స్వాగతం

**శీతాకాల విడిది కోసం హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి దంపతులు**

**ఈ నెల 28 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస**

**సాక్షి, హైదరాబాద్:** శీతాకాల విడిది కోసం శుక్రవారం నగరానికి చేరుకున్న భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఘన స్వాగతం లభించింది. ప్రత్యేక విమానంలో హకీంపేట విమానాశ్రయంకు చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులను రాష్ట్రపతికి కేసీఆర్ పరిచయం చేశారు. రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో మంత్రులు మహమూద్ అలీ, కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సబిత ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్, ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు నగర మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. రాష్ట్రపతి రాకముందుకు హకీంపేట ఎయిర్‌పోర్టులో గవర్నర్ తమిళిసైతో సీఎం కేసీఆర్ కొద్దిసేపు ముచ్చటించారు. స్వాగత కార్యక్రమం తర్వాత గవర్నర్, హోం మంత్రి వెంట రాగా రాష్ట్ర పతి దంపతులు శీతాకాల విడిది బొల్లారం లోని రాష్ట్రపతి నిలయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా 'గవర్నర్‌గా వంద రోజులు'నివేదికతో పాటు, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ రాజ్‌భవన్ ముద్రించిన 'బతుకమ్మ తెలంగాణ ఫ్లోరల్ ఫెస్టివల్'పుస్తకాన్ని రాష్ట్రపతికి తమిళిసై అందజేశారు.

శీతాకాల విడిది కోసం శుక్రవారం రాష్ట్రానికి చేరుకున్న రాష్ట్రపతి కోవింద్ ఈ నెల 28 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారు. 22న రెడ్‌క్రాస్ సొసైటీ రూపొందించిన మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తారు. 23న పుదుచ్చేరిలో జరిగే పాండిచ్చేరి వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొని, 25న కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌ను సందర్శిస్తారు. ఈ నెల 27న బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు, అధికారులు, వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులతో రాష్ట్రపతి సమావేశమవుతారు.

**మీరేంటి ఇక్కడ..**

స్వాగతం సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డిని రాష్ట్రపతికి కేసీఆర్ పరిచయం చేశారు. మీరేంటి ఇక్కడ.. ఇటువైపు వచ్చారెందుకు.. అని గుత్తాను ఉద్దేశించి రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. గతంలో కోవింద్ రాజ్యసభ సభ్యుడిగా, తాను లోక్‌సభ సభ్యుడిగా పార్లమెంట్ ఎనర్జీ కమిటీలో సభ్యులుగా పనిచేసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. గుత్తా తనకు పాత స్నేహితుడని రాష్ట్రపతి చెప్పగా, తనకూ పాత స్నేహితుడే అని సీఎం సరదాగా అనడంతో నవ్వులు విరిశాయి.

# రాజకీయ జోక్యానికి చెక్!

▶ మొదటి పేజీ తరువాయి

అధ్యాపకుల నియామకాల్లో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించేలా నిబంధనల రూపకల్పనపై దృష్టి పెట్టింది. అంతేకాదు పోస్టులు పదుల సంఖ్యలో ఉండటం, అభ్యర్థులు వేల సంఖ్యలో ఉండటం వల్ల అంతమందికి నెలల తరబడి ఇంటర్వ్యూలు చేయాల్సి వస్తోంది. దాంతో ఇంట ర్వ్యూ బోర్డు ఉండే వారిని ప్రభావితం చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు పెడితే కనుక ఆ సమస్య లన్నీ తొలగిపోతాయని అధికారులు భావిస్తున్నారు. స్క్రీనింగ్ టెస్టును కూడా యూనివర్సిటీలు నిర్వహిం చకుండా టీఎస్‌పీఎస్సీ లేదా మరేదైనా థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించేలా కసరత్తు జరుగుతోంది. అందులో అర్హత సాధిం చిన వారిలో, పోస్టుల సంఖ్యను బట్టి ఒక్కో పోస్టుకు ముగ్గురిని ఇంటర్వ్యూకు ఎంపిక చేసి ఆ ముగ్గురికే ఇంటర్వ్యూలు నిర్వహిస్తే సమయం వృథా కాకపోవడమే కాకుండా, ప్రతిభావంతులే పోస్టులకు ఎంపిక అయ్యేలా చూడొచ్చని అధికారులు పేర్కొంటున్నారు. అప్పుడు దరఖాస్తు చేసుకున్న అందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించే అవసరం ఉండదు. మరోవైపు ఇంటర్వ్యూ ల్లోనూ కనీస, గరిష్ట మార్కుల విధానం తెస్తే ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వవర్గాలు భావిస్తున్నాయి. ఇంటర్వ్యూ బోర్డులో ఉన్న వారు ఇష్టారాజ్యంగా మార్కులు వేయకుండా, ఆశ్రిత పక్షపాతం చూపకుండా కట్టడి చేయవచ్చని పేర్కొంటున్నాయి.

**ఉన్నత స్థాయి కమిటీ ఆమోదించాకే..**

అధ్యాపక నియామకాల్లో తమ అనుయాయుల కోసం నోటిఫికేషన్‌లోనే రోస్టర్ విధానాన్ని మార్చేసిన సందర్భాలు ఉండటంతో రోస్టర్ కమ్ రిజర్వేషన్ విధానాన్ని క్రాస్ చేసేలా చర్యలు చేపట్ట నుంది. ఇందుకోసం విద్యా శాఖ కార్య దర్శి, కళాశాల విద్యా కమిషనర్, ఉన్నత విద్యా మండలి చైర్మన్, నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. యూనివర్సిటీ సిద్ధం చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు, రోస్టర్‌ను ఆ కమిటీ క్రాస్ చేసి, ఓకే చెప్పాకే జారీ చేసేలా నిబంధనలు తీసుకువచ్చేందుకు సిద్ధం అవుతోంది.

**వీసీల నియామకం తర్వాత..**

రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో మంజూరైన పోస్టులు 2,738 ఉండగా, అందులో 1,528 పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. అందులో 323 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండగా 687 అసోసి యేట్ ప్రొఫెసర్ పోస్టులు, 518 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న మొత్తం 1,528 పోస్టుల్లోనూ మొదటి విడతలో 1,061 పోస్టుల భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వీసీల నియామకం కాగానే నోటిఫికేషన్ జారీ చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో నిబంధనల రూపకల్పనపై దృష్టి సారించింది. అందులో స్క్రీనింగ్ టెస్టుతో పాటు ఇతర సంస్కరణలను అమలు చేయాలని భావిస్తోంది.

# అచ్చంపేట ఆస్పత్రిలో దారుణం

▶ మొదటి పేజీ తరువాయి

ఆరోపిస్తూ ఆస్పత్రిలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. తమకు విషయం చెప్పకుండా పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్ ఆసుపత్రికి రెఫర్ చేశారని మండిపడ్డారు.

**హైదరాబాద్ తీసుకెళ్లాకే తెలిసింది...**

బాధితురాలి భర్త సాయిబాబు మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రిల్లో తన భార్యకు పరీక్షలు చేయించినప్పుడు అందరూ బాగానే ఉందన్నారని చెప్పారు. అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మాత్రం తన భార్యకు సీరియస్‌గా ఉందని చెప్పడంతోనే హైదరాబాద్‌కు తీసుకెళ్లామన్నారు. కానీ అక్కడ ఆపరేషన్ చేసిన తర్వాత డాక్టర్లు చెబితేనే శిశువుకు తల లేని విషయం తెలిసిందన్నారు.

**తల్లిప్రాణం కాపాడటానికే రెఫర్ చేశాం..**

తల్లి గర్భంలో శిశువు పొట్ట లావుగా ఉందని రిపోర్టులలో చూశాక తెలిసిందని, ఆ విషయం కుటుంబ సభ్యులకు ముందుగానే చెప్పామని వైద్యులు సుధారాణి, తారాసింగ్ చెప్పారు. స్కానింగ్ రిపోర్టు లో కూడా శిశువు బరువుగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పామన్నారు. మహిళకు మొదటిసారి అబార్షన్ జరగ్గా ప్రస్తుతం రెండో కాన్పుకు ఆస్పత్రికి వచ్చిందన్నారు. గర్భంలోని శిశువు తలభాగం మెత్తగా ఉండటంతోనే లాగే సమయంలో బయటకు వచ్చిందని చెబుతున్నారు. కాగా, శిశువు తల భాగం అచ్చంపేట ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి పరిసరాల్లోనే ఉందని స్థానికులు అంటున్నారు.

**కలెక్టర్ విచారణ... ఇద్దరిపై వేటు**

ఈ సంఘటనపై నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఇన్‌చార్జి డీఎం హెచ్‌ఓ సుధాకర్‌లాల్ విచారణ చేపట్టారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆస్పత్రిలోనే ఉన్న కలెక్టర్... ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులతో వేర్వేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తారాసింగ్, డాక్టర్ సుధారాణిని సస్పెండ్ చేస్తూ డీఎంహెచ్‌ఓ ఉత్తర్వులు జారీ చేశారు.

# హైదరాబాద్‌లో కొనసాగిన 'పౌరసత్వ' ఆందోళనలు

**హైదరాబాద్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్‌సీ)లకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో శుక్రవారం కూడా ఆందోళనలు కొనసాగాయి. పాతబస్తీలోని మక్కా మసీదులో ప్రార్థనల అనంతరం ముస్లింలు నిరసనకు దిగారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు మక్కా మసీదుతోపాటు చార్మినార్ పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకుని కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మక్కా మసీదు వద్ద నిరసన తెలియజేయడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, ఇక్కడ ఆందోళన చేయవద్దని నిరసనకారులకు సూచించారు. ఈ సందర్భంగా 14 మందిని అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు.

# మహిళల ప్రతిభ వి–హబ్‌తో వెలుగులోకి

▶ మొదటి పేజీ తరువాయి

వ్యాపారవేత్తలు ఉన్నారని, 95 శాతం స్టార్టప్‌లను పురుషులే నెలకొల్పుతున్నారని చెప్పారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా, గణాంకాల పరంగా చూస్తే సాధించాల్సింది ఎంతో ఉందని వ్యాఖ్యానించారు. మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు రూ.15 కోట్ల కార్పస్ ఫండ్‌తో పాటు రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు గ్రాంటు రూపంలో ఇస్తున్నట్లు వివరించారు.

**వి–హబ్ పనితీరు స్ఫూర్తిదాయకం**

రాష్ట్రంలో స్టార్టప్ వాతావరణం పుంజుకోవడంలో వి–హబ్ కీలకపాత్ర పోషిస్తోందని, జీఐజీ ఆస్ట్రేలియన్ హైకమిషన్ వంటి అంతర్జాతీయ సంస్థలతో, ఇంటెల్, మైక్రోసాఫ్ట్, ప్రాక్టర్ అండ్ గాంబుల్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి కార్పొరేట్ సంస్థలతో వి–హబ్ భాగస్వామ్యం హర్షణీయమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మహిళా ఎంట్రప్రెన్యూర్స్ తమ ఆలోచనలను ఆచరణలోకి తెచ్చేందుకు అవసరమైన సాధన సంపత్తి సమకూర్చి ఉత్పత్తి దశకు తెచ్చేందుకు అవసరమైన విధానాలను ప్రభుత్వం రూపొందిస్తుందని చెప్పారు. వి–హబ్ ఎంట్రప్రెన్యూర్స్‌కు భూమి, పెట్టుబడి తదితరాలకు సంబంధించి సాయం అందిస్తామన్నారు. 'వింగ్స్'కార్యక్రమం మరింత మంది మహిళా ఎంట్రప్రెన్యూర్స్‌ను వెలుగులోకి తెచ్చేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. వి–హబ్ పురోగతిని సంస్థ సీఈవో దీప్తి రావుల వివరించగా, జాతీయ స్థాయిలో స్టార్టప్ అవార్డులను అందజేశారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, స్టార్టప్ ఇండియా హబ్ సీనియర్ మేనేజర్ జస్లీన్ లాంబా తదితరులు పాల్గొన్నారు.

# వికేంద్రీకరణకే మొగ్గు

▶ మొదటి పేజీ తరువాయి

వికేంద్రీకరించాలని సలహానిచ్చింది. కమిటీ సుమారు 10,600 కిలోమీటర్లు రాష్ట్రమంతా పర్యటించి రాజధాని, అభివృద్ధి అంశాలపై అధ్యయనం చేసింది. సీఎంకి నివేదిక అందచేసిన అనంతరం కమిటీ కన్వీనరు జీఎన్ రావు, సభ్యులు విజయమోహన్, ఆర్.అంజలీ మోహన్, డాక్టర్ మహావీర్, డాక్టర్ సుబ్బారావు, కేటీ రవీంద్రన్, అరుణాచలంలు మీడియాతో మాట్లాడారు.

**తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి**

రాష్ట్రంలోని విశాల తీర ప్రాంతంతో పాటు, శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు దాదాపు 900 కి.మీ. తీర ప్రాంతమంతా అభివృద్ధి చేయాలి. ఆర్థిక పురోగతితో పాటు, ఉపాధి కల్పన దిశగా పనులు చేపట్టాలి. రాష్ట్రంలోని గోదావరి, కృష్ణ, వంశధార, నాగావళి, మహేంద్రతనయ తదితర నదుల పరివాహక ప్రాంతాలను అభివృద్ధి చేసి.. అక్కడ అన్ని వసతులు కల్పించాలి.

1. రాయలసీమలో అనంతపురం, కర్నూలు జిల్లాలను అభివృద్ధి చేయడం ద్వారా ప్రాంతీయ అసమానతలు తగ్గించేందుకు కృషి చేయాలి. అమరావతిలోని కొన్ని అధికార వ్యవస్థలను అక్కడకి తరలించడం ద్వారా ఆ ప్రాంతం అభివృద్ధి చెంది అక్కడ ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
2. అన్ని జిల్లాల్లోని సహజ వనరుల మేరకు సమగ్ర మార్గదర్శకాలను రూపొందించి అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలి.
3. గిరిజనులు, మత్స్యకార వర్గాలకు కూడా తగిన ప్రాధాన్యమిస్తూ వారి అభివృద్ధికి అనుగుణంగా పెట్టుబడి, అభివృద్ధి ప్రణాళిక తయారుచేయాలి.
4. రాయలసీమలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను అత్యధిక ప్రాధాన్యమిచ్చి పూర్తి చేయాలి.
5. పొడవైన తీర ప్రాంతంలోని వైవిధ్య భరితమైన పర్యావరణం, మడ అడవులు, బీచ్‌ల్ని పరిరక్షిస్తూ అభివృద్ధి చేయాలి.
6. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ కొత్త పోర్టులు ఏర్పాటు చేయాలి. రెండు పోర్టుల మధ్య కనీస దూరం, రోడ్డు, రైలు సౌకర్యాల్ని దృష్టిలో పెట్టుకుని కొత్త పోర్టులు నెలకొల్పాలి.
7. విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తకుండా, ప్రభుత్వమే సౌర విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై దృష్టి పెట్టాలి.
8. ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి.



శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌కు నివేదికను అందజేస్తున్న జీఎన్‌రావు, కమిటీ సభ్యులు. చిత్రంలో మంత్రి బొత్స తదితరులు

**ప్రధాన సిఫార్సులు..**

- మహారాష్ట్ర, జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్టు రాష్ట్రంలో అమరావతి, విశాఖపట్నంలో శాసన(లెజిస్లేచర్) వ్యవస్థ ఉండాలి. అసెంబ్లీ అమరావతిలో ఉన్నా.. వేసవికాల సమావేశాలు విశాఖలో నిర్వహించాలి. విశాఖపట్నంలో సచివాలయం, హెచ్ఓడీ కార్యాలయాలు, సీఎం క్యాంపు కార్యాలయం, హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి. అమరావతిలో అసెంబ్లీతో పాటు హైకోర్టు బెంచ్, సీఎం క్యాంపు కార్యాలయం, రాజ్‌భవన్ ఉండాలి. శీతాకాల అసెంబ్లీ సమావేశాలు అమరావతిలో నిర్వహించాలి.
- అన్ని ప్రభుత్వ విభాగాలను ఒకేచోట ఉంచాల్సిన అవసరం లేదని కె.సి.శివరామకృష్ణన్ కమిటీ చెప్పింది. అమరావతిలో భూమి తీరు, వరద ప్రభావం తదితర అంశాల కారణంగా రాజధాని కార్యకలాపాల్ని ఇతర నగరాలకు వికేంద్రీకరించాలి. ఇక్కడ దాదాపుగా పూర్తైన నిర్మాణాలను వినియోగంలోకి తీసుకురావాలి. అమరావతిలో ప్రతిపాదిత నిర్మాణాల్ని తగ్గించాలి. ఎన్జీటీ ఆదేశాల ప్రకారం రివర్ ఫ్రంట్ నిర్మాణాలు ఉండరాదు. వరద ముంపు నుంచి రక్షణ కోసం చేపట్టిన నిర్మాణాలు పూర్తి చేయాలి.
- శ్రీబాగ్ ఒడంబడికను గౌరవించేలా కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి.
- పరిపాలన వికేంద్రీకరణ ద్వారా నిరుపేదల సమస్యలను సత్వరం పరిష్కారం దొరుకుతుంది. ఉదాహరణకు.. శ్రీకాకుళంలో ఉండే ఒక పేదవాడు సమస్య పరిష్కారం కోసం రాజధాని వరకు రావాల్సిన అవసరం లేకుండా.. పరిపాలన వికేంద్రీకరణ జరగాలి. అమరావతి ప్రాంతంలో రాజధాని ఎలాగూ ఉంటుంది కాబట్టి, అక్కడ ఏ సమస్యా లేదు.

**అమరావతిలో రాజధాని నిర్మాణాలు వద్దు**

అమరావతిలో కొన్ని ప్రాంతాలు వరద ముంపునకు గురవుతాయి... అందువల్ల రాజధానికి సంబంధించిన నిర్మాణాలు వద్దు. అమరావతిలో ఇప్పటికే పెట్టిన వ్యయం వృథా కాకుండా చూడాలి. తుళ్లూరు ప్రాంతంలో గత ప్రభుత్వం చాలా పెట్టుబడి పెట్టింది. అందువల్ల ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాల్ని పూర్తి చేసి శాఖల వారీగా వాడుకోవాలి. ప్రస్తుతం అమరావతిలో జరుగుతున్న పనులను సమీక్షించి తదనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. అమరావతిలో డిజైన్లన్నీ భారీ ఖర్చుతో కూడినవి కావడంతో వీటిని మార్చి.. ఉన్న వనరులతో మిగతా నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలి. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నిర్వహించుకునేలా, రాజధాని కార్యకలాపాల వికేంద్రీకరణ తర్వాత ఇక్కడ ఉండాల్సిన ప్రభుత్వ విభాగాలు కార్యకలాపాలు నిర్వహించు కునేలా ఏర్పాట్లు ఉండాలి. అమరావతి ప్రాంతంలో రైతులంతా తమకు భూములు ఇవ్వాలని కోరారు. అదే విషయాన్ని ప్రభుత్వానికి సూచించాం.


శుక్రవారం హైదరాబాద్‌లో చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు

# మనుషులు మృగాలుగా మారుతున్నారు

- ప్రవచనాలు సద్గుణాలు, భక్తిభావాన్ని పెంపొందిస్తాయి
- చాగంటి ప్రవచనాల ముగింపు కార్యక్రమంలో సీఎం

**సాక్షి, హైదరాబాద్:** 'ఈ మధ్య మనసుకు చాలా బాధ కలిగించే అంశాలు చూస్తున్నాం. మానవ ప్రవృత్తి మరిచి కొందరు మృగాలుగా మారుతున్నారు. ప్రవచనాలు సద్గుణాలు, భక్తిభావాన్ని పెంపొందిస్తాయి'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు భాగవత సప్తాహం ప్రవచనాల ముగింపు కార్యక్రమంలో సీఎం కేసీఆర్ దంపతులు పాల్గొని ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ 'భగవంతుని గురించి చెప్పేవాళ్లు, వినేవాళ్లు చాలా మంది ఉంటారు. భగవంతుని గురించి చదివినా, విన్నా, చెప్పినా పుణ్యం వస్తుందని అందరి విశ్వాసం. మాకు కోరికలు ఉన్నా కొన్ని నెరవేరవు. అందుకే మిగతా కార్యక్రమాలు రద్దు చేసుకుని వచ్చా. నేను దైవాన్ని పూర్తిగా విశ్వసించే వ్యక్తిని. ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అనుకోను. ఎవరికీ భయపడను. పూర్తిగా భక్తి ప్రపత్తితో చేసే పనులు సమాజానికి లోక కల్యాణానికి ఉపయోగపడతాయి'అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కలడు కలడందురు అన్ని దిశల, సిరికింజెప్పడు.. వంటి పద్యాలను చదువుతూ గజేంద్రమోక్షం, ద్రౌపదీ వస్త్రాపహరణం వంటి ఘట్టాలను కేసీఆర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ప్రవచనకారుడు చాగంటి కోటేశ్వరరావు మానవ జాతికి దొరికిన మణిపూసగా సీఎం అభివర్ణించారు.

## 'చారిత్రక ప్రదేశాలపై నిర్లక్ష్యం తగదు'

**బంజారాహిల్స్:** చారిత్రక ప్రదేశాలపై నిర్లక్ష్యం తగదని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ హైదరాబాద్ ఆండ్రూ ఫ్లెమింగ్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం 3లోని షేక్‌పేట మండల కార్యాలయం వెనకాల ఉన్న ఓ పురాతన భవనానికి సంబంధించిన ఫొటోలను ఆయన ట్వీట్ చేశారు. 1922లో నిర్మించిన ఈ భవనం గత 40 ఏళ్లుగా ఎవరూ లేకపోవడంతో మూలనపడింది. ప్రస్తుతం పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, బూజు, రంగువెలిసిన గోడలు, శిథిలావస్థకు చేరిన స్లాబుతో అధ్వానంగా మారింది. సంబంధిత అధికారులు ఈ హెరిటేజ్ భవనాన్ని గుర్తించి దీన్ని లైమ్‌లైట్‌లోకి తీసుకురావాలని వీటి పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. స్వయంగా ఆండ్రూ ఫ్లెమింగ్ ఈ ట్వీట్ చేయడంతో ఇప్పుడు అందరి కళ్లు ఈ చారిత్రక భవనంపై పడ్డాయి.

# రిమాండ్‌లోని ముగ్గురూ హైకోర్టులో హాజరు

**హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణకు తెర**

సాక్షి, హైదరాబాద్:

హైదరాబాద్‌లో ముగ్గురిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని పేర్కొంటూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ ముగిసినట్లుగా హైకోర్టు ప్రకటించింది. చైతన్య మహిళా సంఘం సంయుక్త కార్యదర్శులు డి.దేవేంద్ర, ఎం.స్వప్న, తెలంగాణ విద్యార్థి వేదిక ప్రధాన కార్యదర్శి ఎం.సందీప్‌లను పలు కేసుల్లో అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారని, ఇక ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. హన్మకొండలోని చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు అనిత దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ ముగ్గురినీ హైకోర్టులో హాజరుపర్చాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ముగ్గురినీ హైకోర్టులో హాజరుపర్చారు. ముగ్గురి నుంచి సీఆర్‌పీసీలోని 164 సెక్షన్ కింద స్టేట్‌మెంట్‌ను నమోదు చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ధర్మాసనం ఆదేశించింది. పోలీసులు తమ ఇంటికి వచ్చి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తీసుకువెళ్లారని దేవేంద్ర ఆరోపించారు. మావోయిస్టు సాహిత్య పత్రాలను పోలీసులు తన ఇంట్లో పెట్టి.. వాటిని స్వాధీనం చేసుకున్నట్లుగా చూపారని తెలిపారు. తన భర్త ప్రభాకర్ మావోయిస్టుగా ఉండగా 2016లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారని, తనకు మావోయిస్టులతో సంబంధాలు లేవని చెప్పారు. పోలీసులు జీవించే హక్కులను దెబ్బతీశారని, ఆ ముగ్గురికీ మావోయిస్టులతో సంబంధాలు లేవని పిటిషనర్ల తరఫు న్యాయవాది రఘునాథ్ వాదించారు. ఈఅంశాలపై వేరే రూపంలో న్యాయపోరాటం చేసేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఉందని.. హెబియస్ కార్పస్ పిటిషన్‌లో తమ పరిధి పరిమితమని ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయవాది వినతి మేరకు ఆ ముగ్గురితో వారి తల్లిదండ్రులు అరగంటపాటు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయంలో కలుసుకుని మాట్లాడుకునేందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.



# సామాజిక స్పృహతోనే అభివృద్ధి సాధ్యం : ఎర్రబెల్లి

**సాక్షి, హైదరాబాద్:** సామాజిక స్పృహతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవ చేసే భాగ్యం అందరికి రాదని, అలాంటి అదృష్టం లభించిన మండల పంచాయతీ అధికారులు (ఎంపీవో) పనితీరుతో ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. శుక్రవారం నూతనంగా ఎంపికైన ఎంపీవోల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ఎంపీవోలుగా నియమితులైన మీరు చాలా అదృష్టవంతులు. మంచి పనితీరుతో తల్లిదండ్రులకు, ఊరికి పేరు తీసుకురావాలి. వృత్తిలో రాణింపుతో గౌరవం పెంచుకోవాలి'అని సూచించారు. విధి నిర్వహణలో చెడు కనిపిస్తే ఊరుకోవద్దని, పల్లెల అభివృద్ధి బాధ్యత ఎంపీవోలదేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో వైకుంఠధామాలు, నర్సరీలు, డంపింగ్ యార్డును నిర్మించాలని ఆదేశించారు.






# 28న భారీ ర్యాలీ: టీపీసీసీ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 28న కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'సేవ్ ఇండియా, సేవ్ కాన్స్టిట్యూషన్'నినాదంతో హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించింది. గాంధీభవన్ నుంచి ర్యాలీ ప్రారంభించి అబిడ్స్‌లోని పండిట్ నెహ్రూ విగ్రహం మీదుగా ట్యాంక్‌బండ్ వద్ద గల డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు. ఈ నిరసన కార్యక్రమంలో నగర వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనేలా చూడాలని సూచించారు. శుక్రవారం గాంధీభవన్‌లో నగర నాయకులు, ప్రధాన కార్యదర్శులు, నియోజక వర్గ ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు కుసుమ కుమార్, అంజన్‌కుమార్ యాదవ్, మధుయాష్కీ తదితరులు పాల్గొన్నారు.

## మజ్లిస్‌కు భయపడే టీఆర్‌ఎస్ అలా చేసింది



సాక్షి, హైదరాబాద్: మతోన్మాద మజ్లిస్ పార్టీకి భయపడే పౌరసత్వ చట్టం సవరణకు వ్యతిరేకంగా టీఆర్‌ఎస్ ఓటు వేసిందని బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, వామపక్షాలు, అర్బన్ నక్సలైట్లు, టీఆర్‌ఎస్, మజ్లిస్ కలిసి పౌరసత్వ సవరణ చట్టంపై గందరగోళం సృష్టిస్తున్నాయని, ఆలోచన రహితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. మతోన్మాద ఒవైసీ ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 12 శాతం ఓట్ల కోసం సీఎం.. ఒవైసీకి వత్తాసు పలుకుతున్నారని ఎద్దేవాచేశారు. కేసీఆర్ తప్పిదాలను ప్రజలు లెక్కపెడుతున్నారని, శిశుపాలుని తరహాలో టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు వధించే రోజు వస్తుందన్నారు. పౌరసత్వ చట్టం సవరణపై శనివారం ఢిల్లీలో సమావేశం ఉందని, ఈ నెల 22న హైదరాబాద్‌లోని కత్రియా హోటల్‌లో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

## సీఎం పత్రికా ముఖంగా చెప్పగలరా?



సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి హైదరాబాద్‌కు వచ్చి అక్రమంగా ఉంటున్న ముస్లింలకు చట్టబద్ధత కల్పించేందుకు కేంద్రం తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని టీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తుందా? అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దమ్ము, ధైర్యముంటే సీఎం కేసీఆర్, కేటీఆర్ ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి ఆ చట్టాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలన్నారు. అక్రమంగా వచ్చి ఉంటున్న వారికి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఇచ్చేందుకే టీఆర్‌ఎస్ పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తుందా? చెప్పాలని డిమాండ్‌చేశారు. కొన్ని స్కూళ్లు పౌరసత్వ చట్టం సవరణకు వ్యతిరేకంగా విద్యార్థులకు నూరిపోస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అలాంటి పాఠశాలలపై దేశ ద్రోహం కేసులు పెడతామన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక రాష్ట్రంలో వర్సిటీలను, జీహెచ్‌ఎంసీ, అంగన్‌వాడీ, సింగరేణి, ఆర్టీసీలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

## మద్యం నియంత్రణకు 23న ధర్నా: సీపీఐ

సాక్షి, హైదరాబాద్: హత్యలు, అత్యాచారాలకు కారణమవుతున్న మద్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న హైదరాబాద్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఐ ప్రకటించింది. ఈ అంశంపై పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజాపోరులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హైదరాబాద్ సమితి కార్యదర్శి ఇ.టి. నరసింహ ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం అమ్మకాలతో పేదల బతుకులు బుగ్గిపాలు కావడంతోపాటు నేరాలు పెరుగుతాయని ప్రభుత్వానికి తెలిసినా మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తూ ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు.

## గ్రూప్స్ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

### టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌కు వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ లెక్చరర్ల భర్తీతో పాటు గ్రూప్–1, 2, 3, 4 ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ డిమాండ్‌చేశారు. జోనల్ సమస్యలు పరిష్కరించకుండా, నోటిఫికేషన్ల విడుదలలో జాప్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈమేరకు శుక్రవారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణికి.. మానవతారాయ్, ఓయూ నిరుద్యోగ జేఏసీ నేతలు కుంటా సురేశ్, ల్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, సురేశ్‌నాయక్, బానోత్ ఠాగూర్‌లు వినతిపత్రం సమర్పించారు.

## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను నియమించాలి: ఇందిరాశోభన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీసుకొస్తున్న ఒత్తిడి కారణంగానే మానవ హక్కుల కమిషన్ చైర్మన్, లోకాయుక్త, ఉపలోకాయుక్తలను సర్కార్ నియమించిందని టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొంతకాలంగా ఈ అంశాన్ని ప్రధాన ఎజెండాగా ముందుంచి అనేకసార్లు ధర్నాలు, మౌన దీక్షల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా రెండుసార్లు గవర్నర్ తమిళిసైను కలసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న వరుస హత్యాచారాల నేపథ్యంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు.

గిరిజన సహకార సంస్థ లి., భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
ఎలక్ట్రానిక్ టెండర్ ప్రకటన
Rc.No. 48/2019-D Date: 20-12-2019
గిరిజన సంక్షేమ పాఠశాలలకు అవసరమగు నిత్యావసర వస్తువులు కొనుగోలు కొరకు పేరెన్నికగల Whole Sale వ్యాపారస్తులు, డిస్ట్రిబ్యూటర్ల నుండి ఈ-టెండర్లు కోరబడుచున్నవి. ఇతర వివరముల కొరకు వెబ్‌సైట్. http://www.mstcecommerce.com/eprochome/tsgcc/ వారిని సంప్రదించగలరు.
సం/- వి.పి.గౌతమ్, I.A.S. ప్రాజెక్ట్ అధికారి, ఐ.టి.డి.ఏ. / ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జి.సి.సి., భద్రాచలం.

- ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు కాగితాలకే పరిమితమైన నేపథ్యంలో మహిళా సమస్యల పరిష్కారానికి, చట్టాల అమలు కోసం పోరాడాల్సిన అవసరముందని భారత మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జాతీయ ఉపాధ్యక్షురాలు దుర్గా భవాని అన్నారు. శుక్రవారం మఖ్దూంభవన్‌లో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర నిర్మాణ మహాసభలో ఆమె మాట్లాడారు. చట్టాల అమలులో చిత్తశుద్ధి లోపించిందన్నారు.

సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం
తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ :: హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
టెండరు నోటీసు నెం. SE/TSEWIDC/HYD/NIT/651 to 666/2019-20 తేది: 19-12-2019
తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, KGBV భవనాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరియు మోడల్ స్కూల్‌కు బాలికల హాస్టళ్లలో SC/ST హాస్టళ్ళ నిర్మాణం కోసం అర్హత గల కాంట్రాక్టర్లందరి నుండి టెండర్లు కోరబడుచున్నవి. (రూ.62.83 నుండి 335.00 లక్షలు) (1వ, 2వ, 3వ మరియు 8వ పిలుపు). ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు మరియు స్వీకరణకు చివరి తేది: 04-01-2020 సా.4:00 గం.వరకు. గమనిక: ధర సర్దుబాటు GO MS.No.94 ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్, రహదారులు & భవనాలు (R.1) శాఖ, తేది: 16-04-08 ప్రకారం మాత్రమే వర్తిస్తుంది. అనగా స్టీల్ మరియు సిమెంట్ కొరకు మాత్రమే. పూర్తి వివరాలను https://tender.telangana.gov.in లో చూడవచ్చును లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, TSEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, E-గేట్ ఎదురుగా L.B.స్టేడియం, హైదరాబాద్. ఫోన్: 23326692 వారిని స్వయంగా సంప్రదించవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TSEWIDC, హైదరాబాద్
DIPR RO.No.559-PP/CL/Advt/1/2019-20, Dt: 20-12-2019

శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా
ఇ-టెండరు-పేపర్ టెండరు-కం-బహిరంగ వేలము
ఆర్.సి. నం. బి4/1293/2019 తేది: 17.12.2019
దేవస్థానమునకు చెందియున్న ఈ క్రింది అంశములను లీజుకు ఇచ్చుటకు గాను ఇ-టెండర్-పేపర్ టెండర్-కం-బహిరంగ వేలము నిర్వహించబడును.
1. వేములవాడ పట్టణమందు దేవస్థానమునకు చెందియున్న దుకాణములను రెండు సంవత్సరముల కాలం పాటు లీజుకిచ్చుట. 2. వేములవాడ పట్టణ జాతరా గ్రౌండ్ నందు దేవస్థానమునకు చెందియున్న డార్మెటరి-I & డార్మెటరి-II లను మినీ కళ్యాణ మండపములుగా నిర్వహించుకొనుటకు రెండు సంవత్సరముల కాలం పాటు లీజుకిచ్చుట. 3. వేములవాడ పట్టణమందు దేవస్థానమునకు చెందియున్న ప్లాట్లను రెండు సంవత్సరముల కాలం పాటు లీజుకిచ్చుట. 4. వేములవాడ పట్టణ జాతరా గ్రౌండ్ నందు దేవస్థానమునకు చెందియున్న టేలా స్థలములను రెండు సంవత్సరముల కాలం పాటు లీజుకిచ్చుట. 5. కరీంనగర్ పట్టణమందు దేవస్థానమునకు చెందియున్న సంస్కృత పాఠశాల దుకాణ సముదాయము నందలి దుకాణములను రెండు సంవత్సరముల కాలం పాటు లీజుకిచ్చుట. 6. కరీంనగర్ పట్టణమందు దేవస్థానమునకు చెందియున్న శ్రీ రాజేశ్వర కళ్యాణ మండపమును (జిల్లా కోర్టు భవనము ప్రక్కన గలది) రెండు సంవత్సరముల కాలం పాటు లీజుకిచ్చుట.
బహిరంగ వేలము జరుగు తేది: 09.01.2020. ఆసక్తి గలవారు https://tender.telangana.gov.in నకు లాగ్ ఆన్ చేసి పూర్తి వివరములు పొందవచ్చును. అట్లే దేవస్థానం లీజుల విభాగము నందు కూడా పూర్తి వివరములు తెలుసుకొనవచ్చును. పూర్తి వివరములకై సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9490525578, 8121269879, 9963607403.
సం/- కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఎ.సి)
DIPR.Ro.No. 558-PP/CL/ADVT/1/2019-20, Dt 20/12/2019

# ఎన్‌ఆర్సీపై ఆందోళన వద్దు..



'సాక్షి' ఇంటర్వ్యూలో హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి

- ప్రజాభిప్రాయం స్వీకరించాకే చట్టం తెస్తాం
- పౌరసత్వ సవరణ అంతా రాజ్యాంగబద్ధమే
- సవరణ న్యాయ సమీక్షలో నెగ్గుతుంది
- హింసకు పాల్పడితే తప్పించుకోలేరు
- రాజకీయ పార్టీల కుట్రలో ఇరుక్కోవద్దు
- మోదీపై కక్షతో పౌరసత్వ సవరణను వ్యతిరేకించొద్దు
- అంతర్జాతీయ సమాజం ముందు పలుచన చేయొద్దు

**సాక్షి, న్యూఢిల్లీ: ఎన్‌ఆర్సీపై ఆందోళన అక్కర్లేదని, ప్రజల అభిప్రాయాలు స్వీకరించాకే సంబంధిత చట్టం తెస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. పౌరసత్వ సవరణ చట్టం పూర్తిగా రాజ్యాంగబద్ధంగా ఉందని, న్యాయ పరీక్షలో సైతం నెగ్గుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు రాజకీయ పార్టీల కుట్రల్లో ఇరుక్కోవద్దని, హింసకు పాల్పడితే చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. శుక్రవారం ఆయన పౌరసత్వ సవరణ చట్టం, ఎన్‌ఆర్సీ, దేశవ్యాప్తంగా ఆందోళనలకు సంబంధించిన అంశాలపై 'సాక్షి'తో మాట్లాడారు..**

### ముఖ్యాంశాలు ఇవీ..

**పౌరసత్వ చట్ట సవరణ, ఎన్‌ఆర్సీ అంశాలపై దేశవ్యాప్తంగా ఆందోళన విస్తృతమవుతుండటానికి కారణాలేంటి?**

✔ పౌరసత్వ సవరణ చట్టంలో ఒక మతానికి, ఒక ప్రాంతానికి, ఒక వ్యక్తికి, ఒక భారతీయుడికి గానీ వ్యతిరేకమైన అంశం ఒక్కటీ లేదు. గతంలో మన దేశానికి, పాకిస్తాన్‌కు జరిగిన ఒప్పందాన్ని పాకిస్తాన్ ఉల్లంఘించింది. అక్కడ మైనారిటీలకు పాకిస్తాన్ రక్షణ కల్పించలేదు. సామూహిక మతమార్పిళ్లు, సామూహిక అత్యాచారాలు, మత హింస, మత వివక్ష మరణాలపై పాకిస్తాన్ స్పందించలేదు. వారంతా మన దేశానికి శరణార్థులుగా వచ్చి ఇక్కడ 30, 40 ఏళ్లుగా మురికివాడల్లో ఉంటున్నారు. వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనకు ఉంది. కొన్ని పార్టీలు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తూ, మతపరంగా ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఈశాన్య ప్రాంతాల ఆందోళనను అర్థం చేసుకోవచ్చు. అక్కడ ఇబ్బంది ఉంటుందనే అన్ని రకాల వెసులుబాట్లు చట్టంలో పొందుపరిచాం. కానీ యూపీ, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ధర్నా చేయాల్సిన అవసరం ఏంటి?

**ఈ చట్టం రాజ్యాంగ లౌకిక భావనలకు విరుద్ధంగా ఉందని, ముస్లింలు అభద్రతకు లోనవుతున్నారని విపక్షాలు చేస్తున్న విమర్శలపై ఎలా స్పందిస్తారు?**

✔ మన దేశం లౌకిక దేశం. ముస్లింలు ఎవరూ ఈ బిల్లు తమకు వ్యతిరేకమని అనుకోలేదు. పార్టీలే వారిని ప్రేరేపిస్తున్నాయి. చట్టంలో పొందుపరిచిన మూడు ఇస్లామిక్ దేశాల్లో ముస్లింలపై వివక్ష ఉండదు. మైనారిటీలే వివక్షకు గురయ్యారు. మన దేశంలో మైనారిటీలైనా, మెజారిటీలైనా గౌరవంగా చూస్తాం. భారత రాజ్యాంగమే మా మతం. రాజ్యాంగ పరిధిలోనే ఈ చట్టాన్ని తెచ్చాం. చొరబాటుదారులకు, శరణార్థులకు మధ్య వ్యత్యాసాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

**శ్రీలంక, నేపాల్ వంటి దేశాల్లో కూడా హిందువులు మైనారిటీలుగా ఉన్నారు కదా?**

✔ పాకిస్తాన్ నుంచి 40 ఏళ్ల క్రితమే వచ్చి వాళ్లు మురికివాడల్లో ఉంటున్నారు. రక్షిత మంచినీరుకు కూడా వారు నోచుకోలేదు. అక్కడ కనీస మౌలిక వసతుల స్థాపనకు కూడా ఖర్చు పెట్టలేని స్థితి. వారంతా దుర్భర జీవితం గడుపుతున్నారు. శ్రీలంక వంటి దేశాల నుంచి వచ్చిన కొన్ని లక్షల మందికి పౌరసత్వం ఇచ్చాం. ఉగాండా నుంచి వచ్చిన హిందువులకు ఇచ్చాం. కానీ పాకిస్తాన్ నుంచి వచ్చిన వారికి ఇవ్వలేదు. ఇప్పుడు ఈ మూడు ఇస్లామిక్ దేశాల్లో మైనారిటీలుగా ఉండి మత వివక్షకు గురైన వారికి ఇస్తున్నాం తప్ప ఇక్కడ మత వివక్ష లేదు.

**ఈ చట్టాన్ని ఎన్‌ఆర్సీతో కలిపి చూడాలని, హిందువులకు మాత్రమే పౌరసత్వం ఇస్తారని, ఆధారాలు చూపలేని ముస్లింలను వెళ్లగొట్టే పరిస్థితి వస్తుందని వెల్లువెత్తుతున్న ఆందోళనపై మీ స్పందన?**

✔ కొన్ని రాజకీయ పార్టీలు, ఎన్జీవో సంస్థలు ఈ దిశగా రెచ్చగొడుతున్నాయి. ఎన్‌ఆర్సీ బిల్లు ముసాయిదా కూడా రూపొందలేదు. లేనిది ఊహించుకుని మాట్లాడటం అర్థరహితం.

**శరణార్థులను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురైతే వారు నష్టపోయే పరిస్థితి ఉండదా?**

✔ గుర్తించడం కష్టమేమీ కాదు. మతం ఆధారంగా, భాష ఆధారంగా గుర్తించొచ్చు. వారి వద్ద ఉన్న ఆధారాలతో గుర్తించొచ్చు. పోలీస్ స్టేషన్లలో ఉన్న రికార్డుల ఆధారంగా గుర్తించొచ్చు.

**హిందువులు సహా ఏ ఒక్కరికీ పౌరసత్వం ఇవ్వొద్దని ఈశాన్య రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. వారికి ఎలాంటి భరోసా ఇస్తున్నారు?**

✔ ఈశాన్య రాష్ట్రాల్లో చాలా రోజులుగా ఈ ఆందోళన జరుగుతోంది. వారి హక్కుల రక్షణకు వీలుగా కొన్ని నిబంధనలు పొందుపరిచాం. వారి సెంటిమెంటును గౌరవించాలన్న ఆలోచనతో ఉన్నాం. అస్సాం ఒప్పందం అమలు కాలేదు. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం వచ్చాక ప్రజా సంఘాలతో కమిటీ ఏర్పాటు చేశాం.

**సుప్రీం కోర్టులో ఈ చట్టానికి వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలయ్యాయి. న్యాయ పరీక్షలో ఈ చట్టం నెగ్గుతుందా?**

✔ న్యాయ సమీక్ష మీద నమ్మకం ఉన్నప్పుడు వీధి పోరాటం ఎందుకు? మోదీ ప్రభుత్వం ఎవరి హక్కును కాదనట్లేదు. మా చట్టం న్యాయ పరీక్షలో నెగ్గుతుంది.

**ఈ చట్టం ఒక మతంపై వివక్ష చూపుతోందని అంతర్జాతీయ సంస్థలు భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీన్ని ఎలా చూస్తారు?**

✔ మన నాయకులే దుష్ప్రచారానికి దిగితే బయటివాళ్లు ఎందుకు అనరు?

**ఈ ఉద్యమాలకు, ఆందోళనలకు ముగింపు పలికేందుకు కేంద్ర హోం శాఖ ఎలాంటి చర్యలు తీసుకోబోతోంది?**

✔ ఆందోళనకారులు, బిల్లుకు వ్యతిరేకంగా ఆలోచిస్తున్నవారు మీరు నరేంద్ర మోదీపై ఉన్న కక్షతో ఈ చట్టాన్ని వ్యతిరేకించకండి. ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. ఆందోళనకారులకు ఒకటే విజ్ఞప్తి. ముందు ఒకసారి చట్టాన్ని చదవండి. ప్రశ్నించండి. అంతేగానీ మోదీపై కక్షతో దేశాన్ని ప్రపంచంలో పలుచన చేయొద్దు. పార్టీల కుట్రలో భాగస్వాములు కావొద్దు. బస్సులు తగలబెట్టినా, హింసకు దిగినా ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోలేరు. పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత ప్రతి ఒక్కరిపై కేసులు పెట్టాల్సిన పరిస్థితి వస్తుంది. ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తి లేదు.

**విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. వారిని ఎలా శాంతింపజేస్తారు?**

✔ విద్యార్థులు ఆలోచించాలి. వారి ఉద్యమం ఎందుకోసమో? ఎవరికోసమో పునరాలోచించాలి. ఈ చట్టం ఎవరికీ వ్యతిరేకం కాదు. రాజకీయ పార్టీలు చెప్పాయని గుడ్డిగా ఆందోళనకు దిగొద్దు. మా నుంచి అణచివేత ఎంతమాత్రం లేదు. ఉంటే ఈస్థాయిలో నిరసనలు జరిగేవి కావు. ప్రజాస్వామ్యపద్ధతిలో నిరసనలు చేయండి.

## నగరంలో హడలెత్తించిన జీఎస్టీ దాడులు

- మూడు రోజులు కొనసాగిన దాడులు
- మొత్తం రూ.60 కోట్లకుపైగా పన్ను ఎగవేసినట్లు గుర్తింపు
- ఓ సినీ హీరో, హీరోయిన్ వ్యాపార సంస్థలు, ఇళ్లలో సోదాలు

సాక్షి, హైదరాబాద్: గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (జీఎస్టీ) అధికారులు దూకుడు పెంచారు. శుక్రవారం నగరంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తోపాటు 23 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. రూ.కోట్లలో సర్వీస్ ట్యాక్స్, జీఎస్టీ ఎగవేశారన్న ఆరోపణల నేపథ్యంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్(డీజీజీఐ) అధికారులు జూబ్లీహిల్స్‌లోని ఓ వర్ధమాన సినీనటి నివాసంపై దాడులు నిర్వహించారు. విషయం తెలుసుకున్న సదరు హీరోయిన్ షూటింగ్‌ను రద్దు చేసుకుని వెంటనే ఇంటికి చేరుకున్నారు. ఆమె ఇంటితోపాటు నగరంలోని మొత్తం 23 ప్రాంతాల్లో డీజీజీఐ బృందాలు దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఆ నటి రూ.20 లక్షల వరకు ట్యాక్స్ చెల్లించాల్సి ఉందని సమాచారం. ఇక చిట్‌ఫండ్, కోల్డ్ స్టోరేజీ యూనిట్లు, సాఫ్ట్ వేర్ కంపెనీలు, కన్‌స్ట్రక్షన్ కంపెనీలతో పాటు ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు, తదితర ఆఫీసుల్లో ఉదయం నుంచి డీజీజీఐ బృందాలు సోదాలు నిర్వహించాయి. ముఖ్యంగా ఎంబీబీఎస్ సీట్ల కోసం విద్యార్థులను విదేశాలకు పంపే కన్సల్టెన్సీలు సైతం భారీగా జీఎస్టీ ఎగవేతకు పాల్పడినట్లు గుర్తించాయి. బుధవారం నుంచి జీఎస్టీ అధికారులు జంటనగరాల్లో దాడులు జరుపుతున్నారు. వీటిలో ఓ సినీ నటుడి వ్యాపార సంస్థలతో పాటుగా పలు మౌలిక సదుపాయాల కంపెనీలు, ఇంటర్నేషనల్ స్కూళ్లు, స్టీలు వ్యాపారాలపై బుధవారం చేసిన దాడుల్లో దాదాపు రూ.40 కోట్ల పన్ను ఎగ్గొట్టినట్లుగా అధికారులు గుర్తించారు. మూడురోజుల దాడుల్లో మొత్తంగా రూ.60 కోట్లకుపైగా పన్ను ఎగవేసినట్లుగా అధికారులు లెక్కతేల్చినట్లు సమాచారం. దాడులు జరిగిన వ్యాపార సంస్థల ప్రతినిధులను జీఎస్టీ ఎందుకు చెల్లించడం లేదని అధికారులు ప్రశ్నించినపుడు తమకు అవగాహన లేదంటూ ఇచ్చిన సమాధానంతో అధికారులు సంతృప్తిగా లేరని సమాచారం.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్

### వైద్య, ఆరోగ్య శాఖ వర్గాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. తొలుత 30 శాతం ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. హాజరు శాతం అత్యంత తక్కువగా ఉన్న అన్ని కేటగిరీ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రులన్నింటిలోనూ ఈ విధానాన్ని అమలు చేస్తారు. వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు శాతం తక్కువగా ఉండటంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. దీనిపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ కూడా పలుమార్లు హెచ్చరించారు. అయినా సిబ్బంది తీరులో మార్పు రావడంలేదు. దీనికి సంబంధించి గురువారం 'సాక్షి'లో 'పల్లె నాడి పట్టని డాక్టర్'శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ వ్యవస్థను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## ఇల్లు కట్టుకునేందుకు ఈజీగా అనుమతులు

### రాష్ట్రస్థాయి టౌన్ ప్లానింగ్ సిబ్బంది సమావేశంలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: భవన నిర్మాణ అనుమతులు పారదర్శకంగా సులభరీతిలో వేగంగా పొందేలా నూతన విధానాన్ని రూపొందిస్తున్నట్లు ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. ఉపాధి, మెరుగైన జీవన ప్రమాణాల కోసం ప్రజలు పట్టణాల వైపు చూస్తున్నారని, వేగంగా జరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలు, సమగ్రాభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం బుద్ధభవన్‌లో జరిగిన టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బందితో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. భవన నిర్మాణ అనుమతుల కోసం రూపొందించే నూతన విధానం ప్రకారం 75 చదరపు గజాల్లోపు విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే వారు తమ వివరాలు రిజిస్టర్ చేసుకోవాలని, 600 చదరపు గజాల్లోపు భవన నిర్మాణాలకు సెల్ఫ్ డిక్లరేషన్ విధానం అమలు చేస్తామన్నారు. 600 చదరపు గజాలకు మించిన విస్తీర్ణంలో చేపట్టే భవన నిర్మాణాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులిస్తామని ప్రకటించిన కేటీఆర్, పారిశ్రామిక అనుమతుల్లో సింగిల్ విండో విధానం విజయవంతంగా అమలవుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని అనుమతుల ప్రక్రియలో సమయాన్ని తగ్గించి, పారదర్శకతను పెంచేలా పనిచేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సూచించారు. నూతన విధానం ప్రవేశ పెట్టే క్రమంలో కొన్ని సవాళ్లు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదన్నారు. ప్రజలు, టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి మద్దతు లభిస్తుందనే నమ్మకంతోనే నూతన విధానం తెస్తున్నామని, ఈ విధానంలోని నిబంధనలను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలుంటాయని కేటీఆర్ హెచ్చరించారు. తప్పుడు అనుమతులు, అక్రమ నిర్మాణాలు చేపడితే ముందస్తు సమాచారం లేకుండానే కూల్చివేతలు చేపట్టే అధికారం నిబంధనలకు విరుద్ధంగా పని చేసే అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఖాళీల భర్తీ, మౌలిక సదుపాయాల కల్పనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ చెప్పారు. హెచ్‌ఎండీఏ అనుసరిస్తున్న ల్యాండ్ పూలింగ్ పద్ధతులనే రాష్ట్రం లోని ఆరు పట్టణాభివృద్ధి సంస్థలూ అనుసరించాలని సూచించారు.

# యావత్ ప్రపంచం ఎదురుచూస్తోంది..

- దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు హైకోర్టుకూ ప్రతిష్టాత్మకమే
- ఇతర రాష్ట్రాల వైద్యులతో రీ పోస్టుమార్టం వద్దు: ఏజీ
- ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు నివృత్తి కావాలన్న కోర్టు
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా స్పందిస్తామని వెల్లడి
- రీ పోస్టుమార్టంపై ప్రభుత్వం పారదర్శకతను చాటుకోవాలని వ్యాఖ్య
- ప్రభుత్వ వైఖరిని తెలియజేసేందుకు గడువు కోరిన ఏజీ
- ఆమేరకు నేడు ప్రత్యేకంగా ఈ కేసును విచారిస్తామన్న ధర్మాసనం




సాక్షి, హైదరాబాద్: దిశ హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్ కేసు పోలీసులు, తెలంగాణ ప్రభుత్వానికే కాకుండా తమకూ ప్రతిష్టాత్మకమైనదేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై ఏమౌతుందోనని యావత్ ప్రపంచం ఎదురుచూస్తోందని పేర్కొంది. ఎన్‌కౌంటర్‌పై అనేక సందేహాలున్నందునే రీపోస్టుమార్టం నిర్వహించాలని ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయని, దీనిపై ప్రభుత్వం కూడా ముందుకొచ్చి పారదర్శకతను చాటుకోవాల్సిన అవసరం ఉందంది. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మహమ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట చెన్నకేశవులు మృతదేహాల వ్యవహారంపై హైకోర్టు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల్ని కచ్చితంగా అమలు చేసి తీరుతామని తేల్చిచెప్పింది. తొలుత ధర్మాసనం ఢిల్లీ వైద్యుల బృందంతో మృతదేహాలకు రీపోస్టుమార్టం చేయాలని ఉత్తర్వులు జారీ చేయబోతుంటే ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ అభ్యంతరం చెప్పారు. ప్రభుత్వ వైఖరిని తెలియజేసేందుకు సోమవారం వరకూ గడువు ఇవ్వాలని ఏజీ కోరగా.. శనివారం ప్రత్యేకంగా ఈ కేసును మాత్రమే విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం శుక్రవారం ప్రకటించింది.

### రీ పోస్టుమార్టం చేయాల్సిందే..

ఎన్‌కౌంటర్‌లో మరణించిన నలుగురి మృతదేహాలకు తిరిగి పోస్టుమార్టం నిర్వహించాలని, ఈ వ్యవహారాన్ని హైకోర్టులో తేల్చుకోవాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందనే పిల్‌ను ధర్మాసనం ఎదుట విచారణ జరిగింది. కె.సజన ఇతరుల కేసులో ఈనెల 17న సుప్రీంకోర్టు.. సాక్ష్యాధారాల సేకరణ–మృతదేహాల అప్పగింత వ్యవహారాలపై హైకోర్టు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశాలిచ్చింది. ఇందుకు అనుగుణంగా మృతదేహాలకు వేరే రాష్ట్రాలకు చెందిన ఫోరెన్సిక్ వైద్య నిపుణులతో రీపోస్టుమార్టం చేయించాలని పిల్‌లో కోర్టుకు సహాయకారిగా (ఎమికస్‌క్యూరీ) నియమితులైన సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి కోరారు. వెంటనే అందుకు అనుగుణంగా ధర్మాసనం స్పందించబోతుంటే ఏజీ కల్పించుకుని.. తెలంగాణలో నిష్ణాతులైన ఫోరెన్సిక్ వైద్య నిపుణులున్నారని, వేరే రాష్ట్రాల వైద్యులతో తిరిగి పోస్టుమార్టం నిర్వహించాల్సిన అవసరం లేదన్నారు. అయితే ఈ వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. మృతదేహాలు పాడైపోతున్నాయని గాంధీ ఆస్పత్రి వైద్యులు కూడా చెబుతున్నారని, ఎన్‌కౌంటర్‌పై అనుమానాలున్నాయని, ఎన్‌కౌంటర్ పేరుతో నలుగురిని కాల్చి చంపారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే రీపోస్టుమార్టం చేయాల్సిందేనని స్పష్టం చేసింది. పిల్‌లో రీపోస్టుమార్టం కావాలని పిటిషనర్ కోరలేదని ఏజీ చెప్పగా, ఒక పిల్‌లో లేకపోతే మరో పిల్‌లో ఆ అభ్యర్థన ఉందని, అయినా సుప్రీంకోర్టు తమను నిర్ణయించాలని చెప్పాక ఆకాశమే హద్దుగా చేసుకుని ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం తేల్చి చెప్పింది.

### ఎన్‌కౌంటర్ విశ్వవ్యాప్తమైంది..

పోలీసుల ప్రతిష్ట, రాష్ట్ర ప్రతిష్టలే కాకుండా తెలంగాణ హైకోర్టు ప్రతిష్ట కూడా ఇందులో ముడిపడి ఉందని, దిశ హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్ విశ్వవ్యాప్తమైందని, ఏం జరగబోతోందోనని దేశమే కాకుండా యావత్ ప్రపంచం ఎదురుచూస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బూటకపు ఎన్‌కౌంటర్ అనే విమర్శలు వచ్చినప్పుడు నిజాలు నిగ్గుతేల్చాలని రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు రావాలని, అయితే ప్రభుత్వం ఎందుకు అడ్డుపడుతోందో అర్థం కావడం లేదని సందేహాన్ని వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు దిశ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్టే ఉత్తర్వులు ఇచ్చిందని ఏజీ చెప్పగానే ధర్మాసనం తిరిగి స్పందిస్తూ ఆ తర్వాత మృతదేహాల వ్యవహారాన్ని హైకోర్టే తేల్చాలని తమకు ఆదేశాలిచ్చిందని గుర్తుచేసింది. బంతి మా కోర్టులో ఉందని వ్యాఖ్యానించింది. ఒక ఘటన (ఎన్‌కౌంటర్) జరిగాక పోస్టుమార్టం జరిగిందని, మళ్లీ పోస్టుమార్టం చేయాలంటే కాజ్ ఆఫ్ యాక్షన్ (చర్యకు కారణం) ఉండాలి కదా అని ఏజీ సందేహాన్ని లేవనెత్తారు. తాము ఉత్తర్వులు జారీ చేసేందుకు ఆదేమీ అడ్డంకి కాబోదని హైకోర్టు స్పష్టం చేసింది. మృతదేహాలకు కుటుంబసభ్యులు దహన సంస్కారాలు చేయాలని, ఎంతకాలం వాటిని భద్రపర్చుతారని, ఈ ఘటనపై ఆధారాల సేకరణకు వీలుగా మరోసారి వాటికి పోస్టుమార్టం చేయించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. తాము జారీ చేయబోయే ఉత్తర్వులను ప్రభుత్వం విభేదిస్తే సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చునని సూచించింది. అయితే రీపోస్టుమార్టం చేయాలనే పిల్‌పై ప్రభుత్వ వాదనలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేసేందుకు సోమవారం వరకూ సమయం ఇవ్వాలని ఏజీ కోరారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాల్సిన అవసరమేముందని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వ వైఖరిని తెలుసుకునేందుకు సమయం కావాలని ఏజీ కోరడంతో సెలవు దినమైనా శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేకంగా విచారిస్తామని ధర్మాసనం వెల్లడించింది. విచారణకు గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వయంగా హాజరుకావాలని ఆదేశించింది.


న్యూఢిల్లీలోని జామా మసీదు ప్రాంగణంలో ఆందోళనకు దిగిన వందలాది మంది నిరసనకారులు

# ‘పౌర’ ఆందోళనలు హింసాత్మకం

## యూపీలో ఆరుగురు మృతి

- ఢిల్లీలో నిషేధాజ్ఞల ఉల్లంఘన; భారీ ర్యాలీలు
- దేశవ్యాప్తంగా శుక్రవారం ప్రార్థనల అనంతరం భారీగా వీధుల్లోకి వచ్చిన నిరసనకారులు

**న్యూఢిల్లీ:** భారత్‌లోని అన్ని ప్రాంతాలకు ‘పౌర’ ఆగ్రహ జ్వాలలు విస్తరించాయి. పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ఆందోళనలతో అట్టుడికింది. నిరసనల సందర్భంగా యూపీలో శుక్రవారం ఆరుగురు చనిపోయారు. పోలీసులు మాత్రం మృతుల సంఖ్యను ఐదుగా పేర్కొన్నారు. బిజ్నోర్‌లో ఇద్దరు, మీరట్, సంభాల్, ఫిరోజాబాద్‌లో ఒక్కరు చొప్పున చనిపోయారని డీజీపీ ఓపీ సింగ్ తెలిపారు. కాన్పూర్‌లోనూ ఒకరు చనిపోయినట్లు సమాచారం. పోలీసు కాల్పుల కారణంగా ఈ మరణాలు సంభవించాయా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఆందోళనకారుల దాడుల్లో 50 మందికి పైగా పోలీసులు గాయపడ్డారని సింగ్ తెలిపారు. ఢిల్లీలోనూ ఆందోళనలు పోలీసుల లాఠీ చార్జి, కాల్పులకు దారి తీశాయి. ఇప్పటివరకు ఆందోళనలు జరగని ప్రాంతాల్లోనూ శుక్రవారం భారీ స్థాయిలో నిరసనలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా శుక్రవారం ప్రార్థనల అనంతరం మసీదుల ముందు వేలాదిగా నిరసన తెలిపారు. యూపీలో గోరఖ్‌పూర్ నుంచి బులంద్‌షహర్ వరకు దాదాపు అన్ని పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. పలుచోట్ల ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆందోళనకారులు రాళ్లు రువ్వడం, పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించడం జరిగాయి. ఢిల్లీలో జాతీయ పతాకం చేతపట్టుకుని, రాజ్యాంగాన్ని కాపాడాలనే నినాదాలతో నిరసనకారులు కదం తొక్కారు. ఎర్రకోట, జామా మసీదు వద్ద భారీ ర్యాలీలు నిర్వహించారు. కొన్ని చోట్ల నిరసనకారులు తమది శాంతియుత నిరసన అని తెలిపేందుకు పోలీసులకు గులాబీ పూలను అందించారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటక, కేరళ సరిహద్దుల్లో ఇంటర్నెట్, ఎస్సెమ్మెస్ సేవలను నిలిపేశారు. పోలీసు కాల్పుల్లో ఇద్దరు చనిపోయిన మంగళూరు, ఒకరు చనిపోయిన లక్నో సహా సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రత బలగాలను మోహరించారు. ఆందోళనల నేపథ్యంలో.. సీఏఏపై, ప్రతిపాదిత దేశవ్యాప్త ఎన్నార్సీపై సలహాలు, సూచనలను స్వాగతిస్తామని కేంద్ర ప్రభుత్వంలోని ఒక ఉన్నతాధికారి పేర్కొన్నారు.

### ఢిల్లీలో..



**ఢి**ల్లీలోని దరియాగంజ్ ప్రాంతంలో ఆందోళనకారులు కారును తగలబెట్టారు. ఢిల్లీగేట్ వద్ద రాళ్లు రువ్వడంతో ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జ్, వాటర్ కెనన్‌లను ప్రయోగించారు. రోడ్లపై భారీగా బారికేడ్లను నిలిపినప్పటికీ, మెట్రో స్టేషన్లను మూసేసినప్పటికీ, నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తూ వేలాదిగా ఆందోళనకారులు నిరసన తెలిపారు. జామా మసీదు, ఇండియా గేట్, సెంట్రల్ పార్క్‌ల వద్ద భారీ స్థాయిలో గుమికూడారు. భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ భారీ ర్యాలీకి నేతృత్వం వహించారు. పోలీసులు డ్రోన్లతో ఆందోళనలపై నిఘా పెట్టారు. హోంమంత్రి అమిత్ షా నివాసం దగ్గరలో నిరసన తెలుపుతున్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె, ఢిల్లీ మహిళ కాంగ్రెస్ చీఫ్ శర్మిష్ఠ ముఖర్జీ సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భిన్నాభిప్రాయాన్ని పోలీసు బలంతో అణచేందుకు మోదీ సర్కారు పనిచేస్తోందని కాంగ్రెస్ చీఫ్ సోనియాగాంధీ ఆరోపించారు.

### జాతీయ గీతంతో..


డీసీపీ చేతన్

**బనశంకరి:** పోలీసు అధికారి జాతీయ గీతాన్ని ఆలపించి ఆందోళనకారులను శాంతింపజేసిన ఘటన బెంగళూరులో జరిగింది. పౌరసత్వ సవరణ చట్టంపై అందోళనలు చేయడానికి బెంగళూరు పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినప్పటికీ గురువారం కొన్ని సంఘాల నాయకులు టౌన్‌హాల్ వద్ద ధర్నాకు దిగారు. అక్కడకు చేరుకున్న డీసీపీ చేతన్‌సింగ్‌రాథోడ్ మాట్లాడుతూ ‘నేను మీవాడిని అనుకుంటే నేను ఆలపించే జాతీయ గీతాన్ని ఆలకించాల’ని కోరారు. అనంతరం ఆయన జాతీయగీతం ఆలపించగా అందోళనకారులు గౌరవంగా లేచి నిల్చుని, ధర్నా విరమించారు. డీసీపీ చేతన్‌సింగ్ సమయస్ఫూర్తిని మెచ్చుకుంటూ నేరవిభాగ ఐజీ హేమంత్ నింబాళ్కర్ ట్వీట్ చేశారు.

### మిత్రపక్షాల వేరు బాట

**జా**తీయ పౌర పట్టిక(ఎన్నార్సీ)ని బిహార్‌లో అమలు చేయబోమని ముఖ్యమంత్రి, జేడీయూ నేత నితిశ్ కుమార్ స్పష్టం చేశారు. పౌరసత్వ సవరణ బిల్లుకు పార్లమెంట్లో జేడీయూ మద్దతిచ్చిన విషయం తెలిసిందే. మరో మిత్రపక్షం ఎల్జేపీ ప్రెసిడెంట్ చిరాగ్ పాశ్వాన్ సైతం బీజేపీ తీరును తప్పుబట్టారు. సీఏఏ, ఎన్నార్సీలపై ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించే విషయంలో కేంద్రం విఫలమైందన్నారు. ఎన్నార్సీపై కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలతోపాటు ఒరిస్సా, బెంగాల్, ఆంధ్రప్రదేశ్ సీఎంలు వ్యతిరేకత తెలిపిన విషయం తెలిసిందే.

### యూపీలో..

**రా**ష్ట్రంలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. గోరఖ్‌పూర్, సంభాల్, భదోహి, బహ్రైచ్, ఫరుఖాబాద్, బులంద్ షహర్, ఫిరోజ్‌బాద్‌లో మధ్యాహ్న ప్రార్థనల అనంతరం ఆందోళనకారులు రోడ్లను నిర్బంధించారు. వాహనాలను తగలబెట్టారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించారు. లక్నో, అలహాబాద్, కాన్పూర్, అలీగఢ్ సహా రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు.

- మహారాష్ట్రలోని బీడ్, నాందేడ్, పర్భాని జిల్లాల్లో బస్సులను ధ్వంసం చేశారు. మహారాష్ట్రలో ఎంఐఎం భారీ ర్యాలీ నిర్వహించింది. భారత్‌లో హిందువులే ఉండేలా మోదీ సర్కారు చట్టాలు తీసుకువస్తోందని ఆరోపించింది.
- కర్ణాటకలోని మంగళూరులో పోలీసుల కాల్పుల్లో గురువారం ఇద్దరు చనిపోయిన నేపథ్యంలో కేరళలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో బలగాలను మోహరించారు.
- అస్సాంలో ఆందోళనకారులను చర్చలకు ఆహ్వానించినట్లు సీఎం శర్బానంద సోనోవాల్ తెలిపారు.

**మమత యూ టర్న్**

పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని గురువారం డిమాండ్ చేసిన పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ మాట మార్చారు. ఈ ప్రజా వ్యతిరేక చట్టం విషయంలో జోక్యం చేసుకుని, రద్దుకు చర్యలు తీసుకోవాలని శుక్రవారం ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇది దేశ ప్రయోజనాలకు సంబంధించిన విషయమన్నారు. దేశవ్యాప్త ఎన్నార్సీ అమలు విషయంలోనూ వెనక్కు తగ్గాలని కోరారు.

## అమెరికాలో కాల్పులు

**విన్‌స్టన్‌సేలం:** అమెరికాలోని నార్త్ కరొలినాలో కాల్పుల ఘటన చోటు చేసుకుంది. విన్‌స్టన్ సేలంలోని పబ్లిక్ వర్క్స్ భవనంలో స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ కాల్పులు జరిగాయి. కాల్పుల్లో ఇద్దరు మరణించారని, మరో ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. కాల్పులకు పాల్పడిన వారి వివరాలను వెల్లడించలేదు.

## అఫ్గాన్‌లో భూకంపం

### ఢిల్లీ, ఉత్తర భారత్‌లో ప్రకంపనలు

**న్యూఢిల్లీ/కాబూల్:** అఫ్గానిస్తాన్‌లోని హిందూకుష్ పర్వత ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం భారీ భూకంపం సంభవించింది. దీంతో ఢిల్లీతో సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు జాతీయ భూకంప కేంద్రం (ఎన్‌సీఎస్) వెల్లడించింది. రిక్టరు స్కేలుపై 6.3 తీవ్రతతో సాయంత్రం 5.10 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించిందని తెలిపింది. ప్రాణ, ఆర్థిక నష్టం వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొంది.

## విశ్వేశతీర్థ స్వామీజీకి తీవ్ర అనారోగ్యం



**సాక్షి బెంగళూరు:** ఉడుపి జిల్లాలోని పేజావర మఠాధిపతి శ్రీ విశ్వేశతీర్థ స్వామీజీ శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే ఆయన్ను మణిపాల్‌లో ఉన్న కేఎంసీ ఆస్పత్రికి తరలించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉందని వైద్యులు తెలిపారు. విశ్వేశతీర్థ స్వామీజీని పరామర్శించేందుకు హోంమంత్రి అమిత్‌షా శనివారం కర్ణాటక రానున్నారు. ప్రధాని మోదీ ఆస్పత్రి వైద్యులకు ఫోన్ చేసి స్వామీజీ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## చలితో వణికిన ఉత్తర భారత్

**న్యూఢిల్లీ:** తగ్గుతున్న ఉష్ణోగ్రత ఉత్తర భారత్‌ను వణికిస్తోంది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం మంచు కురిసింది. ఇక ఢిల్లీని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో 750 విమానాలు ఆలస్యంగా ప్రయాణాన్ని ప్రారంభించగా, 19 విమాన సర్వీసులు రద్దయ్యాయి. దాదాపు 100 రైళ్లు 2 గంటల ఆలస్యంతో నడిచాయని రైల్వే అధికారులు తెలిపారు. ఢిల్లీలో ఉష్ణోగ్రత 6.4 డిగ్రీలుగా నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. హిమాచల్ ప్రదేశ్‌లోని కీలాంగ్‌లో అత్యల్పంగా మైనస్ 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జమ్మూలో 8.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## రూ. 7 వేల కోట్ల ‘నిర్భయ’ ప్రాజెక్టులు

**న్యూఢిల్లీ:** నిర్భయ’ నిధుల కింద రూ. 7 వేల కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదించిందని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. ఆ ప్రాజెక్టుల్లో దేశవ్యాప్తంగా నెలకొల్పనున్న 1023 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు కూడా ఉన్నాయన్నారు. రూ. 1,000 కోట్ల కార్పస్ ఫండ్‌తో 2013లో నిర్భయ నిధిని ఏర్పాటు చేశారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు, 2013–14లో యూపీఏ సర్కారు నిర్భయ నిధులను ఏమాత్రం వినియోగించలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 7 వేల కోట్లను వినియోగించామని ఇరానీ తెలిపారు.

# సెంగార్‌కు జీవిత ఖైదు

### ఉన్నావ్ అత్యాచారం కేసులో ఢిల్లీ కోర్టు తీర్పు • రూ.25 లక్షల జరిమానా కూడా..



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన ఉన్నావ్ అత్యాచారం కేసులో బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. సెంగార్ తన తుది శ్వాస విడిచేవరకు జైలు జీవితం గడపాలని స్పష్టం చేసింది. ఢిల్లీ తీస్‌హజారీ కోర్టు జిల్లా న్యాయమూర్తి జస్టిస్ ధర్మేశ్ శర్మ శుక్రవారం తుది తీర్పు వెలువరించారు. నెల రోజుల్లోగా రూ.25 లక్షలు జరిమానా కూడా చెల్లించాలని సెంగార్‌ను ఆదేశించింది. జరిమానా చెల్లించకపోతే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం యూపీ ప్రభుత్వమే ఆ మొత్తాన్ని కట్టాలని చెప్పారు. నష్ట పరిహారం కింద అదనంగా రూ.10 లక్షలు ఉన్నావ్ బాధితురాలి తల్లికి అందజేయాలని తీర్పులో పేర్కొన్నారు. నిందితుడిపై కాస్త కరుణ చూపాలన్న సెంగార్ తరపు లాయర్ వాదనలను తోసిపుచ్చారు. ఎమ్మెల్యేగా ఉంటూ సెంగార్ ప్రజల విశ్వాసాలను దెబ్బ తీశారని, ఈ కేసు తీవ్రతను తగ్గించి చూడాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. బాధితురాలికి, వారి కుటుంబ సభ్యుల ప్రాణాలకు హాని ఉందని, అందుకే వారి భద్రతపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీబీఐని ఆదేశించారు. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యుల ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా ఢిల్లీ మహిళా కమిషన్ పర్యవేక్షణలో ఏడాదిపాటు అద్దె ఇంట్లో ఉంచాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. నెలకు రూ.15 వేల అద్దెను యూపీ సర్కారే భరించాలని స్పష్టం చేశారు.

**బాధితురాలి సాక్ష్యానికి మించింది లేదు: న్యాయమూర్తి**

సమాజంలో పలుకుబడి కలిగి, శక్తిమంతమైన ఒక వ్యక్తిపై బాధితురాలు చెప్పిన మాటలకు మించిన సాక్ష్యం మరేదీ ఉండదని న్యాయమూర్తి తీర్పు సందర్భంగా చెప్పారు. ఈ కేసులో సహ నిందితురాలు శశి సింగ్‌ను నిర్దోషిగా ప్రకటించారు. ఆమె కూడా సెంగార్ బాధితురాలేనని న్యాయమూర్తి స్పష్టం చేశారు. తీర్పు వెలువరించిన సమయంలో దోషి సెంగార్ కోర్టు హాలులోనే ఉన్నారు. న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్ష అనగానే ఆయన ఒక్కసారిగా భోరుమని విలపించారు. తన కుమార్తె, సోదరిని పట్టుకొని ఆయన కన్నీరు పెట్టుకున్నారు. మైనర్‌లపై అత్యాచార నేరానికి గాను పోక్సో చట్టం కింద మరణ శిక్ష విధించాలి కానీ, ఈ నేరం జరిగిన 2017లో ఆ చట్టానికి సవరణలు జరగలేదు. అందుకే సెంగార్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది.

### ఉరి శిక్ష విధించాల్సింది : బాధితురాలి సోదరి

**బీ**జేపీ బహిష్కృత ఎమ్మెల్యే కులదీప్ సెంగార్‌కు ఉరి శిక్ష విధించి ఉంటే బాగుండేదని బాధితురాలి సోదరి అన్నారు. అప్పుడే తమ జీవితాలు భద్రంగా ఉండేవని ఆమె పేర్కొన్నారు. ‘సెంగార్‌కు ఉరిశిక్ష విధిస్తే మాకు న్యాయం జరిగేది. అతను జైల్లో ఉన్నప్పటికీ అనుక్షణం భయపడ్డాం. సెంగార్ జైలు నుంచి బయటకు వస్తే మమ్మల్ని బతకనివ్వడు’ అని ఆందోళన వ్యక్తం చేశారు. నేరం జరిగిన సమాయానికి పోక్సో సవరణలు చేపట్టలేదు. దీంతో సెంగార్ మరణ శిక్ష నుంచి తప్పించుకున్నాడు.

### కిడ్నాప్, గ్యాంగ్‌రేప్, కస్టడీ డెత్..

**ఉ**ద్యోగం కోసం వెళ్లిన బాధితురాలిపై బీజేపీకి చెందిన ఎమ్మెల్యే సెంగార్ 2017 జూన్ 4వ తేదీన అత్యాచారానికి పాల్పడ్డాడు. సెంగార్ అనుచరులు ఆమెను కిడ్నాప్ చేసి గ్యాంగ్‌రేప్ చేశారు. ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదు. 2018 ఏప్రిల్‌లో బాధితురాలి తండ్రిపై దాడి జరిగింది. దీంతో బాధితురాలు ముఖ్యమంత్రి నివాసం ఎదుటే ఆత్మాహుతికి యత్నించింది. అనంతరం బాధితురాలి తండ్రి పోలీసు కస్టడీలోనే చనిపోయాడు. ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. సెంగార్‌ను సీబీఐ అరెస్ట్ చేసినా బెదిరింపులు వస్తున్నాయంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బాధితురాలు లేఖ రాసింది. ఆ తర్వాత ఆమె ప్రయాణిస్తున్న కారుని ఒక లారీ ఢీకొంది. దీంతో సుప్రీంకోర్టు ఇందుకు సంబంధించిన కేసులన్నిటి ఢిల్లీ కోర్టుకు మార్చాలని ఆదేశించింది.

## పౌరసత్వంపై ఆందోళన వద్దు!

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో చట్టంలో పొందుపర్చిన పౌరసత్వం నిబంధనలపై కేంద్రం వివరణ ఇచ్చింది. జూలై 1, 1987న లేదా ఆ లోపు భారత్‌లో జన్మించిన వారు సహజంగానే భారతీయ పౌరులవుతారని తెలిపింది. అలాగే, ఆ తేదీ(జూలై 1, 1987)లోపు వారి తల్లిదండ్రులు భారత్‌లో జన్మించినట్లైనా కానీ ఆ పిల్లలు చట్టప్రకారం భారతీయ పౌరులేనన్నారు. సీఏఏపై, ఎన్నార్సీపై వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అస్సాం విషయంలో ఈ కటాఫ్ 1971వ సంవత్సరంగా ఉంటుందన్నారు. పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం, జూలై 1, 1950 – డిసెంబర్ 3, 2004 మధ్య భారత్‌లో జన్మించిన వారు పౌరసత్వానికి అర్హులు. అలాగే, పిల్లలు జన్మించిన సమయంలో తల్లిదండుల్లో ఏ ఒకరైనా భారతీయ పౌరుడైతే.. ఆ పిల్లలు కూడా ఇక్కడి పౌరులవుతారు. డిసెంబర్ 10, 1992– డిసెంబర్ 3, 2004 మధ్య భారత్‌కు వెలుపల జన్మించిన వారి తల్లిదండ్రులకు భారత పౌరసత్వం ఉంటే.. ఆ పిల్లలను కూడా ఇక్కడివారిగా పరిగణిస్తారు.

# జార్ఖండ్‌లో హంగ్?



**న్యూఢిల్లీ/రాంచీ:** తాజాగా ముగిసిన జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన పలు సంస్థలు అంచనావేశాయి. 81 స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ నెల 23న వెలువడనున్నాయి. ఏబీపీ న్యూస్ ఎగ్జిట్‌పోల్స్ ప్రకారం కాంగ్రెస్ కూటమికి 35 సీట్లు, బీజేపీకి 32 సీట్లు, ఇతర పార్టీలకు 9 సీట్లు వస్తాయని తేలింది. ఆజ్‌తక్ సర్వే బీజేపీకి 22–32, కాంగ్రెస్ కూటమికి 38–50 సీట్లు వస్తాయని, ఇతర పార్టీలకు 14 సీట్లు ఇతరులకు రావచ్చని తెలిపింది. జార్ఖండ్/బిహార్ హిందీ న్యూస్ చానెల్, న్యూస్11 బీజేపీకి 30–35 సీట్లు, జేఎంఎంకు 17–22 సీట్లు, కాంగ్రెస్‌కు 9–12 సీట్లు వస్తాయని మిగిలిన సీట్లు ఇతరులకు వచ్చే అవకాశం ఉందని అంచనావేసింది. ఏబీపీ న్యూస్ ఎగ్జిట్‌పోల్స్ ప్రకారం కాంగ్రెస్ కూటమికి 35 సీట్లు, బీజేపీకి 32 సీట్లు, ఇతర పార్టీలకు 14 సీట్లు వస్తాయని తేలింది. కాషిశ్ న్యూస్ ఎగ్జిట్‌పోల్స్ ప్రకారం కాంగ్రెస్ కూటమికి 37–49 సీట్లు, బీజేపీకి 25–30 సీట్లు వస్తాయని తేలింది. ఇండియా టుడే–యాక్సిస్ మై ఇండియా రిపోర్టుల ప్రకారం కాంగ్రెస్ కూటమికి 38–50 సీట్లు, బీజేపీకి 22–32 సీట్లు వస్తాయని తేలింది. ఈ నెల 23న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

### ఎగ్జిట్ పోల్స్ అంచనా

**తుది దశలో 71.69% పోలింగ్**

జార్ఖండ్ అసెంబ్లీకి శుక్రవారం జరిగిన చిట్టచివరి తుది దశ ఎన్నికల్లో 71.69% పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలోని 81 అసెంబ్లీ స్థానాలకు గాను నవంబర్ 30 నుంచి ఈ నెల 16 వరకు నాలుగు దశల్లో 65 సీట్లకు ఎన్నికలు పూర్తయ్యాయి. ఓట్ల లెక్కింపు 23న జరగనుంది.

## గూగుల్‌కు భారీ జరిమానా

**పారిస్:** ఆన్‌లైన్, వాణిజ్య ప్రకటనల మార్కెట్‌లో గూగుల్ సంస్థ ప్రదర్శిస్తున్న ఆధిపత్య ధోరణిపై ఫ్రాన్స్ మండిపడింది. గూగుల్‌లో వాణిజ్య ప్రకటనల్ని ఆమోదించడానికి అనుసరించే విధానాలు ఏ మాత్రం పారదర్శకంగా లేవని పేర్కొంటూ దాదాపు రూ. 1,180 కోట్ల జరిమానా విధించింది. గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో యాడ్స్ ఇచ్చే వారందరికీ ఒకే నియమ నిబంధనలు ఉండాలని స్పష్టం చేసింది. ఇప్పటికే ఎన్నో దేశాలు వివిధ కారణాలతో గూగుల్‌కు జరిమానాలు విధించాయి. ఇప్పుడు ఆ జాబితాలో ఫ్రాన్స్ కూడా చేరింది.

## త్వరలో అయోధ్య ట్రస్టు

**న్యూఢిల్లీ:** అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం కేంద్రం త్వరలో ట్రస్టు ఏర్పాటు చేయనుంది. మరికొద్ది వారాల్లోనే ఈ ట్రస్టు కార్యరూపం దాల్చే అవకాశముందని హోం శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం మీడియాకు తెలిపారు. రామజన్మభూమి– బాబ్రీ మసీదు అంశంలో గత నెల 9న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుననుసరించి ట్రస్టు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ట్రస్టుకు భూమి బదలాయింపు, ట్రస్టు సభ్యుల అధికారాలు వంటి అంశాలను ట్రస్టు చూసుకుంటుంది.

# జైపూర్ పేలుళ్ల కేసులో నలుగురికి ఉరి


నిందితుడిని జైపూర్ కోర్టుకు తీసుకొస్తున్న దృశ్యం

**జైపూర్:** 2008 నాటి జైపూర్ వరుస బాంబు పేలుళ్ల ఘటనలో దోషులు నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. ఆ పేలుళ్లలో 71 మంది మరణించగా, 185 మంది గాయపడిన విషయం తెలిసిందే. దీనిపై ప్రత్యేక కోర్టు విచారణ జరిపింది. సెషన్స్ జడ్జి అజయ్ కుమార్ శర్మ శుక్రవారం తుదితీర్పు వెలువరించారు. దోషులకు రూ.50 వేల జరిమానా విధించారు. ‘వేర్వేరు ప్రాంతాల్లో బాంబులు ఏర్పాటు చేసినందుకు ఐపీసీ 302 సెక్షన్ కింద నలుగురు దోషులకు మరణశిక్ష విధించారు’ అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీచంద్ తెలిపారు. ఈ తీర్పుపై హైకోర్టుకు వెళతామని దోషుల తరపు లాయర్ చెప్పారు. రెండు రోజుల క్రితం మహమ్మద్ సైఫ్, మహమ్మద్ సర్వార్ అజ్మీ, మహమ్మద్ సల్మాన్, సైఫురేహ్మన్ అనే నలుగురిని దోషులుగా నిర్ధారిస్తూ కోర్టు తీర్పునివ్వగా మరో నిందితుడు షాబాజ్ హుస్సేన్‌ను బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద నిర్దోషిగా విడుదల చేసింది. నిందితులుగా ఉన్న మరో ఇద్దరు అదే ఏడాది ఢిల్లీల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

# పినాక పరీక్ష సక్సెస్



**బాలాసోర్ (ఒడిశా):** స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పినాక క్షిపణి వ్యవస్థను శుక్రవారం వరుసగా రెండోరోజు విజయవంతంగా పరీక్షించారు. గరిష్టంగా 75 కిలోమీటర్ల దూరం వరకు కచ్చితత్వంతో వెళ్లగలిగే ఈ క్షిపణి వ్యవస్థను చండీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి పరీక్షించినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఈ క్షిపణి 75 కిలో మీటర్ల దూరంలోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని పేర్కొంది. పినాక క్షిపణి వ్యవస్థను డీఆర్‌డీవో రూపొందించింది.



సాక్షి
శనివారం, డిసెంబర్, 21

# నేరానికి తగిన శిక్ష

అధికార మదంతో, తలపొగరుతో ఇష్టానుసారం చెలరేగే రాజకీయ నాయకుల వెన్నులో వణుకు పుట్టేలా ఉన్నావ్ అత్యాచార ఉదంతంలో బహిష్కృత బీజేపీ ఎమ్మెల్యే కులదీప్ సెంగార్‌కు ఢిల్లీ కోర్టు యావజ్జీవశిక్ష విధించింది. ఆయన తన శేష జీవితం మొత్తం జైల్లోనే గడపాలని, బాధితురాలికి రూ. 25 లక్షల జరిమానా చెల్లించాలని, మరో పది లక్షల రూపాయలు ఆమె తల్లికి ఇవ్వాలని శుక్రవారం తీర్పునిచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో రెండేళ్లక్రితం జరిగిన ఈ అత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా అలజడి రేపింది. చివరకు ఐక్యరాజ్యసమితి సైతం ఈ ఉదంతంపై ఆందోళన వ్యక్తం చేసి, నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఉన్నావ్ బాధితురాలు పడిన వెతలు అన్నీ ఇన్నీ కాదు. ఆమెను అపహరించి పదిరోజులపాటు అత్యాచారం చేయడం మాత్రమే కాదు... అదేమని ప్రశ్నించిన పాపానికి ఆ ఇంటిల్లిపాదినీ సెంగార్, ఆయన అనుచరగణం భయభ్రాంతులకు గురిచేశారు. వారికి పనులు దొరక్కుండా చేశారు. ఆ కుటుంబంతో మాట్లాడా లంటే భయపడేలా ఊరు మొత్తాన్ని శాసించారు. అతగాడిపై కేసు పెట్టాలంటూ బాధితురాలు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతుండగా ఎప్పటికప్పుడు ఆమె కుటుంబసభ్యులను బెదిరించడం, దౌర్జన్యం చేయడం వారికి నిత్యకృత్యంగా మారింది. తనను అపహరించారని, సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారని బాధితురాలు ఫిర్యాదు చేస్తే పోలీసులు మాత్రం అపహరించడం(ఐపీసీ సెక్షన్ 363), బలవంతంగా పెళ్లాడేందుకు ప్రయత్నించడం(ఐపీసీ 366) వంటి ఆరోపణలు మాత్రమే ఎఫ్ఐఆర్‌లో రాశారు. సెంగార్ సోదరుడు బాధితురాలి తండ్రిని తీవ్రంగా కొట్టి గాయపరిచినప్పుడు పోలీసులు ఆయన్ను ఆసుపత్రికి తరలించకుండా పోలీస్ లాకప్‌లో ఉంచారు. ఆలస్యంగా వైద్య చికిత్స అందడంతో ఆయన రెండురోజులు నరకం అనుభవించి కన్నుమూశాడు. ఇక తానూ, తన కుటుంబం ఏకాకులమని, ఎవరి ఆసరా తమకు లభించే అవకాశం లేదని నిర్ధారణయ్యాక బాధితురాలు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నివాసగృహం సమీపంలో కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. సెంగార్ సోదరుడు, మరికొందరు ఆమె తండ్రిపై దౌర్జన్యం చేయడం, నెత్తురు ముద్దలా మారిన ఆ వృద్ధుణ్ణి స్టేషన్‌లో కూర్చోబెట్టి పోలీసులు తాపీగా ప్రశ్నించడం వంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాలకెక్కి అల్లరై జనం ఛీ కొట్టాకగానీ ఎమ్మెల్యే సోదరుణ్ణి అరెస్టు చేయలేదు. అటు తర్వాత ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పజెప్పింది. ఆ తర్వాతే కులదీప్ సెంగార్‌ను అరెస్టు చేశారు. ఈలోగా బాధితురాలి బాబాయ్‌పై తప్పుడు కేసులుపెట్టి జైలుకు పంపారు.

ఉన్నావ్ ఉదంతం మన దేశంలో రాజ్యాంగమూ, చట్టమూ ఉన్నాయా అన్న సందేహాన్ని కలిగించింది. ఉన్నావ్ బాధితురాలు ఆ ఉదంతం జరిగేనాటికి మైనర్. 2012లో వచ్చిన పోక్సో చట్టం కఠినమైనది. మొన్న జూలైలో సవరణలు చేసి దాన్ని మరింత కఠినంగా మార్చి నేరగాళ్లకు ఉరిశిక్ష పడే నిబంధన తీసుకొచ్చారు. కానీ 2017లో ఆ చట్టం బాధితురాలికి ఏమాత్రం ఉపయోగపడలేదు. ఆ చట్టం ఉన్నా అది తమకు తెలియనట్టు, అసలు లేనట్టు పోలీసులు ప్రవర్తించారు. మన దగ్గరున్న సమస్య అదే. నేరగాళ్లు సాధారణ వ్యక్తులైతే ఒకలా, రాజకీయ పలుకుబడి గలవారైతే మరోలా వ్యవహరిస్తుండటం రివాజుగా మారింది. ఉన్నావ్‌లో అది పరాకాష్టకు చేరింది. మొన్న జూలైలో న్యాయస్థానంలో జరిగే విచారణలో పాల్గొనడానికి బాధితురాలి కుటుంబం కారులో వెళ్తుండగా ఒక ట్రక్కు దాన్ని ఢీకొట్టింది. ఇందులో ఆమె పిన్ని, మేనత్త మరణించారు. బాధితురాలు, న్యాయవాది గాయపడ్డారు. ఈ ఉదంతం తర్వాత బాధితురాలు నేరుగా అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్‌కి లేఖ రాశాక ఆయన జోక్యం చేసుకుని ఇందుకు సంబంధించిన కేసులన్నిటినీ లక్నో న్యాయస్థానం నుంచి ఢిల్లీకి మార్చారు. రోజువారీ విచారించాలని, 45 రోజుల్లో పూర్తి చేయాలని నిర్దేశించారు. అటు తర్వాతే బీజేపీ సెంగార్‌ను పార్టీ నుంచి బహిష్కరించింది.

నేరారోపణలొచ్చిన వ్యక్తి అధికార పక్ష నాయకుడైతే అధికార యంత్రాంగాన్ని కదిలించడం ఎంత కష్టమో, ఎంత ప్రాణాంతకమో ఉన్నావ్ బాధితురాలు, ఆమె కుటుంబం పడిన కష్టాలు గమనిస్తే బోధపడుతుంది. సెంగార్ ఆ రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నిటిలోనూ పనిచేశాడు. ఎక్కడున్నా ఆయనపై ఆరోపణలు తరచు వస్తూనే ఉన్నాయి. బీజేపీలో చేరకముందు ఆయన బీఎస్పీ, సమాజ్‌వాదీ పార్టీల్లో పనిచేశాడు. కానీ ఆయన ఓట్లు సాధించిపెట్టే బలమైన నాయకుడు గనుక ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆయన అరాచకాలపై ఎవరూ నోరెత్తలేదు. దేశంలో, మరీ ముఖ్యంగా ఉత్తరాదిలో ఇలాంటివారే నాయకులుగా చలామణి అవుతున్నారు. ఉన్నావ్ బాధితురాలు రెండేళ్లపాటు ఒంటరి పోరు చేయాల్సి రావడం ఇందువల్లే. నేరం జరిగినప్పుడు వెంటవెంటనే వ్యవస్థలు కదలకపోయినా, ఆ నేరానికి తగిన శిక్ష పడకపోయినా సమాజంలో మరింతమంది నేరగాళ్లు పుట్టుకొస్తారు. ఏం చేసినా తమకేమీ కాదన్న ధైర్యంతో బరితెగిస్తారు. కనుక చట్టాలు కఠినంగా ఉండటం మాత్రమే సరిపోదు. అవి సత్వరం రంగంలోకి దిగాలి. అప్పుడే అందరిలోనూ చట్టాలంటే భయం ఏర్పడుతుంది. నిర్భయ ఉదంతం జరిగాక నియమించిన జస్టిస్ జేఎస్ వర్మ కమిటీ ఒక విలువైన మాట చెప్పింది. సమాజంలో నేరాలు అధికంగా అణగారిన వర్గాలు, మహిళలు, పిల్లలపైనే జరుగుతాయని, అందువల్ల వారి రక్షణకు ఉద్దేశించిన విభాగాలు ఎలా పనిచేస్తున్నాయో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తుండాలని ఆ కమిటీ తెలిపింది. ఏ అధికారి అయినా, కింది స్థాయి సిబ్బంది అయినా అలసత్వం ప్రదర్శిస్తున్నట్టు తేలితే తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఉన్నావ్ ఉదంతం దేశంలోని అన్ని ప్రభుత్వాలకూ గుణపాఠం కావాలి. చట్టాలు సమర్థవంతంగా పనిచేసేలా, వ్యవస్థలు సత్వరం కదిలేలా తీర్చిదిద్దాలి. అప్పుడు మాత్రమే చట్టాలంటే భయభక్తులు ఏర్పడతాయి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి బ.దశమి సా.5.40 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం చిత్త రా.8.45 వరకు, తదుపరి స్వాతి వర్జ్యం ఉ.5.44 నుంచి 7.14 వరకు, తిరిగి రా.2.00 నుంచి 3.32 వరకు, దుర్ముహూర్తం ఉ.6.30 నుంచి 7.55 వరకు అమృతఘడియలు... ప.2.43 నుంచి 4.12 వరకు.

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం: 5.27
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

# చెరగని ఈ ముద్రలు వెండితెరకెక్కవా?

విశ్లేషణ


గోపాలకృష్ణ గాంధీ

**మొఘల్ సామ్రాజ్యం చివరి రాణి బేగం జీనత్ మహల్, భర్త స్వాతంత్ర్యోద్యమంలో జైలు కెళితే ఖుదాఫీజ్ చెప్పిన జులైకా బేగం, సరోజినీ నాయుడు, కమలాదేవి ఛటోపాధ్యాయ, అరుణా అసఫాలీ, మృదులా సారాబాయి, ముత్తులక్ష్మి రెడ్డి, ఎమ్ఎస్ సుబ్బులక్ష్మి వంటి భారతీయ ధీరమహిళల జీవితచరిత్రలను భారతీయ చిత్రపరిశ్రమ వెండి తెరపై ఇంతవరకు ఎందుకు చిత్రించలేకపోయింది? భారతీయ పురాణాల చిత్రణపై మనకు పట్టు ఉంది కానీ చరిత్ర చిత్రీకరణలో తడబడుతుంటాం. వీరోచిత కార్యాలకు పట్టం కడతాం కానీ వాస్తవ జీవిత చిత్రణ మనకు సమస్యాత్మకమే. బ్రిటిష్ నాటకరంగంలో, సినిమాల్లో విశిష్ట నటి జూడి డెంచ్ వంటివారు భారతీయ చిత్ర రంగంమీదికి ఇంకా రాలేదు. ఆమెను పోలిన నట విదుషీమణులు భవిష్యత్తులోనైనా మన దేశంలో పుట్టుకొస్తారని, పసలేని వీరోచిత కృత్యాలను తోసిపడేస్తారని ఆశిద్దాం.**

బేగం జీనత్ మహల్ అత్యద్భుతమైన జీవితం ఇంతవరకు వెండితెరపై ఎందుకు కనిపించలేదు? చిట్టచివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్ అవశేష రాజ్యాన్ని పాలించిన చివరి భారతీయ రాణి ఈమె. ఆత్మగౌరవం, ఒంటరితనంతో, దర్పం, భయాందోళనల మిశ్రమ స్థితిలో ఎర్రకోటలోని పరిమిత పరిస్థితుల్లో జీవితం కోసం తపనపడిన ధీర వనిత ఈమె. దృఢచిత్తం ఉన్నప్పటికీ అదృష్టానికి నోచుకోని బేగం జీనత్ తన ఏకైక పుత్రుడు మీర్జా జావన్ బఖ్‌ని సింహాసనంపై కూర్చుండబెట్టడానికి తన రాణి హోదాను, దర్బారును ఎంతగానో ఉపయోగించి కూడా విఫలమైంది. షా జాఫర్ మునుపటి భార్యలకు పుట్టిన ఇద్దరు కుమారులకంటే తన కుమారుడికి ఆమె ఎంతో ప్రాధాన్యత నిచ్చింది. తన కుమారుడిని గద్దెనెక్కించడానికి ఆమె విఫల ప్రయత్నాలు చేసింది. అతడికి భవిష్యత్ సింహాసనం కట్టబెట్టడం కోసం 1857లో చెలరేగిన సిపాయి తిరుగుబాట్లకు దూరంగా ఉంచింది. తన భర్తను దురదృష్టం కోరల నుంచి బయటపడేయటానికి చేయగలిగినంతా చేసింది కానీ నిష్ఫలమే అయింది. సింహాసనం కోల్పోయి ప్రవాస శిక్షకు గురైన భర్త షా జాఫర్‌తోపాటు ఆమె రంగూన్‌కి పయనమైంది. ఎర్రకోట నుంచి బేగం జీనత్ మహల్ నిష్క్రమించడం బాధాకరమైన ఘటన. రంగూన్‌లోనే చనిపోయిన తన భర్త సమాధి పక్కనే నాలుగేళ్ల తర్వాత ఆమెని కూడా సమాధి చేశారు.

మన కాలంలో బేగం జీనత్ మహల్‌కు సరిసమానమైన వ్యక్తిత్వం కలిగిన మరొక ధీరవనిత జులైకా బేగం గురించి కూడా భారతీయ సినిమా చిత్రించకపోవడం శోచనీయం. ఈమె మౌలానా ఆజాద్ అని మనందరికీ తెలిసిన అబుల్ కలామ్ గులాం మొహియుద్దీన్ భార్య. విద్యాధికుడైన తిరుగుబాటుదారు, లౌకికవాద పునీతుడు అయిన మౌలానా ఆజాద్ పుస్తకాలూ పోరాటాలే ప్రపంచంగా జీవించిన వారు. 13 ఏళ్ల ప్రాయంలో ఆయన్ని పెళ్లాడిన జులైకా బేగం తన భర్త స్వాతంత్ర్య పోరాటంలో మునిగి తేలుతున్న సమయంలో కలకత్తాలో గడిపారు. ముస్లిం లీగ్ తన లక్ష్యం పాకిస్తాన్ ఏర్పాటేనని ప్రకటించిన తర్వాత అవిభక్త హిందుస్తాన్ కోసం మౌలానా పోరాడుతూ వచ్చారు. 1942లో గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ నిర్ణయాత్మకమైన పోరాటంలోకి దిగినప్పుడు కలకత్తాలో తన గృహంలో ఉండిన ఆజాద్.. బొంబాయిలో క్విట్ ఇండియా కోసం పిలుపునిచ్చిన వెంటనే ఇంటిని వదిలి వెళ్లారు.

'మరి కుటుంబం గురించి ఆలోచించు' అని ఆమె అడిగి ఉంటారా? మనకు తెలిసినంతవరకు జులైకా బేగం వెళ్లిపోతున్న మౌలానాను అనుసరించి ఇంటి గేటు దాటి అక్కడే నిలబడి నిశ్శబ్దంగా చూస్తూ, కారెక్కుతున్న భర్తకు ఖుదాఫీజ్ చెప్పారు. క్విట్ ఇండియా తీర్మానం ఆమోదించగానే తనను కూడా అరెస్టు చేస్తారన్న విషయం ఆజాద్‌కు బహుశా తెలిసి ఉంటుంది. అలాగే నెహ్రూ, పటేల్, కృపలానీ తదితర కాంగ్రెస్ సీనియర్ నేతలతోపాటు ఆజాద్ కూడా మూడేళ్లపాటు అహ్మద్ నగర్ పోర్ట్ జైలులో గడిపారు. ప్రచురితమవుతాయా లేదా అని కూడా తెలీని పరిస్థితుల్లో తన జైలు గదిలోని రెండు ఊరపిచ్చుకల ప్రేమ జీవితాన్ని చూస్తూ, పరిశీలిస్తూ ఆయన ఉత్తరాల్లో రాస్తూ వచ్చారు. సుదీర్ఘ కారాగార ఏకాంత జీవితంలో ఇద్దరు దంపతుల మధ్య సాన్నిహిత్యం మరింత బలోపేతమవుతుంది. తన భర్త ఖైదీగా ఉండగానే జులైకా కలకత్తాలో మరణించారు. అక్కడే ఆమెను సమాధి చేశారు.



విద్యావంతుల కుటుంబంలో పుట్టి బ్రిటన్‌లో చదువుకుని సంగీత సాహిత్యాల్లో ప్రావీణ్యత పొందిన సరోజినీ నాయుడిపైనా మనదేశంలో ఎలాంటి సినిమా తీయలేదు. తన ప్రవృత్తికి భిన్నమైన హైదరాబాద్ నివాసి, శస్త్రవైద్యుడు గోవిందరాజులు నాయుడిని పెళ్లాడి అయిదుగురు బిడ్డలకు తల్లి అయిన సరోజిని నైటింగేల్ ఆఫ్ ఇండియాగా పేరుపొందారు. ఆమె భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షురాలయ్యారు. అమెరికన్ రచయిత కేథరీన్ మేయో రాసిన 'మదర్ ఇండియా' దేశంపై కలిగిస్తున్న ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ఆమె అమెరికాకు కూడా వెళ్లారు. దండి సత్యాగ్రహ సమయంలో పోలీసు చర్యను ధైర్యంగా ఎదుర్కొన్నారు. రాజ్యాంగ సభలో సేవలందించారు. యునైటెడ్ ప్రావిన్స్ ప్రథమ గవర్నర్ అయ్యారు. తర్వాత అచిరకాలంలోనే స్వల్ప అస్వస్థతకు గురై మరణించారు. అంతిమ క్షణాల్లోనూ ఆమె తనకు సేవలందిస్తున్న నర్సును పాటపాడి వినిపించమన్నారు. అలాగే 20వ శతాబ్ది స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న కమలాదేవి ఛటోపాధ్యాయ, అరుణా అసఫాలీ, మృదులా సారాబాయి వంటి ధీరవనితలపై కూడా ఇంతవరకు ఎవరూ సినిమా తీయలేదు. వీరిలో మొదటివారు సోషలిస్టు, రెండోవారు కమ్యూనిస్టు, మూడో వ్యక్తి వ్యష్టివాదిగా ప్రసిద్ధులు. మృదులా సారాబాయి దేశ విభజన సమయంలో అపహరించబడి, త్యజించబడిన అనేకమంది మహిళలను కాపాడారు.

అలాగే తదనంతర కాలంలో ముత్తులక్ష్మీ రెడ్డిగా పేరొందిన చంద్ర నారాయణ స్వామి ముత్తులక్ష్మిపై కూడా ఇంతవరకూ ఎవరూ సినిమా తీయలేదు. పుదుక్కోటై సంస్థానంలో దేవదాసీ కమ్యూనిటీలో పుట్టిన ముత్తులక్ష్మి చదువుకోవడానికి పెద్ద పోరాటమే చేశారు. తర్వాత పురుషుల కాలేజీలో సీటు సాధించిన తొలి విద్యార్థినిగా చరిత్రకెక్కారు. తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో తొలి మహిళా హౌస్ సర్జన్ అయ్యారు. తర్వాత బ్రిటిష్ ఇండియాలో తొలి శాసనసభ్యురాలిగా ఎన్నికై దేవదాసీ వ్యవస్థ రద్దుకు కృషిచేశారు. అలాగే దేవదాసీ తల్లికి పుట్టిన ప్రతిభావంతురాలైన కుమార్తెగా మదురైలో పెరిగిన ఎమ్ఎస్ సుబ్బులక్ష్మిపై కూడా ఇంతవరకు ఎవరూ సినిమా తీయలేదు. అనంతర కాలంలో సంగీత విద్వన్మణిగా అద్భుత ప్రావీణ్యత సాధించిన ఈమె స్వరాలు వెండితెరపై ఆవిష్కృతమయ్యాయి కానీ ఆమె జీవితం గురించిన అద్భుత సినిమా ఇంకా వెలువడలేదు.

ఇలాంటి భారతీయ ధీరవనితల జీవితాలు ఇంతవరకు సినిమా రూపంలోకి ఎందుకు రాలేదు? ఎందుకంటే భారతదేశంలో పురాణాల గురించి మనకు బాగా తెలుసు కానీ చరిత్ర చిత్రణలో తడబడుతుంటాం. మానసిక సంక్షోభాలు, బుద్ధిజీవులకు చెందిన వ్యత్యాసాలను, డైలమాల చిత్రీకరణ మనకు సాధ్యం కాదు. వీరోచిత కార్యాలకు మనం పట్టం కడతాం కానీ వాస్తవ జీవిత చిత్రణ మనకు సమస్యాత్మకంగానే ఉంటోంది. మరొక కారణం ఉంది. మన కాలంలో కొంతమంది అతిగొప్ప నటీమణులను చూశాం. కానీ వ్యక్తిత్వ చిత్రణలను పండించే వారిని దొరకబుచ్చుకోవడం చాలా కష్టం. చారిత్రక హీరోయిన్ పాత్రల్లో ధరించేటటువంటి భారతీయ జూడి డెంచ్‌లు ఇంకా రంగంమీదికి రావడం లేదు. జూడి డెంచ్ బ్రిటన్ థియేటర్ నటి, వెండితెర నటి. ప్రస్తుతం ఆమె వయస్సు 85 ఏళ్లు.

వర్జిన్ మేరీలో మేరీగా, హామ్లెట్‌లో ఒఫెలియాలా, రోమియో అండ్ జూలియట్‌లో జూలియట్‌లా, మాక్‌బెత్‌లో లేడీ మాక్‌బెత్‌లా, షేక్‌స్పియర్ ఇన్ లవ్‌లో క్వీన్ ఎలిజిబెత్‌లా, ది డచెస్ ఆఫ్ మాల్ఫిలో డచెస్‌లా, మిస్టర్ బ్రౌన్ టెలి ప్లేలో క్వీన్ విక్టోరియాలా, ఐరిస్‌లో ఐరిస్ మర్డోక్‌లా, జేమ్స్ బాండ్ సీరీస్‌లో 'ఎమ్' పాత్రధారిణిలా ఆమె విశిష్ట పాత్రలు పోషించారు. సమకాలీన, టెక్నో స్పై చిత్రాల్లో డెంచ్ పాత్ర ఒక్కమాటలో చెప్పాలంటే అద్భుతం. జీరబోయిన ఆమె స్వరమే ఆమె సిగ్నేచర్‌గా మారిపోయింది. అయితే జ్వలించిపోయే ఆమె నేత్రాలు సకలభావాలను పలుకుతాయి. ఒక గొప్ప షాట్‌లో ఆమెను చంపబోతున్న హంతకుడు చేతిలో తుపాకితో ఆమెకు ఎదురు నిలబడతాడు. సరిగ్గా తుపాకి ట్రిగ్గర్ నొక్కుతుండగా డెంచ్ అతడికేసి తీక్షణంగా చూస్తుంది. మరుక్షణంలో ఆమె సురక్షితంగా ఒక డెస్క్ వెనుక పడిపోతుంది. సెకన్ల తేడాతో టెర్రరిస్టు తన తుపాకిని గురి పెట్టడం, ఆమె ఏమాత్రం లక్ష్యపెట్టకుండా అతడికేసి తీక్షణంగా చూడటం ఎంత ప్రతిభావంతంగా షాట్‌గా మల్చారంటే క్రెడిట్ మొత్తం ఆమెకు, దర్శకుడికి మాత్రమే దక్కుతుంది.

మన గొప్ప నటీమణులలో జూడి డెంచ్ ఒకరై ఉండినట్లయితే, మన జీనత్ మహల్, జులైకా, సరోజినీ నాయుడు, కమలాదేవి తదితర భారతీయ ధీరవనితల పాత్రలన్నీ ఆమె పోషించి ఉండేది. కానీ మనం నిరాశచెందాల్సిన పనిలేదు. కానీ మనం కోల్పోయిన జాతి రత్నాలను మనం తిరిగి ఆవిష్కరించడానికి మరొక తరం గడిచిపోవాల్సి ఉంటుంది కాబోలు. 85 ఏళ్ల ప్రాయంలో జూడీ డెంచ్ జన్మ దినోత్సవాన్ని ఈ డిసెంబర్ 9న జరుపుకున్న తరుణంలో, ఆమెను పోలిన నట విదుషీమణులు భవిష్యత్తులోనైనా మన దేశంలో పుట్టుకొస్తారని, కళా, సంస్కృతీ సౌందర్యాన్ని చూడని మన క్షుద్ర సినీ జీవుల బుర్రలేని వీరోచిత కృత్యాలను ఈ భవిష్యత్ తారలు తోసిపడేస్తారని మనసారా ఆశిస్తూ సంబరాలు చేసుకుందాం.

వ్యాసకర్త మాజీ ఐఏఎస్ అధికారి, దౌత్యవేత్త, మాజీ గవర్నర్

---

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### వ్యతిరేకం



"పోలీసులపై దాడి చేయడం, హింసకు పాల్పడటం గాంధీ తరహా పౌర నిరసనకు వ్యతిరేకం. ప్రజలకు ఉన్న నిరసన తెలిపే హక్కును పోలీసులు అడ్డుకోవడం వల్లనే యూపీలో హింస చెలరేగింది. అయినా, హింసను సమర్థించేది లేదు. దాన్ని ఖండించి తీరాల్సిందే" – షాహిద్ సిద్దిఖీ, మాజీ ఎంపీ

### ప్రతీకారం



"హింసకు పాల్పడిన వారిని వీడియో, సీసీటీవీ ఫుటేజ్ ద్వారా గుర్తించామని వాళ్లపై ప్రతీకారం తీర్చుకుంటామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ అనడం చట్ట వ్యతిరేకం. ప్రజాస్వామ్యంలో పౌరులపై ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటున్న ఏ ప్రజాప్రతినిధినైనా వెంటనే తొలగించాలి"

– అనీ జైది, రచయిత

### నిర్బంధం



"దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోంది. మాజీ స్పీకర్ రమేష్ కుమార్, మాజీ మంత్రి ఎంబి పాటిల్, ఇతర కర్ణాటక శాసనసభ్యులపై మంగళూర్ విమానాశ్రయంలో పోలీసులు దురుసుగా ప్రవర్తించి అరెస్ట్ చేశారు. బీజేపీ అన్ని నిరసన స్వరాలను తొక్కేస్తోంది. తర్వాత ఏంటి? ప్రతిపక్షనేతలను కాల్చిపారేస్తారా?"

– శ్రీవత్స, కాంగ్రెస్ నేత

### శిక్షించాలి



"పోలీసుపై దాడి చేయడం నిరసనల సందర్భంలోని ఓ చీకటి కోణం. నిందితులను వీలైనంత త్వరగా అరెస్ట్ చేసి, శిక్షించండి. కానీ, విస్తృతంగా వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపుతున్న అనేకమంది శాంతియుత ప్రదర్శననే నిర్వహించారని మర్చిపోవద్దు. వాళ్ల శాంతియుత నిరసనను తేలిక చేయకండి. సాధ్యమేనా? లేక ఇక్కడా విభజన సూత్రమే పాటిస్తారా?"

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

### గతం



"రామ మందిరానికి అనుకూలంగా, జేఎన్‌యూ విద్యార్థులకు వ్యతిరేకంగా గతంలో సంప్రదాయవాదులు భారీ ర్యాలీలు నిర్వహించారు కదా. పౌరసత్వ సవరణ చట్టానికి గట్టి మద్దతు ఉంటే బలప్రదర్శనకు ఎందుకు పూనుకోవడం లేదు" – వసుధ వేణుగోపాల్, జర్నలిస్ట్

### తేడా



"కడప స్టీల్ ప్లాంటు విషయంలో చంద్రబాబు పచ్చి అబద్ధాలకోరుగా నిల్చారు. ఇనుప ఖనిజం సరఫరా హామీ లేకుండానే ఎలక్షన్ల ముందు శంకుస్థాపన చేశాడు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఎన్ఎండీసీతో ఏటా 50 లక్షల టన్నుల ఖనిజం సరఫరాకు ఎంఓయూ కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, మోసకారి బాబుకు తేడా ఇదే" – విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### భయం



"ఎప్పుడో చాలా కాలం క్రితమే ముస్లింల గొంతు నొక్కేశారు. గొంతు విప్పడానికీ, నిరసన తెలపడానికీ కూడా ముస్లింలు చాలా భయపడుతున్నారు. వేలాదిమంది హిందువులు, ఇతరులు భుజం భుజం కలిపి మాకు మద్దతుగా నిలిచారు కాబట్టే ఇవాళ నిరసన వ్యక్తం చేయగలుగుతున్నాం" – మహబూబా ముఫ్తీ, పీడీపీ అధినేత

---

ఇన్‌బాక్స్

## నిన్నలా... నాన్నలా!



నీ నిబ్బరం గెలుపునే
అబ్బురపరచింది
నీ ఆశయం రేపటి
ఆశల జెండాగా
రెపరెపలాడుతోంది

నీ ఆత్మీయత
తెలుగింటి తోరణమై
కళకళలాడుతోంది
నీ ఆలోచన
దేశం 'దిశ' మారుస్తోంది

ఆకాశం వైపు చూస్తే
వైయస్ నవ్వు
నేలపై చూస్తే
ఆ నవ్వులాగే నువ్వు

బిగించిన నీ పిడికిలి వేళ్లు
ఇప్పుడిప్పుడే విప్పారుతున్నాయి
నినదించిన నీ సంకల్పం
ఇంటింటా సంక్షేమమై సంచరిస్తోంది

మాట తప్పని తొమ్మిదేళ్ల నీ ప్రస్థానం
నవరత్నాలై వెలుగులు పంచుతోంది
వెన్ను చూపని నీ పోరాటం
యువతకు గొప్ప పాఠమైంది

నిన్నలా... నాన్నలా...
నేడు అందరికీ అన్నలా!

నీ పాలన కావాలి పండుగ
ప్రజలందరి గుండెల నిండుగా..!

హ్యాపీ బర్త్ డే సర్

– పూడి శ్రీనివాసరావు
సీనియర్ జర్నలిస్ట్
మొబైల్ : 94902 72789

# ఉత్తమాభిరుచికి మారుపేరు నవోదయ


శ్రీరమణ

ఒకప్పుడు బెజవాడ ఏలూరు రోడ్డంటే పుస్తకాల మక్కా. 'ఏ పుస్తకమైనా సరే– ఏలూర్ రోడ్ఛలో' అనేవారు. తర్వాత అదే కారల్‌మార్క్స్ వీధిగా వాసికెక్కింది. అందులో నవోదయ బుక్ షాప్ ఒక ల్యాండ్ మార్క్! అర్ధ శతాబ్దిపాటు నవోదయ ఒక వెలుగు వెలిగింది. మంచి చరిత్ర ఉంది. తెలుగు ప్రాచీన గ్రంథాల ప్రచురణలో వావిళ్ల వారికున్న కీర్తిప్రతిష్టల్ని ఆధునిక సాహిత్య ప్రచురణలో నవోదయ గడించింది. నవోదయ రామమోహనరావుగా పేరు తెచ్చుకున్న అట్లూరి 1934లో గన్నవరం తాలూకా ఉంగుటూరులో జన్మించారు. స్కూల్ ఫైనల్ దాకా చదువుకున్న రావుకి తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో మంచి ప్రవేశం ఉంది. పుస్తకాల ప్రూఫ్‌లు దిద్దడంలో ఆయన నిక్కచ్చయిన మనిషి. మొదట్లో నవోదయ అంటే కమ్యూనిస్ట్ సాహిత్యమని పేరుండేది. తర్వాతర్వాత విలువలున్న అభ్యుదయ రచనలకు అచ్చులు కల్పించారు. బాపురమణల స్నేహం దొరకడంతో నవోదయ అందమైన మలుపు తీసుకుంది. పుస్తకం సైజు, బాపు దిద్దిన ముఖచిత్రం, బాపు మార్క్ కోతి అక్షరాలు, ఇంకా ఎన్నో చిలవలు పలవలతో నవోదయ పబ్లికేషన్స్ పుస్తకాల మార్కెట్‌ని అలంకరించేవి. ఆ క్రమంలో ముళ్లపూడి వెంకటరమణ పుస్తకాలు గిరీశం లెక్చర్లు, ఋణానందలహరి, బుడుగు విడివిడిగా బాపు రమణీయంగా వెలువడ్డాయ్. బాపు కార్టూన్ సంపుటాలు వెలువడి నవ్వులు పండించాయి. చాలామంది రచయితలు తమ పుస్తకాలు నవోదయ బ్యానర్‌పై వస్తే బాగుండునని కలలు కనేవారు. వీఆర్ నార్ల సీత జోస్యం, నండూరి రామమోహనరావ్ విశ్వరూపం, నరావతారం సి. రామచంద్రరావు వేలుపిళ్లై, శ్రీరంగం నారాయణ బాబు రుధిర జ్యోతి, ఆరుద్ర పుస్తకాలు నవోదయ పేరుకి పెద్ద పీట వేశాయి. పుస్తకాలు పెట్టిచ్చే కాగితం కవర్లమీద బాపు కొంటె బొమ్మలు చిత్రాతిచిత్రంగా ఉండేవి. కస్టమర్లు కవర్లని కూడా దాచుకొనేవారు. బాపు గీసిన ప్రతి గీతని, వేసిన ప్రతిగీతని వాడుకుని అందమైన గ్రీటింగ్ కార్డ్స్‌ని రూపొందించేవారు. నవోదయ షాపు ఎప్పుడు చూసినా 'బాపు బొమ్మల కొలువులా' పరిమళిం చేది. ఆ తర్వాతి కాలంలో సత్యం శంకరమంచి విరచిత అమరావతి కథలు బాపు రేఖా చిత్రాలతో రమణ ముందుమాటతో వెలువడి సంచలనం సృష్టించింది. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, శ్రీకాంత శర్మ, శ్రీరమణ ఇత్యాదులు నవోదయ ఆథర్స్. మీరంతా మా ఆధరువులని రావు తరచూ చమత్కరిస్తుండేవారు.

నవోదయకి గుంటూరులో కూడా అన్ని హంగులతో శాఖ వెలిసింది. అప్పటి గుంటూరు మెడికోలలో చాలామందికి నవోదయ స్టెత స్కోప్ లాంటిది. అప్పట్నించీ డాక్టర్ జంపాల చౌదరి నవోదయ అభిమానిగా ఉన్నారు. తానా సంస్థకి మూల

అక్షర తూణీరం



స్తంభం. రామ్మోహనరావుపై చాలా చాలా ఇష్టం కొద్దీ రావు దంపతుల్ని ఒక తానా ఉత్సవాలకు గౌరవంగా రప్పించి సత్కరించారు. కడదాకా రావుగారి యోగక్షేమాలు తెలుసుకుంటూ, వైద్య సలహాలిస్తూ డాక్టర్ జంపాల నవోదయ ఋణం తీర్చుకున్నారు. అప్పటి ఎమెస్కో యజమాని ఎమ్మెన్ రావు, పలు వురు ఢిల్లీ ప్రచురణ కర్తలు డా।। రావుతో ఆత్మీయంగా ఉండేవారు. గడచిన రెండు మూడు దశాబ్దాలలో జనరల్ బుక్స్ వైపు చూసేవారు తగ్గిపోయారు. దాంతోబాటే నవోదయ ప్రాభవం తగ్గుతూ వచ్చింది. దాదాపు ముప్పై ఏళ్లనాడు 'విజయవాడ బుక్ ఫెయిర్' ఒక మహోత్సవంగా జరగడానికి నవోదయ రామ్మోహనరావు కారకులు. కమ్యూనిస్ట్ భావాలు, హేతువాద తత్వం కలిగిన రావు ఎప్పుడూ ఎక్కడా రాజీ లేకుండానే 86 ఏళ్ల జీవితం గడిపారు. 1955లో పర్వతనేని ఝాన్సీ, నవోదయ రామ్మోహనరావు ఇష్టపడి వివాహమాడారు. ఝాన్సీ నవోదయ సంపాదించుకున్న 'గుడ్‌విల్'కి కొమ్ముకాశారు. బాపు రమణలకు నిత్యం ఒకసారైనా ఫోన్‌లో మాట్లాడక అయ్యేది కాదు. బాపు ముద్దుగా రావుని 'మావో గారూ!' అని పిలిచేవారు. ఆ త్రయం కనుమరుగైంది. తెలుగు అక్షరానికి పెద్ద లోటు.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

# నలుగురి అవసరం

అతనొక ధనవంతుడు. అతనికి బోలెడంత సంపద ఉంది. భార్యా బిడ్డలు బంధువులు ఎందరో ఉన్నారు. కానీ అన్నింటినీ విడిచిపెట్టి బయటకు వచ్చేశాడు. కొందరు నౌకర్లతో కలిసి గడపడానికి అలవాటుపడ్డాడు. ఓరోజు ఓ సాధువు అతనిని అనుకోకుండా కలిశాడు. 'అదేంటీ నీ వారనుకున్న వారందరినీ విడిచిపెట్టి ఇలా వచ్చేశావేంటీ..' అని అడిగాడు సాధువు. 'స్వామీ, నాకు బోలెడంత సంపద ఉంది. ఆరోగ్యానికి డోకా లేదు. నేను ఎవరినీ అంటిపెట్టుకుని బతకవలసిన అవసరం లేదు. నేను ఎవరి సహాయాన్ని ఆశించక్కర్లేదు. నా బతుకు నాది' చెప్పాడు ధనవంతుడు గర్వంగా. అతని మాటలన్నీ విన్న సాధువు నవ్వి 'నాతో కొంత దూరం రా..' అన్నాడు. ఇద్దరూ నడిచి కొంత దూరం వెళ్ళారు. ఎండ వేడిమి భరించలేకపోయాడు ధనవంతుడు. ఎక్కడైనా నీడపట్టున కాస్సేపు ఉందామనుకున్నాడు. అటూ ఇటూ చూశాడు నీడ కోసం. సాధువు ఇది గమనించి ఏదీ తెలియనట్లు దేనికోసం వెతుకుతున్నావు అని అడిగాడు. 'మనం సేదదీరడానికి ఎక్కడైనా నీడ ఉందేమో'నని అన్నాడు ధనవంతుడు. 'ఎందుకూ.. నీ నీడ ఉందిగా, అందులో సేదదీరు' చెప్పాడు సాధువు. 'ఏమంటున్నారు.. నా నీడలో నేనెలా సేదదీరడమూ.. అది అసాధ్యం' అన్నాడు ధనవంతుడు.

జ్యోతిర్మయం

'ఏమిటీ నీకు ఎవరి సాయమూ అక్కర్లేదుగా.. నీకు బోలెడంత సంపద ఉందిగా.. అది నిన్ను కంటికి రెప్పలా చూసుకుంటుందని కాసేపు క్రితమే చెప్పావుగా.. ఇప్పుడేమో నీ నీడే నీకు సాయపడదంటున్నావు. ఎవరికీ లేనంత సంపద ఉన్నంతమాత్రాన ఎదుటివారితో గర్వంగా మాట్లాడక్కర్లేదు. ఎవరినీ చిన్నచూపు చూడకూడదు. ఉన్నప్పుడూ, మరణించినప్పుడూ ఎవరికైనా నలుగురి అవసరం తప్పనిసరి. అంతేతప్ప ఒట్టి సంపదతో ప్రశాంతంగా ఉండొచ్చనుకోవడం సరికాదు. బంధుగణాన్ని, మిత్రులను, సన్నిహితులను గౌరవించాలి. అభిమానించాలి. ఎవరూ అన్నింట్లోనూ గొప్పవారైపోరు. ఒక్కొక్కరూ ఒక్కో దాంట్లో ఉన్నతులై ఉంటారు' అన్నాడు సాధువు.

సాధువు మాటల్లోని నిజాన్ని ధనవంతుడు గ్రహించాడు. తిరిగి ఇంటికి చేరుకున్నాడు. భార్యాబిడ్డలతో కలిసి ఆనందంగా జీవించాడు.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం
21-12-2019







# ముగ్గుకు దశ... దిశ

18 చుక్కలు సరిచుక్కతో
9 వరుసలు..
9 వచ్చేవరకు

దిశ బిల్లు,
ఐపిసి 376 (రేప్)తో
ముగ్గు





కాసర లక్ష్మీసరోజారెడ్డి

**'దిశ'** యాక్ట్‌ను ముగ్గుతో చెప్తున్న ఈ మహిళ పేరు కె.ఎల్. సరోజ రెడ్డి. మహిళా భద్రత గురించి మొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన ఏపీ దిశ –2019 బిల్లును విస్తృతంగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో ఇలా ముగ్గు రూపంలో ఇంటి ముందుకు తెచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా, జంగారెడ్డి గూడేనికి చెందిన సరోజ అక్కడే 'ప్రతిభ ఇంగ్లిష్ మీడియం' స్కూల్ నడుపుతున్నారు. ప్రిన్సిపల్‌గా బాధ్యతలనూ చేపడ్తున్న ఆమె చైతన్య


ఏపీ దిశ చట్టం తెచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ సరోజ ఆధ్వర్యంలో స్కూలు విద్యార్థుల ప్రదర్శన

మహిళా సమాఖ్య కన్వీనర్. రచయిత్రి, ఫ్యామిలీ కౌన్సిలర్ కూడా. నల్సర్ యూనివర్శిటీ నుంచి ఫ్యామిలీ డిస్ప్యూట్స్ అండ్ రిజల్యూషన్స్ (కుటుంబ తగాదాలు– పరిష్కారాలు)ల్లో డిప్లమా చేశారు. చైల్డ్ సైకాలజీ అంటే కూడా ఆసక్తి. పాతికేళ్ల నుంచీ అడ్వకేట్‌గానూ పనిచేస్తున్నారు. మహిళల మీద అంతకంతకూ పెరుగుతున్న హింసను అరికట్టడంలో కుటుంబం పాత్రే ఎక్కువని బలంగా నమ్ముతారు సరోజ. మార్పు అక్కడి నుంచే మొదలు కావాలనే తాపత్రయంతో జెండర్ ఈక్వాలిటీ మీద తల్లిదండ్రులకు, భార్యాభర్తలకు కౌన్సెలింగ్స్ ఇస్తున్నారు. తల్లిదండ్రుల తర్వాత పిల్లల మీద టీచర్ల ప్రభావమే ఉంటుందని, స్కూల్ వాతావరణమూ వాళ్లను ప్రభావితం చేస్తుందని భావించే టీచర్ సరోజ. అందుకే స్కూల్లో మగపిల్లలకు అమ్మాయిల పట్ల ప్రవర్తించాల్సిన తీరును బోధిస్తున్నారు. అమ్మాయిలకూ ఆత్మరక్షణా పద్ధతులను, మెలకువలను తెలియజేస్తున్నారు. మహిళా భద్రత, రక్షణకు సంబంధించిన చట్టాలను పాఠశాల ప్రహరీ మీద పెయింట్‌తో రాయించారు.



మహిళా భద్రత, రక్షణకు సంబంధించిన చట్టాలను; అబ్బాయిలు.. అమ్మాయిలను తమతో సమంగా చూడాల్సిన తీరును వివరిస్తూ స్కూల్ గోడలపై అతికించిన పోస్టర్లు

అంతేకాదు అబ్బాయిలు.. అమ్మాయిలకు ఇవ్వాల్సిన గౌరవం, తమతో సమంగా చూడాల్సిన తీరునూ పోస్టర్ల రూపంలో అతికించారు. మగపిల్లలం ఏం చేసినా చెల్లుతుంది అనే భావన, అహం అబ్బాయిల్లో కలగకుండా వాళ్ల ప్రవర్తన మీద ఫోకస్ చేస్తున్నట్టే అమ్మాయిలు ధైర్యంగా బయటకు వెళ్లేలా.. భయం, బెరుకు లేకుండా పదిమందిలో మాట్లాడగలిగేలా తీర్చిదిద్దడానికి విద్యార్థినుల పట్లా ప్రత్యేక శ్రద్ధ పెడ్తున్నారు సరోజ. ఆటల్లో వాళ్లకు శిక్షణను ఇప్పించి జిల్లా స్థాయి పోటీలకు పంపడం. వక్తృత్వ, వ్యాసరచన, డిబేట్ కాంపిటీషన్స్ నిర్వహించడం.. అంతర్ జిల్లా పోటీలకు పంపించడం వంటివి చేస్తున్నారు. విమెన్ సేఫ్టీకోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన 'మైత్రి' టీమ్స్‌లోనూ సభ్యురాలు ఆమె. ''నిర్భయ చట్టం వచ్చాక ఇక హింస ఆగుతుందని ఆశ పడ్డాను. అది అత్యాశే అని తేలింది. ఇలాంటి నిస్పృహలో ఉన్న ఆడవాళ్లకు ఏపీ దిశ – 2019 బిల్లు మళ్లీ కొత్త ఆశలు నింపింది. ప్రస్తుతం ఉన్న చట్టాల్లో సత్వర న్యాయం అందించే చట్టం ఇదే. దిశ బిల్లుతో నేరాలు ఉధృతి తగ్గుతుందనే నమ్ముతున్నా. దీని గురించి చాలా ప్రచారం జరగాలి. ఆ ముగ్గు వేయడానికి కారణం కూడా అదే. ఆ బిల్లు రూపొందిన తెల్లవారే ఆ ముగ్గు వేశా'' అంటారు కె. ఎల్. సరోజ రెడ్డి.

**"మహిళల్లో నాయకత్వ లక్షణం కొరవడింది. దాన్ని ఈ తరం అమ్మాయిల్లో పెంపొందించాల్సిన అవసరం ఉంది. సమాజంలో మన స్థానాన్ని పదిల పర్చుకోవడం కన్నా ముఖ్యమైనది ఇంకోటిలేదు" మొన్న మిస్ యూనివర్స్ పోటీల్లో ఈ జవాబుతోనే మిస్ సౌత్ ఆఫ్రికా జోజిబిని తుంజి 'మిస్ యూనివర్స్' టైటిల్ గెలుచుకున్నారు. ఈ మాటను నాలుగేళ్ల కిందటే కార్యరూపంలోకి తెచ్చారు ప్రతిభా వనంబత్తిన. తెలుగు రాష్ట్రాల్లో ల్యాండ్రీ బిజినెస్‌పెట్టిన తొలి మహిళా అంట్రపెన్యూర్‌గా నిలిచి! సర్దుకుపోవడం అవసరమే కాని సర్దుకుపోవడమే జీవితం కాకూడదు.. అదే స్త్రీల అస్తిత్వం అవకూడదు అని నిరూపించారు!**


ప్రతిభ వనంబత్తిన

# ప్రతిభాప్రెన్యూర్

**ప్ర**తిభ వనంబత్తిన సొంతూరు విజయవాడ. ఎమ్మెస్సీ మైక్రోబయోలజీ చదివారు. ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం చేస్తూండగానే పెళ్లి అయింది. ముగ్గురు పిల్లలు (ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి). వైవాహిక జీవితం అంత సాఫీగా సాగలేదు. దాంతో విడాకులు తీసుకోవాల్సి వచ్చింది. అప్పటికి పిల్లలు చిన్నవాళ్లు. పుట్టింటి ఆసరా అంతగా లేదు. ఉన్న ఊళ్లోనే ఉంటే బంధువుల సూటిపోటి మాటలు, చిన్నచూపుతో ఉన్న ఆత్మవిశ్వాసం ఆవిరైపోతుందని అర్థమైంది ప్రతిభకు. తన స్నేహితురాలు గీత సహాయంతో ముగ్గురు పిల్లలను తీసుకొని హైదరాబాద్ వచ్చారు. మళ్లీ ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా ఉపాధి వెదుక్కున్నారు. మూడేళ్లు గడిచాయి. అప్పుడే హైదరాబాద్‌లో 'ఎక్స్ వాష్' అనే బ్రాండ్‌తో లాండ్రి బిజినెస్ మొదలయింది. ఇది 2014 నాటి సంగతి. ప్రతిభ స్నేహితురాలు గీత సలహా ఇచ్చారు ''పిల్లలు పెరుగుతున్నారు. ఈ ఉద్యోగంతో వచ్చే ఆదాయం ఏం సరిపోతుంది? ఎక్స్ వాష్ వాళ్లు ఫ్రాంఛైజీలు ఇస్తున్నారట. ఆలోచించు'' అని. నిజమే అనిపించింది ప్రతిభకు. తను దాచుకున్న సొమ్ము, ఇంకొంత అప్పూ తెచ్చి మొత్తం 'ఎక్స్ వాష్' ఫ్రాంఛైజీ తీసుకుంది. అయితే ఫ్రాంఛైజీ తీసుకునేంతవరకు బిజినెస్ పెరగడానికి చాలా హెల్ప్ చేస్తామని చెప్పిన 'ఎక్స్ వాష్' సిబ్బంది తీరా తీసుకున్నాక రెస్పాండ్ అవడమే మానేశారు.



వర్క్‌షాప్‌లో వాషింగ్ సెక్షన్స్

**సొంత బ్రాండ్..**

అసలే బిజినెస్ కొత్త. ఇంత డబ్బు పెట్టి ఈగలు తోలుకుంటూ కూర్చోవడమేనా అనే బెంగ పట్టుకుంది ప్రతిభకు. అయ్యో అనవసరంగా సలహా ఇచ్చానా ఏంటీ అనే అపరాధభావమేమో ఆమె స్నేహితురాలిలో. ''దిగులు పడితే భయమే తప్ప ఆసరా దొరకదు.. ఏ ధైర్యంతో అడుగువేశానో ఆ ధైర్యంతోనే ముందుకు సాగాలి. ఫ్రాంఛైజీ ద్వారా వచ్చిన మెషినరీ ఎలాగూ ఉండనే ఉంది. సొంతంగానే ఈ బిజినెస్‌ను కంటిన్యూ చేస్తే.. అనుభవమో.. లాభమో తెల్సుకోవచ్చు'' అని నిశ్చయించుకున్నారు. ''నాకు మీ ఫ్రాంఛైజీ వద్దు. నేను కట్టిన డబ్బులకు మెషినరీ ఇచ్చారు కాబట్టి అక్కడితో చెల్లుకు చెల్లు'' అని నిర్ద్వంద్వంగా ఎక్స్ వాష్‌వాళ్లతో చెప్పేశారు. సొంతంగా ''లాండ్రి స్పా''ను ప్రారంభించారు కూడా మధురానగర్‌లో. ఇది 2015లో జరిగింది. ఆ యేడాదంతా కష్టపడ్డారు ప్రతిభ. ఆమె లాండ్రీ బిజినెస్ చేస్తున్నారని తెలిసిన వాళ్లు చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుకున్నారు ఆమెకు వినిపించేలాగానే. అయినా ప్రతిభ పట్టించుకోలేదు.యేడాది గడిచింది. పనిచేస్తూ పని నేర్చుకున్నారు. వ్యాపారంలో మెలకువలూ అర్థమయ్యాయి. ఇంకో ఆర్నెల్లు తిరిగేసరికి లాభాలు రావడమూ మొదలయ్యాయి. ఆ లాభాన్ని మళ్లీ పెట్టుబడిగా పెట్టారు ఆమె. కేవలం డ్రై వాషే కాకుండా దుస్తుల మీద మరకలు పోయేలా, ఫ్యాబ్రిక్, డిజైన్, ఆల్ట్రేషన్.. ఇలా దుస్తులకు సంబంధించి అన్ని సేవలూ ఒకే చోట అందేలా తన ల్యాండ్రీ స్పాను విస్తరించారు. మంచి స్పందనే వచ్చింది. దాంతో హైదరాబాద్‌లోనే మాధాపూర్ నుంచి 'లాండ్రీ స్పా' పేరుతో ఫ్రాంఛైజీ తీసుకుంటామని వచ్చారు బీటెక్ స్టూడెంట్స్. ఇచ్చారు ప్రతిభ. ఆ తర్వాత యేడాది అంటే 2017లో విజయవాడలోనూ ఒక బ్రాంచ్‌ను మొదలుపెట్టారు. అక్కడా మంచి రెస్పాన్సే వచ్చింది.

**అందరూ మహిళలే..**

వ్యాపారం విస్తరిస్తున్నకొద్దీ ఉద్యోగుల సంఖ్యనూ పెంచారు ప్రతిభ. అయితే అందరు మహిళలనే తీసుకోవాలని నిర్ణయించుకుని పది, ఇంటర్ విద్యార్హతలున్న స్త్రీలను ఇంటర్వ్యూకి ఆహ్వానించారు. ఈ వర్క్ మీద ఆసక్తి ఉన్నవాళ్లను ఎంచుకొని స్పోకెన్ ఇంగ్లిష్‌తోపాటు లాండ్రీ స్పాలోనూ శిక్షను ఇప్పించారు. ప్రస్తుతం ఈ 'లాండ్రి స్పా' 25 మంది ఉద్యోగులతో హైదరాబాద్‌లోని మధురానగర్‌తోపాటు కొత్తపేట, శ్రీనగర్ కాలనీ, విజయవాడలో రెండు బ్రాంచ్‌లతో నడుస్తోంది. ''ఒకప్పుడు శాలరీ తీసుకునేదాన్ని ఇప్పుడు శాలరీ ఇస్తున్నారు. చాలా గర్వంగా అనిపిస్తూంటుంది. ఐడిల్ జాబ్‌ను వదిలేసి ఈ పనేంటి అని నా మొహం మీదే పెదవి విరిచిన వాళ్లు ఇప్పుడు మంచి పనిచేశావ్ సొంతంగా బిజినెస్ పెట్టుకొని. ఎన్నాళ్లని ఒకళ్లకింద చేయి చాపుతూ ఉంటాం అంటూ మెచ్చుకుంటూంటే మనసులోనే నవ్వుకుంటా. ఒకవేళ నేను చతికిలపడి ఉంటే మేం ముందే చెప్పలేదా అని అనేవాళ్లు. అందుకే ఒకరి ఎంకరేజ్‌మెంట్, డిస్కరేజ్‌మెంట్ మీద ఆధారపడి కాదు మన కాన్ఫిడెన్స్‌ను నమ్ముకొని పనిచేయాలి అంటాను. సర్దుకుపోవడం అవసరమే.. కాని సర్దుకు పోవడమే జీవితం అయితే ఎలా? ప్రతి కష్టం కొత్త పాఠం చెబుతుంది. మనలోని కొత్త సామర్థ్యాన్ని చూపిస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే ధైర్యం మహిళలకు ఉంటుంది. దానికి నన్ను మించిన ఉదాహరణ లేదు'' అంటారు ప్రతిభ వనంబత్తిన.

## ఆగిపోదు.. కొత్తమలుపు తీసుకుంటుంది

**క**ష్టసుఖాల్లో తోడుండాల్సిన భర్త బాధ్యతలకు భయపడి పారిపోతే ఆ కుటుంబ భారాన్ని మోయడానికి ముందుకు వచ్చేది భార్యే. కూలిపని దగ్గర్నుంచి వ్యవసాయం, వ్యాపారాల దాకా సమర్థవంతంగా నిర్వహిస్తూ .. తోటివారినీ నడిపిస్తున్నారు. హైదరాబాద్‌లో స్ట్రీట్ ఫుడ్‌గా విస్తృత ఆదరణ పొందిన సంప్రదాయ ఆహారం జొన్న రొట్టెల వ్యాపారం చేస్తోంది తొంభైశాతం మంది మహిళలే. వాళ్లలో చాలామంది ఒంటరి స్త్రీలే. హైదరాబాద్‌లోని వెంకటరమణ కాలనీకి చెందిన విజయ, అనితలే ఇందుకు ఉదాహరణ. ఈ ఇద్దరిదీ మహబూబ్‌నగర్ జిల్లా. ఒకరిని భర్త వదిలేశాడు. ఇంకొకరి భర్త చనిపోయాడు. సొంత జిల్లాల్లో ఈ ఇద్దరికీ పరిచయం లేదు. పొట్టకూటికోసం పిల్లల్ని చేతబట్టుకొని హైదరాబాద్ వచ్చాకే పరిచయం అయ్యారు ఒకరికొకరు. రోజుంతా ఇళ్లల్లో పనిచేసుకొని.. సాయంకాలం బండి మీద జొన్నరొట్టెల వ్యాపారం పెట్టుకున్నారు చిన్నగా. ఇప్పుడు అదే వాళ్ల ప్రధాన ఉపాధి అయింది. పిల్లల చదువుకు తోడ్పడుతోంది. జీవితం ఆగిపోదు. కొత్త మలుపు తీసుకుంటుంది అంతే. వెదుక్కునే సానుకూల దృక్పథం ఉండాలంతే అంటారిద్దరూ!


ప్రతీకాత్మక చిత్రం

**అంతులేని కథ**

# వెంటాడే భయం

**దిశ సంఘటన భరతమాత హృదయాన్ని గాయపరిచింది. తల్లుల మనసులను కలచివేసింది. ఈ సందర్భంగా ప్రముఖ మరాఠీ రచయిత్రి నీరజ తన మనోవేదనను అక్షర రూపంలో మన ముందు ఉంచారు. ఆ సారాంశం.**

**దే**శంలోని ప్రదేశాల పేర్లు మాత్రమే మారాయి.. ఢిల్లీ, ఉన్నావ్, హైదరాబాద్, మళ్లీ ఉన్నవ్ ఇలా ఎన్నో. ఎక్కడ చూసినా కళ్ల ముందు మహిళలపై జరుగుతున్న అత్యాచార కథనాలే. పోలీసుల వివక్ష.. తదనంతర కథనం.

ఒక దారుణ ఘటన గురించి చదివిన వెంటనే పిడికిలి బిగిస్తారు. ఉద్యమాలూ చేస్తారు. రాజకీయ నాయకులు తోచిన ప్రకటనలు ఇస్తుంటారు. నేరస్థుల్ని శిక్షిస్తామని వాగ్దానం చేస్తారు. కాలక్రమంలో కేసు నీరుగారిపోతుంది. దుఃఖంతో బాధపడుతున్న బాధితురాలి కుటుంబానికి ఎటువంటి న్యాయమూ చేకూరదు. చీకటిలో ప్రయాణించడానికి భయపడే మహిళలకు మరింత భయం కలుగుతుంది. ఇటువంటి సంఘటనలు జరుగుతున్నప్పుడు భయమే చిరకాల స్నేహితురాలు అయిపోతుంది.

•••

సుసాన్ బ్రౌన్‌మిల్లర్ అనే రచయిత్రి తన 'అగైనెస్ట్ అవర్ విల్' అనే పుస్తకంలో 'లైంగిక దాడి అనేది ఒక మహిళ భయపడుతున్నప్పుడు ఒక మగవాడు చేసే పాశవిక చర్య' అని రాశారు. అందుకే వాళ్లకి తరచుగా, స్కూలు, కాలేజీ, ఉద్యోగం.. ఎక్కడ నుంచి అయినా, 'సమయం అయిపోగానే నేరుగా ఇంటికి వచ్చేసెయ్, చీకటి పడ్డాక బయటకు వెళ్లకు, ఒంటరి ప్రదేశాలకు వెళ్లకు' అని చెబుతుంటారు. అంటే మగవారికి భయపడుతున్నారనేగా అర్థం. ఇలా అంటుంటే.. చిన్నచిన్న ఆడపిల్లలు ఇంటి బయట ఆడుకోకూడదనా? ఆడపిల్లలు వాళ్లు నేర్చుకోవలసినవన్నీ విడిచిపెట్టేయాలనా? ఆనందంగా గడపటానికి వీలు లేదా? మరోలా చెప్పాలంటే, మహిళలంతా, మగవారు రేప్ చేస్తారనే భయంతో చీకటిలో మగ్గిపోవాలా? వారు సాధించుకున్న స్వేచ్ఛను మగవారి పశుత్వం కారణంగా వదులుకోవాలా?

•••

కొన్ని సందర్భాలలో అత్యాచారానికి గురైన మహిళలను నిందిస్తున్నారు. ఆడపిల్లల వస్త్రధారణే ఇందుకు కారణం అంటున్నారు. వారు జాగ్రత్తగా ప్రవర్తించాలి అని హితవు చెబుతున్నారు. ఆడవారి శరీరాకృతికి మగవారు వశం తప్పిపోతారట!


ప్రతీకాత్మక చిత్రం

> కదం తొక్కే మహిళల్ని చూసినప్పుడు వారి వల్లనే ఎప్పటికైనా మగవాళ్లలో మార్పు వస్తుందనే ఆశ చిగురిస్తూ ఉంటుంది.
> **– నీరజ, మరాఠీ రచయిత్రి**



దానితో వారిలో కోరిక బయలుదేరి, ఇటువంటి తప్పులు చేస్తున్నారట! ఇలా అని కొన్ని సంవత్సరాల క్రితం ఒక ఆడపిల్లను ఇద్దరు రేప్ చేసిన కేసులో ఒక జడ్జి అన్నారు. మహిళల్లో ఉండదు.. మానభంగం చేసేవారి మనసులోనే ఇటువంటి దురాలోచన నిండి ఉంటుంది. అందువల్లే పసిపిల్లల మీద కూడా వీరు అత్యాచారాలు చేస్తున్నారు.

•••

రచయితలు కవితలు, నవలలు, కథలు రచిస్తున్నప్పటికీ, జర్నలిస్టులు వార్తా కథనాలు ప్రచురిస్తున్నప్పటికీ.. ఒక్క మగవాడిని కూడా మానవత్వంతో నిండిన మంచి పురుషుడిగా మార్చలేకపోతున్నారు. ఇటువంటి దురాగతాలకు అంతం ఎప్పుడు? దీనికి సమాధానం లేదు. జరిగిన ప్రతి ఘటన తర్వాత మహిళలు ఎర్రబడిన ముఖాలతో కదం తొక్కుతారు. అదొక్కటే ఎప్పటికైనా సమాజంలో మార్పు తీసుకురావచ్చుననే ఒక ఆశను ఎప్పటికప్పుడు చిగురింపజేస్తుంటుంది.

**– వైజయంతి**

## తిరుప్పావై 6వ పాశురం

**పుళ్ళుం శిలమ్బిన కాణ్ పుళ్ళరైయన్ కోయిల్**
**వెళ్ళై విళి శంగిన్ పేరరవం కేట్టిలైయో**
**పిళ్ళాయ్! ఎళుందిరాయ్ పేయ్ములై నంజుండు**
**కళ్ళ చ్చగడం కలక్కళియ క్కాలోచి**
**వెళ్ళత్తరవిల్ తుయిల్ అమరంద విత్తినై**
**ఉళ్ళత్తు క్కొండు మునివర్గళుం యోగిగళుం**
**మెళ్ళ ఎళుంద్ వారి ఎన్అ పేరరవం**
**ఉళ్ళం పుగుందు కుళిరుందేలోర్ ఎమ్బావాయ్**

ఇంకా నిద్రపోతున్న మొట్టమొదటి భక్తురాలిని ఆండాళ్ ఈ పాశురంలో ఇలా నిద్ర లేపుతుంది : పక్షుల కలకలారావాలు ఇంకా నీ చెవిని పడలేదా? ఆలయంలో గరుడారూఢుడైన భగవానుని సుప్రభాతసేవలో పూరించిన శంఖనాదం వినిపించటం లేదా ? పూతనాసంహారం, శకటాసురభంజనం చేసి, ఆదిశేషునిపై యోగనిద్రలోనున్న పరమాత్ముడిని మునులు, యోగిపుంగవులు తమ హృదయాలలో ప్రతిష్ఠించి ఏడుమార్లు కావిస్తున్న హరినామస్మరణ పవిత్రఘోష మాకు వినిపించి మేము నిద్ర మేల్కొన్నాం . సఖీ , నువ్వూ నిద్ర లేచిరా' .

విషాన్ని స్తన్యంగా ఇచ్చిన పూతన సంహారం , బండిరూపంలో చంప వచ్చిన రాక్షసుడిని పసికాలితో తన్ని చేసిన శకటాసురవధ –శ్రీమద్భాగవతంలో వర్ణించిన కృష్ణలీలను తలుచుకుని ఉప్పొంగిపోతూ 'హరీ , హరీ ' అంటూ శేషసాయిని స్తుతిస్తూ సాధుజనులు హృదయస్థుడైన పరమాత్మ నుండి మనసు చెదరకుండా అతినెమ్మదిగా తమ యోగనిద్ర నుండి మేల్కొని చేసే అఖండ నామోచ్చారణ గొప్ప మేఘనాదమై నలుదిక్కులా ప్రతిధ్వనిస్తుంటే చెవిన బడి మేము నిద్రలేచాము . చెలీ నీవు కూడా లే . ' అంటుంది ఆండాళ్ .


బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్

**– శ్రీదేవి మురళీధర్**

### ఆట మొదలైంది...




**మా**రెమ్మ గుళ్లో పులివేషం, డప్పుల చప్పుడు అందర్నీ అటువైపు లాగుతోంది. అందరూ వచ్చే పులుల కోసమే కాచుకుకూర్చున్నారు. ఒక్కసారిగా పులివేషాల వాళ్లు ఉన్న తలుపు తెరుచుకుంది. అందరి చూపులు అటే మళ్లాయి. ఒక పెద్దపులి నిమ్మకాయను నోటితో కరుచుకుని లోపలి నుంచి ఒక్క గెంతుతో బయటికి వచ్చింది.

రాగానే జనమంతా బెదిరి పక్కకు జరగడంతో అక్కడ గుండ్రంగా చోటు ఏర్పడింది. ఆ తర్వాత నాలుగైదు పెద్దపులులు, తోడేలు, కొంటెకోణంగి, ఒకటి తర్వాత ఒకటి బయటికి వచ్చాయి. వచ్చిన వాటిలో ఒక పులి పిల్ల కూడా ఉంది.

అంతా వచ్చాక వరుసగా నుంచుని దేవుడికి చేతులు జోడించి తీర్థం తీసుకున్నారు. తర్వాత అక్కడి నుంచే ఆట మొదలైంది? ఎలా అంటే...

*కన్నడ కథ (మూలం: దేవనూర మహాదేవ) 'అమాస'లో చదవండి.*

### శంకర విజయం

శంకరుడు ఆమె మాటకు అవును అనలేదు కాదు అనలేదు. కానీ ఇది సన్యాసికి తగిన పనేనా? అన్న గుసగుసలు మాత్రం సభలో వినిపించాయి.

''ఓడిపోతే సన్యాసం తీసుకుంటానని వాదప్రతిజ్ఞ చేశావు. నీవంటి వాడి నోటి వెంట పరిహాసానికైనా అటువంటి అశుభ వాక్యం రావచ్చునా?! ఆ మాట పలికినందుకైనా ఈ ప్రశ్నకు సమాధానం నీకు తెలుసుకోక తప్పదు'' తీర్మానించింది ఉభయభారతి. ఆ సమయంలో శంకరుడు అన్నదేమిటి?



*విజయ ముహూర్తం (శంకర విజయం: ఆదిశంకరాచార్యుల జీవితచరిత్ర–27)లో చదవండి.*

*ఇంకా... ఆశకు మరోపేరు క్రిస్మస్ (ముఖచిత్రకథనం), క్రిస్మస్ కేకు (కొత్త కథ), నిర్మల భక్తి (పురానీతి), చిన్నారి శశిరేఖ వర్ధిల్లవమ్మా (పాటతత్వం), నవ్వుని దాచొద్దు (బ్యూటీజర్), ఒక్క పొద్దు (ఇసుక చెట్టు: గల్ఫ్ కథలు), మల్లెల తీరం (ఈవారం కథ), ఈస్టర్ ఎగ్ (క్రైమ్‌స్టోరీ), మెదడుకి పదును పెట్టే పజిల్స్ (పదశోధన, మాయాబజార్, మైథోగ్రఫీ, బ్రెయిన్ జిమ్, ఫుడ్ పిరమిడ్, పదవినోదం), ప్లేటైమ్, శాంతి చిహ్నం (పిల్లల కథ).... ఇంకా మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి ఫన్‌డేలో చదవండి.*

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
21-12-2019

# స్వీట్ క్రిస్మస్





**దట్టంగా మంచుకురిసే రాత్రి జీసస్ పుట్టాడు.**
**ఎంత తీపి కబురు.**
**అందరి నోరూ తీపి చేయాల్సిన కబురు.**
**ఏం చేద్దాం. కేక్ చేద్దాం. ఏం కేక్. ప్లమ్ కేక్, రమ్ కేక్, చాక్లెట్ కేక్, మార్బుల్ కేక్...**
**కేక్‌ల పండుగుల ఇది. ఒకరికి కేక్ పంచి సంతోషించే పండుగ.**
**ఎప్పుడూ కొనడమేనా. ఈసారి చేయొచ్చుగా?**

## ట్రిపుల్ లేయర్ చాకొలేట్ కేక్

**ఈ కేకును తయారుచేయడం కొంచెం కష్టమే. కాని ఇది పూర్తయ్యాక చూసుకుంటే అలసట అంతా మరచిపోవచ్చు. ఇక తిన్నాక, నోటి నుంచి మాటలు రావు. అంత ఆనందంగా ఆస్వాదిస్తూ తింటారు ఈ కేక్‌ని.**

**కావలసినవి: మొదటి లేయర్ కోసం:** మైదా పిండి – ఒకటిన్నర కప్పులు; బేకింగ్ పౌడర్ – ముప్పావు టీ స్పూను; బేకింగ్ సోడా – అర టీ స్పూను, ఉప్పు – పావు టీ స్పూను; బటర్ – అర టీ స్పూను; పంచదార – ముప్పావు కప్పు; వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ – అర టేబుల్ స్పూను; కోడి గుడ్లు – 2; బటర్ మిల్క్ – ముప్పావు కప్పు.

**బటర్ క్రీమ్ కోసం:** పంచదార – ఒక కప్పు; కోడిగుడ్డు తెల్ల సొనలు – 4; నిమ్మరసం – అర టీ స్పూను; ఉప్పు – చిటికెడు; బటర్ – ఒక కప్పు.

**కుకీ డఫ్ లేయర్ కోసం:** మొలాసెస్ – 2 టీ స్పూన్లు; చాకొలేట్ చిప్స్ – పావు కప్పు.

**ఓరియో లేయర్ కోసం:** ఓరియో బిస్కెట్స్ (బ్రౌన్ కలర్) – 3

**బ్రౌనీ లేయర్ కోసం:** డచ్ ప్రోసెస్డ్ కోకో పౌడర్ – 2 టేబుల్ స్పూన్లు

**గార్నిషింగ్ కోసం:** బ్రౌనీ కుకీస్, ఓరియోలు (టాపింగ్ కోసం) – 2 టేబుల్ స్పూన్లు; గనాచే (కుకింగ్ చాకొలేట్ + పాలు కలిపి తయారుచేసినది) – 2 కప్పులు.

**తయారీ:** 350 డిగ్రీల దగ్గర అవెన్‌ను ప్రీ హీట్ చేయాలి ● తొమ్మిది అంగుళాల కేక్ పాన్‌ను బటర్, మైదాలతో గ్రీజ్ చేయాలి ● ఒక పాత్రలో మైదా పిండి, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు వేసి బాగా కలియబెట్టాలి ● మరొక పాత్రలో పంచదార, బటర్ వేసి బాగా గిలకొట్టి క్రీమ్ తయారుచేసుకోవాలి ● కోడి గుడ్డు సొనలు, వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ జత చేసి మరోమారు బీటర్‌తో బాగా గిలకొట్టాలి ● మైదా పిండిలో సగ భాగాన్ని జత చేయాలి ● సగం బటర్ మిల్క్ జత చేసి గిలకొట్టాక, మిగిలిన మైదా పిండి, బటర్ మిల్క్ జత చేసి మరోమారు బాగా గిలకొట్టాలి ● ఈ మిశ్రమాన్ని మూడు సమాన భాగాలుగా విడదీసి, ఒక్కో లేయర్‌కు తీసుకున్న పదార్థాలను ఒక్కో దానికి విడివిడిగా జత చేయాలి ● కేక్‌పాన్‌లో ఒక లేయర్ తరవాత మరొక లేయర్‌కి కలుపుకున్న మిశ్రమాలను జాగ్రత్తగా వేసి, అవెన్‌లో ఉంచి సుమారు 35 నిమిషాలు బేక్ చేయాలి.

**బటర్ క్రీమ్ కోసం:** ఒక సాస్‌పాన్‌లో కొద్దిగా నీళ్లు పోసి మరిగించాలి ● వేరొక పాత్రలో పంచదార, కోడిగుడ్డు తెల్ల సొన నిమ్మ రసం, ఉప్పు వేసి ఆ పాత్రను మరుగుతున్న నీళ్ల గిన్నెలో ఉంచాలి ● పదార్థాలన్నీ వేడెక్కి, పంచదార కరిగేవరకు కలిపి దింపేసి, ఈ మిశ్రమాన్ని బటర్‌లో వేసి కొద్దిసేపు కలియబెట్టాలి (ఇలా చేయడం వల్ల మృదువుగా అయ్యి, కేక్ మీద సమానంగా వేయటానికి సులువుగా ఉంటుంది) ● బేక్ చేసుకున్న కేక్ బేస్‌ను బయటకు తీసి, మొదటి లేయర్‌ను ఒక ప్లేట్‌లో ఉంచాలి ● బటర్ క్రీమ్‌ను అర అంగుళం మందంలో మొదటి లేయర్ మీద సమానంగా పోయాలి ● రెండవ లేయర్‌ను ఉంచి దాని మీద కూడా ఇదే విధంగా చేసి, మూడో లేయర్‌ను ఉంచాలి ● గనాచేతో అలంకరించాలి ● టాపింగ్స్ కోసం తీసుకున్న వాటిని కూడా జత చేయాలి.

## మార్బుల్ కేక్

**ఈ కేక్‌కి తయారుచేసే బేస్‌ని చాకొలేట్ మార్బుల్ అంటారు. ఎవరి ఆలోచనకు వారు పదును పెట్టుకుని, మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్ లేదా తాజా పండ్లు... బ్లూ బెర్రీలు, స్ట్రాబెర్రీలు ఏవైనా సరే... బ్యాటర్‌కి జత చేస్తే - కేక్ కలర్‌ఫుల్‌గా వస్తుంది.**

**కావలసినవి:** మైదా పిండి – 2 కప్పులు; బేకింగ్ పౌడర్ – 2 టీ స్పూన్లు; పంచదార పొడి – ఒక కప్పు కంటె ఎక్కువ; ఉప్పు – చిటికెడు; బటర్ – అర కప్పు (సాల్టెడ్ బటర్ వాడుతుంటే ఉప్పును ఉపయోగించక్కర్లేదు); కోడి గుడ్లు – 2; వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ – ఒక టీ స్పూను; ఫుడ్ కలర్ – చిటికెడు; పాలు – ఒక కప్పు; కోకో పొడి – 3 టేబుల్ స్పూన్లు

**తయారీ:** ముందుగా అవెన్‌ను 350 డిగ్రీల దగ్గర ప్రీ హీట్ చేయాలి ● కేక్ పాన్‌ను బటర్‌తో గ్రీజ్ చేయాలి ● ఒక పెద్ద పాత్రలో మైదా పిండి, బేకింగ్ పౌడర్, ఉప్పు, పంచదార పొడి, బటర్, కోడి గుడ్డు సొనలు, వెనిలా ఎసెన్స్, పాలు వేసి బాగా గిలకొట్టాలి (అన్నీ కలిసి బాగా మెత్తగా అయ్యేవరకు గిలకొడితే కేక్ స్మూత్‌గా వస్తుంది) ● సగం కంటె ఎక్కువ భాగాన్ని కేక్ పాన్‌లో పోయాలి ● ఆ పైన వెనిలా ఎక్స్‌ట్రాక్ట్‌ను, ఫుడ్ కలర్ మిశ్రమం, కోకో పొడి ఒక దాని మీద ఒకటి పోయాలి ● చాకుతో కాని ఒక పుల్లతో కాని ఈ మిశ్రమాన్ని జాగ్రత్తగా సరిచేయాలి (మార్బుల్ ఎఫెక్ట్ వచ్చేలాగ) ● అవెన్‌లో ఉంచి సుమారు 40 నిమిషాలు బేక్ చేయాలి ● బయటకు తీసి చల్లారాక సర్వ్ చేయాలి.

## సాల్టెడ్ క్యారమెల్ షీట్ కేక్



**కావలసినవి:** మైదా పిండి – రెండు కప్పుల కంటె కొద్దిగా ఎక్కువ; బటర్ – ఒక కప్పు; పంచదార – అర కప్పు; బ్రౌన్ సుగర్ – ఒక కప్పు ; పెద్ద కోడి గుడ్లు – 2; వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ – 2 టీ స్పూన్లు; తాజా పెరుగు – అర కప్పు; బేకింగ్ సోడా – ఒక టీ స్పూను; ఉప్పు – అర టీ స్పూను; చిక్కటి పాలు (హోల్ మిల్క్) – ఒక కప్పు.

**తయారీ:** ● ముందుగా అవెన్‌ను 350 డిగ్రీల దగ్గర ప్రీ హీట్ చేయాలి ● 12 అంగుళాల చతురస్రాకారంలో ఉన్న కేక్ పాన్‌లను ముందుగా కొద్దిగా బటర్‌తో గ్రీజ్ చేయాలి ● ఒక పెద్ద పాత్రలో పంచదార, బటర్ వేసి బాగా కలిపి, మెత్తగా వచ్చేవరకు గిలకొట్టాలి ● కోడి గుడ్డు సొనలు, వెనిలా ఎక్స్‌ట్రాక్ట్, పెరుగు జత చేసి మరోమారు గిలకొట్టాలి ● మరొక పాత్రలో మైదా పిండి, బేకింగ్ సోడా, ఉప్పు వేసి బాగా కలిపి, సగ భాగాన్ని కోడి గుడ్డు మిశ్రమానికి జత చేయాలి ● అర కప్పు పాలు జత చేసి నెమ్మదిగా గిలకొట్టాలి ● మిగిలిన పిండిని జత చేస్తూ, మిశ్రమం మెత్తగా వచ్చేలా బాగా బీట్ చేయాలి ● ట్రేలో పోసి, అవెన్‌లో ఉంచి 25 నిమిషాల పాటు బేక్ చేయాలి ● బయటకు తీసి, చల్లారాక, సాల్టెడ్ కారమెల్‌ను పైన చల్లి అందించాలి.

## యూలే ద లాగ్





**చాలామందికి ప్లమ్ కేక్, రమ్ కేక్ తెలుసు. మీరెప్పుడైనా యూలే ద లాగ్ కేక్ తయారుచేసుకున్నారా! ఇది చూడటానికి చెక్క దూలంలాగ ఉంటుంది. అందువల్ల ఈ కేక్‌ను చూడగానే సంతోషంతో పాటు సెలవును ఆస్వాదిస్తున్న భావన కూడా కలుగుతుంది.**

**కావలసినవి:**

**కేక్ కోసం:** కోడి గుడ్లు – 6; పంచదార – ముప్పావు కప్పు; కోకో పొడి – అర కప్పు; వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ – ఒక టీ స్పూను

**ఐసింగ్ కోసం:** డార్క్ చాకొలేట్ తురుము – ఒక కప్పు కంటె కొద్దిగా ఎక్కువ; పంచదార – ఒక కప్పు కంటె కొద్దిగా ఎక్కువ; సాఫ్ట్ బటర్ – ఒక కప్పు; వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ – ఒక టేబుల్ స్పూను.

**అలంకరించడం కోసం:** 2 టేబుల్ స్పూన్ల పంచదార, పార్లే జి బిస్కెట్స్, ఎరుపు రంగు ఫుడ్ కలర్ (చెర్రీలు తయారుచేయడానికి); మెరింగ్ మష్రూమ్స్, చాకొలేట్ సాయిల్, క్రిస్మస్ ట్రీ పుల్లలు

**తయారీ:** ముందుగా అవెన్‌ను 350 డిగ్రీల దగ్గర ప్రీహీట్ చేయాలి ● ఒక పెద్ద పాత్రలో కోడి గుడ్డు తెల్ల సొనలను వేసి బీటర్‌తో బాగా గిలకొట్టాలి ● బాగా మెత్తగా అయిన తరవాత పావు కప్పు పంచదార కొద్దికొద్దిగా వేస్తూ మళ్లీ గిలకొడుతుండాలి ● వేరొక పాత్రలో కోడి గుడ్డు పచ్చ సొనలను వేసి పంచదార జత చేస్తూ గిలకొట్టాలి ● వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ జత చేయాలి ● కోకో పొడిని జల్లెడ పట్టి, మెత్తటి పొడిని కొద్దికొద్దిగా జత చేస్తూ గిలకొట్టాలి ● కోడి గుడ్డు తెల్ల సొన మిశ్రమాన్ని కొద్దికొద్దిగా జత చేస్తూ, అన్నీ బాగా కలిసేలా గిలకొట్టాలి (ఎంత ఎక్కువసేపు గిలకొడితే అంత మెత్తగా వస్తుంది కేక్) ● నలుచదరం లేదా దీర్ఘచతురస్రాకారంలో ఉన్న కేక్‌పాన్‌లో బేకింగ్ షీట్ లేదా ఫాయిల్ (కింద కొద్దిగా పంచదార వేస్తే కేక్ అతుక్కోకుండా తేలికగా వస్తుంది) ఉంచి, దాని మీద ఈ మిశ్రమాన్ని సమానంగా పరిచి, అవెన్‌లో ఉంచి, సుమారు 20 నిమిషాల పాటు బేక్ చేయాలి ● చల్లారిన తరవాత, జాగ్రత్తగా ప్లేట్‌లోకి తీసుకోవాలి.

**ఐసింగ్‌తయారీ:** ● చాకొలేట్‌ను ముందుగా కరిగించాలి (మైక్రోవేవ్‌లోకాని వేడి నీళ్ల మీద కాని) ● ఒక పాత్రలో పంచదార, బటర్ వేసి బాగా గిలకొట్టాలి ● కరిగించిన చాకొలేట్, వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ జత చేసి మెత్తగా వచ్చే వరకు కలుపుతుండాలి ● బాగా మెత్తగా అయిన తరవాత కేక్ మీద సమానంగా పరిచి, కేక్‌ను (ఫాయిల్‌తో) నెమ్మదిగా రోల్ చేయాలి (వదులుగా కాకుండా టైట్‌గా వచ్చేలా జాగ్రత్తగా రోల్ చేసి, చివరగా ప్రెస్ చేయాలి) ● అంచులను జాగ్రత్తగా కట్ చేయాలి ● మిగిలిన భాగాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేయాలి ● అంతే!!! అందమైన కేక్ సిద్ధమైనట్లే.

## కేక్ పాప్స్



**కావలసినవి: కేక్ పాప్స్ కోసం:** పొడిపొడిగా మిగిలిపోయిన కేక్ (క్రంబల్డ్ కేక్) – 2 కప్పులు; హెవీ క్రీమ్ – ఒక కప్పు

**కోటింగ్ కోసం:** తగినంత డార్క్ చాకొలేట్ లేదా వైట్ చాకొలేట్; తగినంత నట్స్ పొడి; కార్డ్‌బోర్డ్ బాక్స్.

**తయారీ:** ఒక పాత్రలో క్రీమ్, క్రంబల్డ్ కేక్ వేసి బాగా కలపాలి (ఈ పొడి కొద్దిగా ఎక్కువ ఉన్నా పరవాలేదు) ● రెండు అంగుళాల పరిమాణంలో బాల్స్‌లా చేతితో చేసి, పొడవాటి పుల్లలకు గుచ్చి, పక్కన పెట్టాలి ● డార్క్ చాకొలేట్ లేదా వైట్ చాకొలేట్‌ను కరిగించాలి (ఒక మామూలు గిన్నెలో వీటిని ఉంచి, మరుగుతున్న గిన్నె మీద ఈ గిన్నె ఉంచి కరిగించాలి) ● కరుగుతున్న చాకొలేట్‌లో కేక్ బాల్స్ పుల్లలను ముంచి, తీసేసి, కార్డ్ బోర్డు మీద ఉంచాలి ● నట్స్ పొడి చల్లాలి ● చల్లారాక అందించాలి (వీటిని ఫ్రిజ్‌లో ఉంచితే నాలుగైదు రోజుల వరకు చెడిపోకుండా ఉంటాయి)



కర్టెసీ:
**మేహా దేశాయ్,**
ప్రొడక్ట్ లీడర్ ఎట్ ఇమాజినేట్ సాఫ్ట్‌వేర్ లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్

---

ఫుడ్ ప్రింట్స్

# చుప్పల కోట

**ఇవి గప్‌చుప్‌గా విదేశాలకు సైతం ప్రయాణిస్తున్నాయి... ఒక్కసారి చుప్పలను పంటి కింద ఉంచి కరకరలాడిస్తే చాలు... మళ్లీ మళ్లీ కావాలని అడగకుండా ఉండలేరు... సుమారు 40 సంవత్సరాలుగా చుప్పలను తయారుచేస్తూ, సారవకోట పేరును ప్రపంచ పటంలోకి తీసుకువెళ్తున్న ఆనందరావు ప్రయాణమే ఈ వారం ఫుడ్ ప్రింట్స్...**

చుప్పల వాసన వస్తేనే చాలు, వెంటనే వాటిని తినాలనిపిస్తుంది. శ్రీకాకుళం జిల్లా సారవకోట దగ్గర పడుతుంటే, బస్సులో పడుకున్నవారిని సైతం నిద్రలేపుతుంది చుప్పల రుచి. ఈ గ్రామం జాతీయ రహదారిని ఆనుకుని ఉండటం వల్ల ఒడిషా వెళ్ళేవారంతా వీటిని కొనుగోలు చేస్తుంటారు. ఈ చుప్పలకు సుమారు 40 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇతర దేశాలలో ఉన్న తమ పిల్లలకు వీటిని పంపిస్తుండటంతో, వీటి ప్రత్యేకత ఇతర దేశాలకు కూడా వ్యాపించింది.

**ఇదీ చరిత్ర:** 1960 సంవత్సరంలో జలుమూరు నుండి పొట్ట చేత పట్టుకుని బతుకు తెరువు కోసం సారవకోటకు వలస వచ్చారు తంగుడు వంశీయులు. చుప్పల తయారీ ప్రారంభించారు. వీరు తమకు తెలిసిన మెళకువలను మరిన్ని వైశ్య కుటుంబాలకు నేర్పించటంతో, ప్రస్తుతం పన్నెండు కుటుంబాల వారు వీటిని తయారు చేస్తూ, కుటుంబాలు పోషించుకుంటున్నారు.

**అలసట చూపకూడదు:** చుప్పల తయారీలో ఏమాత్రం ఏమరుపాటు చూపినా వీటి నాణ్యత, రుచి దెబ్బతినే ప్రమాదం ఉంది. చుప్పల తయారీకి సాంబమసూరి, సి ఆర్ రకం బియ్యాన్నే వినియోగిస్తున్నారు. ఇందులోకి దేశవాళీ నువ్వులనే వాడతారు. వీటిని సాధారణంగా మహిళలే తయారు చేస్తారు. ముందుగా బియ్యాన్ని కడిగి అరబెట్టి, తరువాత మెత్తని పిండిగా తయారు చేస్తారు. పొట్టు తీసిన నువ్వులను, బియ్యప్పిండిలో కలిపి తగినన్ని నీళ్లు, ఉప్పు, వాము కలిపి పలచగాను, చిక్కగాను కాకుండా పిండి కలుపుకుంటారు. ఈ పిండితో వృత్తాకారంగా చుట్టి, సుమారు అరగంట సేపు ఆరబెట్టి, నూనెలో దోరగా వేయిస్తారు. ఇదీ చుప్పల తయారీ విధానం.

పెళ్లిళ్ల సీజన్‌లో చుప్పలకు మంచి గిరాకీ ఉంటుంది. సారెలో చుప్పలను తప్పనిసరిగా చేయించుకుంటున్నారు. నెలకు 50 వేల రూపాయల టర్నోవర్‌తో నడుస్తోంది. ప్రస్తుతం శ్రీకాకుళం, పర్లాకిమిడి, తెంబూరు, పాతపట్నం, నరసన్నపేట ప్రాంతాలను ఈ కుటుంబీకులే చుప్పలు సరఫరా చేస్తున్నారు.



మాది ఒరిస్సాలో గునుపూరు. మేం ఏడుగురు అన్నదమ్ములం. నా చిన్నప్పటి నుంచి తాతగారి దగ్గర నర్సన్నపేటలో ఉండేవాడిని. వివాహం అయ్యాక జీవనోపాధి కోసం 40 సంవత్సరాల క్రితమే సారవకోటకు వచ్చాం. మేము వ్యాపారస్థులం, ఎవ్వరికీ అరువు పెట్టం. అలా చేస్తే, వ్యాపారంలో నష్టపోతామని మా నమ్మకం. వ్యాపారం ప్రారంభించిన కొత్తలో రెండు డబ్బాల చుప్పలు తయారు చేసి అమ్మేవాళ్లం. వ్యాపారంలో లాభం అంతగా రాకపోయినా, నష్టం ఉండేది కాదు. ఇవి వారం రోజుల వరకు నిల్వ ఉంటాయి. జాగ్రత్తగా నీడలో ఉంచితే, పాడు కావు. ఎండలో పెడితే మూడు రోజులకే పాడైపోతాయి. ఏదైనా పని మీద ఎప్పుడైనా మేం ఊరు వెళ్లాలనుకుంటే మా పని ఆపుకుంటాం. మా ఆవిడ సత్యవతి స్వయంగా వీటిని తయారు చేస్తుంది. నేను దుకాణంలో వ్యాపారం చూసుకుంటాను.

**- ఆనందరావు**



షాపుల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న చుప్పలు



చుప్పలను చుడుతున్న మహిళ

**– కందుల శివశంకర్,** సాక్షి, శ్రీకాకుళం
– ఫొటోలు: **వై. గణేష్,** సారవకోట

---

ఆయుర్వేదం

# గోధుమ అవతారాలు

**ఆ**యుర్వేదం ఆహారధాన్యాలను ఐదు రకాలుగా విభజించింది. శాలి, షష్టిక (వ్రీహి), శూక, శింబీ, తృణ. రంగు, రూపం, పరిమాణం, ఎంతకాలంలో పంట పండుతుంది వంటి అంశాలను బట్టి వీటికి నామకరణం చేసి, గుణధర్మాలను వివరించారు. యవలు, గోధుమలను శూక ధాన్యాలుగా వర్ణించారు. ఈ గింజలకు ఒక వైపు చిన్న ముక్కు ఆకారంలో సూదిగా ఉంటుంది.

గోధుమలు: పరిమాణంలో కొంచెం పెద్దగా ఉన్నవాటిని మహా గోధుమలనీ, చిన్నగా ఉన్నవాటిని మధూలీ గోధుమలనీ, శూకము లేకుండా పొడవుగా ఉన్నవాటిని దీర్ఘ గోధుమలనీ అన్నా రు. వీటినే నందీముఖ గోధుమలని కూడా అంటారు.

**గుణాలు:** (భావప్రకాశ): గోధూమో మధురః శీతో వాతపిత్తహరో – గురుః జీవనోబృంహణో, వర్ణ్యః, వ్రణరోపకః, రుచ్యః స్థిరకృత్’ – రుచికి తియ్యగా ఉంటాయి. కొంచెం జిగురుగా ఉండి ఆలస్యంగా జీర్ణమవుతాయి. బరువు ఆహారం, బలకరం, శుక్రకరం, ధాతు పుష్టికరం, జీవనీయం, చర్మకాంతిని పెంపొందిస్తుంది. గాయాలను మాన్చటానికి ఉపయోగపడుతుంది.

కొత్తగా పండిన గోధుమలు కఫాన్ని కలిగిస్తాయి, బరువైన ఆహారం. పాతబడిన గోధుమలు తేలికగా జీర్ణమై, శరీరంలోని కొవ్వుని కరిగించి, బరువుని తగ్గిస్తుంది. మెదడుకి మంచిది (మేధ్యము). నీరసాన్ని పోగొడుతుంది. శుక్రకరం కూడా. అడవి గోధుమల్ని ఆయుర్వేదం గవేధుకా అంది. ఇవి తీపితో పాటు కొంచెం కారంగా ఉంటాయి. కొవ్వుని, కఫాన్ని హరించి, స్థూల కాయాన్ని తగ్గిస్తుంది.



**ఆధునిక శాస్త్ర విశ్లేషణ:** గోధుమ పైపొరను బ్రాన్ అంటారు. లోపల జెర్మ్, ఎండోస్పెర్మ్ అనే పదార్థాలుంటాయి. గ్లూటెన్ అనే అంశ వలన గోధుమపిండి జిగురుగా ఉంటుంది. అన్నిటికంటె జెర్మ్‌లో ప్రొటీన్లు, కొవ్వు, పీచు, ఫాస్ఫరస్, ఐరన్, కాల్షియం, కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అన్ని భాగాలతో కూడిన గోధుమల్ని ఆహారంగా సేవించడం శ్రేష్ఠం. బ్రాన్‌లో పీచు అధికంగా ఉంటుంది. జెర్మ్ నుంచి మొలకలు తయారవుతాయి. గోధుమగింజలో ఎండోస్పెర్మ్ ఎక్కువగా ఉంటుంది. దీంట్లో కార్బోహైడ్రేట్ (శర్కర) మాత్రమే ఉంటుంది. ఇతర పోషకాలేవీ ఉండవు. 100 గ్రా. సంపూర్ణ గోధుమలో 346 కేలరీలు ఉంటాయి.



**బొంబాయి రవ్వ:** ఇది మనం చేసుకునే ఉప్మాకు ప్రసిద్ధి. దీనిని సంపూర్ణ గోధుమను కొంచెం సంస్కరించి తయారుచేస్తారు కనుక పోషక విలువలు పదిలంగానే ఉంటాయి.

**మైదా:** ఇది అతి తెల్లని, అతి మెత్తని పిండి. దీనిని గోధుమలోని ఎండోస్పెర్మ్‌ని బ్లీచింగ్ చేయటం ద్వారా తయారుచేస్తారు. బ్రాన్, జెర్మ్‌లను సంపూర్ణంగా తొలగిస్తారు. కనుక మైదాలో ఎక్కువ సాంద్రతలో స్టార్చ్/శర్కర మాత్రమే ఉండటం వలన గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువ. కనుక మధుమేహరోగులకు మంచిది కాదు. పీచు ఉండకపోవటం వలన మలబంధకం కలుగుతుంది. శరీర బరువును పెంచుతుంది.

**బ్లీచింగ్ చేయటం కోసం కలిపే కెమికల్స్**

క్లోరిన్ బెంజాయిక్, కాల్షియం పెరాక్సైడ్, ఎంజోడై కార్బనమైడ్ ప్రధానమైనవి. ఎండోస్పెర్మ్‌తో జరిపే రసాయనిక చర్య వలన ఎలోగ్జిన్ అనే మరో కెమికల్ ఉత్పత్తి కణాలను ధ్వంసం చేసి డయాబెటిస్‌ను కలిగిస్తాయి.

పూరీలు, నిమ్‌కీన్స్, పునుగులు, చల్ల బూరెలు, బొబ్బట్లు, బ్రెడ్, రకరకాల కేకులు, సమోసాలు, పేస్ట్రీలు మొదలైనవి మైదా వంటకాలలో ప్రధానమైనవి. పాలకోవా, బర్ఫీలలో వ్యాపారార్థమై మైదాను కలిపేస్తారు.

**జాగ్రత్త:** పై విషయాలను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు తమ తమ ఆరోగ్యాలను కాపాడుకోవటం అవసరం.



**- డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి** ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్, ఫోన్: 9963634484

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
21-12-2019

యంగ్ బాలీవుడ్ -8 / వరుణ్ ధావన్

**అతనొచ్చినప్పుడు చూద్దాంలే అనుకున్నారు.**
**వచ్చాక చూడొచ్చేమో అని డౌట్ పడ్డారు.**
**నాలుగైదు సినిమాల తర్వాత చూడాల్సిందే అనుకున్నారు.**
**మరో రెండు హిట్స్ తర్వాత సత్తా చూపించేవాడు అని అంగీకరించారు.**
**ఇప్పుడు అతను చేస్తుంటే పెద్ద పెద్ద హీరోలు కూడా**
**చూస్తూ ఉండిపోతున్నారు.**
**వరుణ్ ధావన్ విజయం అనూహ్యం.**
**అందుకే అతని అభిమానులకు అతడొక దైవం.**

# వరుణ్ ధావన్ కుర్రకారుకు భగవాన్










సినిమా రంగంలో కొన్ని వింతలు జరుగుతుంటాయి. అమెరికా వెళ్లిపోయి వ్యాపారం చేసుకోవాలనుకున్న కరణ్ జొహార్ అనుకోకుండా మిత్రుడు ఆదిత్య చోప్రా కోరిక మేరకు 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' సినిమాకు అసిస్టెంట్‌గా మారాడు. కరణ్ జొహార్ సినిమా ఫీల్డ్ నుంచే వచ్చినా సినిమాలకు పని చేయడం ఇదే కొత్త. సెట్‌లో ఒకటి రెండురోజులు పని చేశాక మనవల్ల కాదులే అనుకుని వెళ్లిపోబోతూ ఉంటే ఇతను చెక్కేసేలా ఉన్నాడని కనిపెట్టిన ఆదిత్యా చోప్రా 'షారూక్ ఖాన్ కాస్ట్యూమ్స్ చూడు' అని ఆదేశించాడు. కరణ్ జొహార్ తెచ్చి చూపించిన కాస్ట్యూమ్స్ షారూక్‌కు బాగా నచ్చాయి. 'నువ్వు నాతో పని చేయి' అని ఎంకరేజ్ చేశాడు. అంతే కాదు 'నీ సినిమాకు డేట్స్ ఇస్తాను' అని కూడా అన్నాడు. అలా కరణ్ జొహార్ 'కుచ్‌కుచ్ హోతా హై' సినిమాకు డైరెక్టర్ అయ్యాడు.

అదే కరణ్ జొహార్ 'మై నేమ్ ఈజ్ ఖాన్' తీస్తున్నప్పుడు వరుణ్ ధావన్ ఆ సినిమాకు అసిస్టెంట్‌గా పని చేశాడు. వరుణ్ ధావన్ మామూలు కుర్రవాడు కాదు. ఎన్నో సూపర్ డూపర్ హిట్ సినిమాలు తీసి శ్రీమంతుడిగా మారిన దర్శకుడు డేవిడ్ ధావన్ కుమారుడు. తండ్రిలాగే డైరెక్టర్ కావాలా లేదంటే హీరో కావాలా అని ఆలోచిస్తున్నవాడు. 'అయితే నా దగ్గర పని సరిగ్గా నేర్చుకోవు. వేరేవాళ్ల దగ్గర నేర్చుకో' అని తండ్రి కరణ్ జొహార్ దగ్గర పెట్టాడు. వరుణ్ ధావన్ ప్రాథమికంగా డాన్సర్. మిమిక్రీ చాలా బాగా వచ్చు. మిథున్ చక్రవర్తిని బాగా ఇమిటేట్ చేస్తాడు. ఈ టాలెంట్‌నీ సెట్‌లో అతడు కష్టపడి పని చేస్తున్న పద్ధతిని చూసిన షారూక్ ఒకరోజు పిలిచి 'నీకు డైరెక్షన్ కంటే యాక్టింగే బెటర్' అని సలహా ఇచ్చాడు. కొన్నాళ్లకు వరుణ్ ధావన్ యాక్టర్ అయ్యాడు. అంతేనా? షారూక్‌ఖాన్ పక్కన 'దిల్‌వాలే'లో సరిజోడుగా నటించాడు. సినిమాల్లో మనం చూస్తుండగానే స్టూపర్‌స్టార్స్ పక్కన సూపర్‌స్టార్స్ చేరుతారు. వరుణ్ ధావన్ అలా చేరినవాడు.

### స్టూడెంట్ నం.1

షారూక్ ఖాన్ భార్య గౌరీఖాన్, కరణ్ జొహార్ కలిసి కొత్తవాళ్లతో చిన్నసినిమాగా 'స్టూడెంట్ నం.1' (2012) తీద్దామని అనుకున్నప్పుడు ఆలియాభట్ కాకుండా కరణ్ జొహార్‌కు గుర్తొచ్చిన రెండు పేర్లు వరుణ్ ధావన్, సిద్దార్థ్ మల్హోత్రా. ఇద్దరూ అతని దగ్గర దర్శకత్వ శాఖలో పని చేసినవారే. నటులుగా మారుదామని ప్రయత్నిస్తున్న వారే. వారిని తీసుకున్నాడు కరణ్‌జొహార్. తండ్రి ప్రేమ కోసం పెనుగులాడుతూ ప్రియురాలి ప్రేమ దక్కుతుందా లేదా అనే అభద్రత పొందుతూ సతమతమయ్యే పాత్రలో వరుణ్ ధావన్ ఈ సినిమాతో ప్రేక్షకుల దృష్టిలో పడ్డాడు. అప్పటికి అతని వయసు 25 సంవత్సరాలే కావడం పూర్తిగా లేతదనం పోకపోవడంతో సినిమా పెద్ద హిట్ అయినా అవకాశాలు రాలేదు. అప్పుడు వరుణ్ ధావన్ తెలుగులో హిట్ అయిన 'కందిరీగ' సినిమా రీమేక్ 'మై తేరా హూ' (2014)లో నటించాడు. ఆ సినిమా హిట్ అయ్యింది. అదే సంవత్సరం రిలీజ్ అయిన 'హంప్టీ శర్మాకి దుల్హనియా' కూడా హిట్ అయ్యింది. కాని అతనికి దేశం మొత్తం గమనించాల్సిన హిట్ అవసరం ఉంది. అది 'బద్‌లా పూర్' రూపంలో వచ్చింది.

### బద్‌లాపూర్

తనకు అన్యాయం చేసినవారు జైలుకు వెళ్లడంతో సాధారణంగా సినిమాలు ముగుస్తుంటాయి. కాని 'బద్‌లాపూర్' (2105) అలా కాదు. తన భార్య, కొడుకు చావుకు కారణమైన అందరిపై వరుణ్‌ధావన్ 'బద్‌లా' (పగ) తీర్చుకోవాలనుకుంటాడు. వాళ్లలో ఒక నిందితుడు జైలుకు వెళితే అతడు రిలీజై వచ్చే 15 ఏళ్ల వరకు ఎదురు చూస్తాడు. 15 ఏళ్ల తర్వాత అతణ్ణి పట్టుకొని, అతడితోపాటు తన వాళ్ల చావుకు కారణమైన మరో వ్యక్తిని చంపి పగ తీర్చుకునేదాకా నిద్రపోడు. దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ 16 కోట్లతో ఈ సినిమా తీస్తే 80 కోట్లు వచ్చాయి. ఈ సినిమాతో హీరోగానే కాదు నటుడిగా కూడా వరుణ్ ధావన్ ఎదిగాడు. ఇతగాడు అల్లరి చిల్లరిగా ఈ ఫీల్డ్‌లోకి రాలేదని గట్టిగా నిలబడటానికే వచ్చాడని ప్రేక్షకులు, బాలీవుడ్ ఒకేసారి అర్థం చేసుకుంది. బద్‌లాపూర్ వరుణ్ ధావన్ కెరీర్‌ని స్థిరపరిచింది.

### మంచి సినిమాల వరుస

ఒకసారి నటుడు ఎదిగాక బాలీవుడ్ ఆ ఎదిగిన స్థాయికి కథలు తయారు చేయడం మొదలుపెడుతుంది. వరుణ్ ధావన్ తాను కేవలం డిష్యూం డిష్యూం హీరోగా ఉండిపోదలుచుకోలేదని పెర్ఫార్మెన్స్ ఉన్న పాత్రలు చేయదలుచుకున్నానని సంకేతాలు ఇచ్చాక మంచి కథలతో వచ్చింది. 'బద్‌రీనాథ్ కి దుల్హనియా' (2017), 'అక్టోబర్' (2018), 'సూయి ధాగా' (2018) ఇవన్నీ వరుణ్ ధావన్‌కు గట్టి పేరు తెచ్చిపెట్టాయి. వీటితో పాటు చేసిన 'జుడ్వా', 'ఎబిసిడి 2', 'డిష్యూం' అతని కమర్షియల్ ఇమేజ్‌ను కాపాడాయి. భారీ కాస్ట్యూమ్ డ్రామా 'కళంక్' నిరాశ పరిచినా తాజాగా విడుదలైన 'స్ట్రీట్ డాన్సర్' ట్రైలర్ మరో సక్సెస్‌ను హామీ ఇచ్చేలా ఉంది. తన తండ్రి తీసిన 'కూలీ నంబర్ 1' సినిమాను వరుణ్ ధావన్ రీమేక్ చేస్తున్నాడు.

వరుణ్ ధావన్‌కు ప్రేమ వ్యవహారాలు బాగానే ఉన్నాయని బాలీవుడ్ అంటూ ఉంటుంది. ఫ్యాషన్ డిజైనర్ నటాషా దలాల్‌తో అతని ఎఫైర్ బాహాటంగా కొనసాగింది. అయితే ఆలియా భట్‌తో కూడా ప్రేమ నడుస్తోందనే గాసిప్ ఉంది. మాస్, క్లాస్ రెండూ చేయదగ్గ హీరోగా వరుణ్‌ధావన్ ఇప్పుడు భారతదేశంలో అత్యధిక పారితోషికం తీసుకునే హీరోలలో ఒకడిగా ఉన్నాడు. గత సంవత్సరం ఫోర్బ్స్ ప్రకటించిన వందమంది ఇండియా సెలబ్రిటీల లిస్ట్‌లో అతడు 15 స్థానంలో ఉన్నాడు. రాబోయే రోజులు అతనివే అనడంలో సందేహం లేదు.

**– సాక్షి ఫీచర్స్ డెస్క్**



పరిపరిశోధన

# ఆ ప్రొటీన్‌తో దీర్ఘాయుష్షు?



వయసు పెరిగే కొద్దీ మన శరీర కణాల్లో సత్తువ సన్నగిల్లుతుంది. విషతుల్యమైన పదార్థాలు ఎక్కువ అవుతూంటాయి. ఫలితంగా జబ్బులు, ఇతర ఆరోగ్య సమస్యలు. ఈ విషయం మనకందరికీ తెలుసు. కానీ శరీరంలో పెరిగిపోయే విషపదార్థాలు ఎప్పటికప్పుడు నాశనమైపోతూంటే? అబ్బో.. అద్భుతమైన ఆరోగ్యం మన సొంతం అవుతుంది. అయితే ఈ అద్భుతాన్ని సాధించడం ఎలా? స్టాన్‌ఫర్డ్ బర్న్‌హామ్ ప్రీబిస్ మెడికల్ డిస్కవరి ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఓ మార్గం కనుక్కున్నారు. మనుషుల్లో కాదుగానీ.. కొన్ని రకాల పురుగులు ఒక ప్రొటీన్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా ఎక్కువ కాలం బతుకుతున్నట్లు వీరు గుర్తించారు. పీ62 అని పిలుస్తున్న ఈ ప్రొటీన్ విషతుల్యమన కణ ప్రొటీన్లను గుర్తించి నాశనమయ్యేలా చేస్తూండటం దీనికి కారణం. కణాల్లోని చెత్త చెదారాన్ని తొలగించేందుకు ఉన్న ఆటోఫేగీ వ్యవస్థను బలోపేతం చేస్తే జీవిత కాలం పెరుగుతుందని ఇప్పటికే చాలా పరిశోధనలు రుజువు చేశాయని ఈ ప్రొటీన్ ద్వారా ఆటోఫేగీ బలోపేతమవుతోందని మెలేన్ హాన్‌సెన్ అనే శాస్త్రవేత్త తెలిపారు. నిన్నమొన్నటి వరకూ శాస్త్రవేత్తలు ఈ కణ రీసైక్లింగ్ శరీరం మొత్తమ్మీద ఒకేలా ఉంటుందని అంచనావేశారు గానీ.. పీ62 ప్రొటీన్ వాడకం మొదలుకొని కొన్ని ఇతర పద్ధతులు కూడా ఉన్నాయని తాజా పరిశోధన ద్వారా తెలిసింది. పీ62 కణాల్లోని మైటోకాండ్రియా, విషతుల్యమైన ప్రొటీన్లను రీసైకిల్ చేసేందుకు తరలిస్తాయని మెలేన్ వివరించారు. ఈ పరిశోధన ద్వారా అల్జైమర్స్ వంటి వ్యాధులకు కొత్త చికిత్స లభిస్తుందని అంచనా. పరిశోధన వివరాలు నేచర్ కమ్యూనికేషన్స్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

# కేన్సర్ కణాలను కాపాడే మైటోకాండ్రియా?



ప్రాణాంతక కేన్సర్ వ్యాధికి అందుబాటులో ఉన్న చికిత్సల్లో కీమోథెరపీ ఒకటి. అయితే ఇది అందరిపై ఒకేలా ప్రభావం చూపదు. దీనికి కారణమేమిటా? అని సాల్క్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు కొన్ని పరిశోధనలు చేయగా ఆశ్చర్యకరమైన ఫలితాలు కనిపించాయి. కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసే మైటోకాండ్రియా కీమోథెరపీ ప్రభావం నుంచి కణాలను రక్షిస్తున్నట్లు ఈ పరిశోధనల ద్వారా తెలిసింది. కణాలు ఒత్తిడికి గురైనప్పుడు, వైరస్, బ్యాక్టీరియాల దాడికి లేదా రసాయనాల దాడికి గురైనప్పుడు మైటోకాండ్రియా స్పందిస్తుందని, ఎంటీడీఎన్‌ఏ పోగులను విడుదల చేసి రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపిస్తుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త షాడెల్ తెలిపారు. ఆ వెంటనే కొన్ని జన్యువులు రంగంలోకి దిగుతాయని కణ కేంద్రకం లోపల ఉన్న డీఎన్‌ఏకు రక్షణగా నిలుస్తాయని వివరించారు. దురదష్టవశాత్తూ ఈ ప్రక్రియ కేన్సర్ కణాలకూ వర్తిస్తూండటంతో కీమోథెరపీ పనిచేయకుండా పోతోందని చెప్పారు. ఎలుకలపై తాము జరిపిన ప్రయోగాల్లోనూ ఈ విషయం రుజువైందని అన్నారు. కీమో చికిత్స సమయంలో మైటోకాండ్రియల్ డీఎన్‌ఏ విడుదలను అడ్డుకుంటే చికిత్స సామర్థ్యాన్ని పెంచేందుకు అవకాశముంటుందని షాడెల్ వివరించారు.

రుమటాలజీ కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

# ఇంత చిన్న వయసులోనూ కీళ్లవాతాలా?

**మా పొరిగింటివాళ్ల అబ్బాయి వయసు 14 ఏళ్లు. అతడికి కీళ్లవాతం వచ్చిందని డాక్టర్ చెప్పారు. దాంతో మేము ఎంతో ఆశ్చర్యపోయాం. ఇంత చిన్న పిల్లలకు కూడా ఆర్థరైటిస్ వస్తుందా?**

**– సుహాసిని, కొత్తగూడెం**

కీళ్లవాతం లేదా ఆర్థరైటిస్ అనేవి కేవలం పెద్దవాళ్లకే వస్తాయనే అపోహ చాలామందిలో ఉంటుంది. పిల్లలు కూడా చిన్న వయసులోనే లూపస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఏంకైలోజింగ్ స్పాండలైటిస్, వాస్క్యులైటిస్ వంటి అనేక రకాల కీళ్లవాతాల బారిన పడవచ్చు. వీటన్నింటిలోకీ జువెనైల్ ఇడియోపథిక్ ఆర్థరైటిస్ అనే రకం చాలా సాధారణంగా కనిపిస్తుంటుంది. ఇవన్నీ దీర్ఘకాలిక వ్యాధులు.

**ఎందుకొస్తాయంటే:** ఈ జబ్బులు ఎందుకు వస్తాయనే కారణాలు పెద్దగా తెలియదు. అనేక పరిశోధనల తర్వాత జన్యులోపాలే వీటికి ప్రధాన కారణాలని శాస్త్రవేత్తలు నిర్ధారణ చేశారు. జన్యులోపం ఉన్నప్పుడు బయటి వాతావరణంలోని క్రిములు, కాలుష్యం వంటి అంశాలు వ్యాధిని తేలిగ్గా ప్రేరేపించగలవు. ఫలితంగా మన శరీరంలోని వ్యాధి నిరోధక శక్తి సొంత కణాలనే పరాయివిగా భావించి వాటిపై దాడికి దిగుతాయి. ఈ దాడి ఫలితంగా కీళ్లు, కండరాలు మాత్రమేగాక ఇంకా చాలా అవయవాలు ప్రభావితమవుతాయి. అందుకే దీన్ని ఆటోఇమ్యూన్ డిసీజ్ అంటారు.



**లక్షణాలు:** వ్యాధి లక్షణాలు పిల్లలందరిలో ఒకేలా ఉండవు. ఒక్కొక్కరిలో ఒక్కోలా కనిపించడమే కాకుండా తరచూ మారుతుంటాయి. ఎక్కువగా కీళ్ల మీద ప్రభావం చూపినప్పటికీ, ఊపిరితిత్తులు, కళ్లు, చర్మం, కాలేయం, మూత్రపిండాలు, గుండె వంటి అవయవాలపైన కూడా ఈ వ్యాధి ప్రభావం పడుతుంది.

పెద్దవారిలో కనిపించే కీళ్లవాతానికీ, పిల్లల్లో కనిపించే దానికి చాలా తేడాలుంటాయి. పిల్లల్లో అభివృద్ధి చెందే ఎముకలపైన ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల పిల్లల్లో పెరుగుదల ఆగిపోతుంది. కళ్ల మీద కూడా ప్రభావం పడి, చూపు పోయే ప్రమాదం కూడా ఉంటుంది.

ఈ కీళ్లవాతపు వ్యాధులు సాధారణ చికిత్సా విధానాలకు లొంగవు. పిల్లలు పెరుగుతున్న కొద్దీ లక్షణాల తీవ్రత పెరగడం, మందుల దుష్ప్రభావాలు కలగడం, జీవితకాలపు వైకల్యం వంటి ప్రమాదాలనూ ఎదుర్కొంటారు. కొన్నిసార్లు జబ్బు తీవ్రత అకస్మాత్తుగా ఏ కారణమూ లేకుండానే పెరిగిపోతుంది. మరికొన్నిసార్లు ఎలాంటి తీవ్రతా కనిపించదు. అలాగే మానసిక ఆరోగ్యంపై కూడా ఈ వ్యాధుల ప్రభావం ఉంటుంది. ఆందోళన, డిప్రెషన్, ఆత్మహత్యాప్రయత్నాల వంటి పరిణామాలకు దారితీస్తాయి. అందువల్ల కుటుంబసభ్యుల మీద కూడా ఒత్తిడి ఉంటుంది. విద్యా, వృత్తిపరమైన ఇబ్బందుల కారణంగా రోగులు సామాజికంగా ఇక్కట్లు ఎదుర్కొంటారు.

**చికిత్సలు:** గతంలో అరుదుగా కనిపించే ఈ రకం జబ్బుల్ని ఇటీవల తరచూ చూడటం జరుగుతోంది. చికిత్సావిధానాలు కీళ్లవాతం రకాన్ని బట్టి ఉంటాయి. కొంతమందికి చిన్న నొప్పి నివారణ మందులతోనే నయమవుతుంది. మరికొందరిలో స్టెరాయిడ్స్ అవసరమవుతాయి. వాటికీ లొంగని వ్యాధులకూ, ప్రాణాంతకమైన రకాలకు డిసీజ్ మాడిఫైడ్ యాంటీ రుమాటిక్ డ్రగ్స్ (డీమార్డ్స్) అనే తరహా మందులు వాడాల్సి ఉంటుంది. వీటిని నివారించలేనప్పటికీ, సరైన సమయంలో వైద్య చికిత్స తీసుకుంటే శాశ్వతంగా ఉపశమనం పొందవచ్చు.

**జాగ్రత్తలు:** ● ఈ జబ్బు లక్షణాలను పసిగట్టినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రుమటాలజిస్ట్‌ను కలవాలి. వ్యాధి నిర్ధారణ జరిగాక, దాని తీవ్రతను బట్టి మందులు సూచిస్తారు. ● రుమటాలజిస్ట్ పర్యవేక్షణలో మాత్రమే ఈ మందులు వాడాలి ● కంటిపైనా, ఇతర అవయవాలపై ఈ వ్యాధి ప్రభావం పడిందో లేదో తెలుసుకునేందుకు తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి ● సరైన పోషణ, క్యాల్షియమ్, విటమిన్-డి సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. అయితే చాలామందికి ఆహారం ద్వారా కావలసిన క్యాల్షియమ్ లభించదు. అలాంటి వారికి క్యాల్షియమ్ సప్లిమెంట్స్ ఇవ్వాల్సి ఉంటుంది ● కీళ్లవాతం వల్ల ఎముకలు, కండరాలు బలాన్ని కోల్పోతాయి. సరైన వ్యాయామం వల్ల ఇవి బలంగా తయారవుతాయి. కాబట్టి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల వైకల్యాన్ని నివారించవచ్చు.

ఈ చిన్న చిన్న జాగ్రత్తలతో, రుమటాలజిస్టుల సలహా మేరకు సరైన మందులు వాడటం వల్ల ఈ రోగులు నార్మల్ జీవితాన్నే గడపవచ్చు.



**డాక్టర్ విజయ ప్రసన్న పరిమి**
సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్,
సిటీ న్యూరో సెంటర్, రోడ్ నెం. 12,
బంజారాహిల్స్, హైదరాబాద్.

**మానవ సేవ కూడా ఒక ఆధ్యాత్మిక సాధనే. సాటి మానవునికి చేతనైన సేవ చేయడం దివ్యత్వానికి చేరువ కావడమే. గుంటూరులోని శారదా పీఠం చేస్తున్న సేవ చాలామంది జీవితాల్లో వెలుగులు నింపుతోంది. వారిలో సంచారజాతి బాలలు ఉన్నారు. నిమ్నవర్గాల స్త్రీలు ఉన్నారు. విద్య, వృత్తివిద్య అందిస్తూ ఇక్కడ సాగుతున్న సేవ ప్రశంసనీయమైనది.**



● శారదా మఠంలో కుట్టు శిక్షణ పొందుతున్న యువతులు



ప్రపంచంలో ఎవరూ పరాయివారు కారు. అందరు నీవారే అన్న దివ్యజనని శ్రీ శారదాదే బోధనల స్ఫూర్తితో మఠాన్ని నిర్వహిస్తున్నాము. ఈ భావం అందరిలో వ్యాప్తి కావాలన్నదేమా ఆకాంక్ష. ఇందుకోసం అంకితభావంతో పని చేస్తున్నాము.

**– భవాని ప్రాణ మాతాజీ,** మఠ కార్యదర్శి

# పిడికెడు మెతుకులు... గుప్పెడు అక్షరాలు

గుంటూరు నగరం పాలెంలోని విశాలమైన జిల్లాపరిషత్ ప్రాంగణంలో ప్రశాంతంగా కనిపించే 'శారదాపీఠం'లో సాగుతున్న మానవసేవ ప్రశంసనీయమైనది. సంచారజాతుల పిల్లలను చేరదీసి, వారికి విద్యాబుద్ధులు చెప్పడం ఒక పని. పేదబాలికలకు స్కూల్ నడపడం మరో పని. పేద వర్గాల మహిళలకు, యువతులకు స్వయంసమృద్ధి కోసం వృత్తి విద్యలు నేర్పడం మరో పని. ఇన్ని పనులు శారదా మఠం కార్యదర్శి భవానీ ప్రాణ మాతాజీ ఆధ్వర్యంలో దాదాపు 15 ఇరవై మంది మాతాజీలు క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో, అంకితభావంతో, ఆధ్యాత్మికసేవగా ఎంచి చేస్తున్నారు.

### శ్రీశారదామఠం అంటే?

సంపూర్ణ సాధికార ఆధ్యాత్మిక సంస్థ ఒకటి స్త్రీలకు స్థాపించాలి అన్న స్వామి వివేకానంద స్వప్నానికి రూపమే శ్రీ శారదామఠం. కలకత్తాలోని దక్షిణేశ్వరం ముఖ్యకేంద్రంగా దేశ విదేశాల్లో 40 ఉపసంస్థలతో జాతి, కులమతాలకు అతీతంగా ఈ మఠం సేవలందిస్తోంది. శ్రీరామకృష్ణ పరమహంస ధర్మపత్ని శారదామాత జయంతి సందర్భంగా 1954లో దక్షిణేశ్వరంలో స్థాపించబడిన ఈ సంస్థ బాలిక, యువతి, స్త్రీ అభ్యున్నతికి విశేష సేవలందిస్తున్నది. రెండు తెలుగు రాష్ట్రాలలో కేవలం గుంటూరులోనే శ్రీశారదామఠం ఉంది. 2001లో నెలకొల్పిన ఈ మఠం గత పద్దెనిమిదేళ్లుగా విజయవంతంగా పని చేస్తోంది.

### శ్రీరామకృష్ణ శారదా విద్యాలయం

ఈ మఠం ఆధ్వర్యంలో నడుస్తున్న స్కూల్ ఇది. విశాలమైన ప్రాంగణంలో 350 మంది పేద, మధ్యతరగతి విద్యార్థినులకు విలువలతో కూడిన విద్య అందిస్తున్నారు. వీరిలో 150 మంది విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు, భోజన వసతితో సహా ఉచిత విద్యను అందిస్తున్నారు. మిగిలిన వారివద్ద నామమాత్రపు ఫీజులే వసూలు చేస్తున్నారు. పాఠశాలను పూర్తిస్థాయి ఉచిత విద్యా కేంద్రంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

### వివేకా విహార్

ఇది వీధి బాలల కోసం, సంచార తెగల బాలల కోసం ప్రత్యేకంగా నిర్వహించే స్కూల్. గతంలో మఠ ప్రాంగణం చుట్టుపక్కల సంచార కుటుంబాలు చెట్ల కింద నివసించేవారు. తోలుబొమ్మలాట కళాకారులైన వీరు అనంతర కాలంలో ఆ కళకు ఆదరణ తగ్గడంతో ఆర్థికంగా, సామాజికంగా వెనుకపడ్డారు. యాచకవృత్తి, చెత్త సేకరించి విక్రయించుకోవడం తదితర పనులు చేస్తూ జీవనం సాగించేవారు. వారి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడానికి మఠంలోని మాతాజీలు ఎంత ప్రయత్నించినా వారి తల్లిదండ్రులు సహకరించలేదు. చివరకు పెద్దలకు నచ్చచెప్పి వారి పిల్లలకు మఠంలో వివేకా విహార్ అనియత విద్యా కేంద్రం ప్రారంభించారు. వివిధ వయస్సుల్లో ఉన్న 30 మంది పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు వారికి చదువుతోపాటు వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇచ్చారు. మఠంలోని పిల్లలు 5వ తరగతి పూర్తి చేసిన అనంతరం ఉన్నత చదువులకోసం విజయవాడ, గుంటూరులోని పలు కార్పోరేట్ పాఠశాలలను సంప్రదించి అక్కడ ఉచితంగా విద్య అభ్యసించేలా చేర్పించారు. ఇది కాకుండా 'శిశు వికాస్' పేరుతో పాఠశాల అనంతరం పేద విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్, యోగాసనాలు, సంగీతం, నృత్యంలో శిక్షణ ఇవ్వడంతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు.

### నివేదిత వృత్తి విద్యా కేంద్రం

మహిళలలో ఆర్థికస్వాలంబన తీసుకువచ్చి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే ధ్యేయంగా వృత్తివిద్యాకేంద్రం పనిచేస్తోంది. ఈ కేంద్రం ద్వారా రోజుకు 200 మంది మహిళలు, యువతులకు ఎంబ్రాయిడరి, రంగుల అద్దకం, బ్యాగుల తయారి, కంప్యూటర్‌లలో బ్యాచ్‌ల వారీగా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. పేదమహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లు అందించడంతోపాటు శిక్షణ పూర్తయిన వారికి పలు సంస్థలను సంప్రదించి ఉద్యోగాల కల్పనలోనూ కీలకపాత్ర పోషిస్తున్నది శారదా మఠం. ఇక ప్రతిరోజూ మఠంలోని మందిరంలో పూజలు, భజనలు, ధ్యానం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఆదివారాల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రవచనాలు మఠకార్యక్రమాల్లో ఒక భాగం.



తోలుబొమ్మలాట కళాకారుల కుటుంబానికి చెందిన మేము ఆ కళకు ఆదరణ లేకపోవడంతో సోఫాలు రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నాము. మఠ మాతాజీ 6 సంవత్సరాల క్రితం మా ఊరు వచ్చి మా పిల్లలకు చదువు చెప్పించమని చెప్పడంతో మా ఇద్దరు పిల్లల్ని ఈ పాఠశాలలో చేర్చాము. నెలకు ఒకసారి పాఠశాలకు వచ్చి పిల్లల్ని చూసుకుని వెళతాము. ఈ పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన మా అబ్బాయిని విజయవాడలోని హీల్ సంస్థలో పై చదువులు చదివిస్తున్నాం. మా పిల్లల భవిష్యత్తుకు మంచి మార్గం చూపిన మాతాజీలకు జీవితాంతం రుణపడి ఉంటాం.

**– వనపర్తి బాలాజి, మీనాక్షి దంపతులు,**
నరసరావుపేట మండలం, ఎక్కల వారిపాలెం

2008 సంవత్సరంలో మఠంలో కుట్టు, ఎంబ్రాయిడరి, బ్యాగులు తయారి శిక్షణ పొందాను. కొన్ని సంవత్సరాలుగా నేను ఇంటి వద్ద మరో ముగ్గురు మహిళలకు ఉపాధి కల్పిస్తూ షాపు నిర్వహిస్తున్నాను. గతంలో కూలి పనులకు వెళ్ళే నేను, నా భర్త ఈ ఆదాయం కారణంగా పిల్లలు ఇద్దర్ని మంచి కళాశాలలో ఉన్నత చదువులు చదివిస్తున్నాం.

**– టి.పరమగీత,**
గుంటూరు రూరల్ మండలం, దాసరిపాలెం

**– కోలుకొండ శ్రీకర్,** సాక్షి, గుంటూరు ఈస్ట్
ఫోటోలు: మిరియాల వీరాంజనేయులు

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం
21-12-2019

# జాన్ నుంచి జాన్



● ప్రభాస్

'సాహో' రిలీజ్ తర్వాత బ్రేక్‌లో ఉన్నారు ప్రభాస్. జనవరి నుంచి మళ్లీ షూటింగ్‌లో జాయిన్ అవుతున్నారని తెలిసింది. ప్రభాస్, పూజా హెగ్డే జంటగా రాధాకృష్ణ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'జాన్' (వర్కింగ్ టైటిల్). యూవీ క్రియేషన్స్, గోపీకృష్ణ మూవీస్ బ్యానర్లపై కృష్ణంరాజు, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. పీరియాడిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇటలీ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. 'సాహో' చిత్రీకరణ సమయంలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించారు. 'సాహో' రిలీజ్ అప్పుడు ఈ సినిమా చిత్రీకరణకు చిన్న బ్రేక్ ఇచ్చారు. ఇప్పుడు ఈ సినిమా షూటింగ్ సంక్రాంతి పండగ తర్వాత తిరిగి ప్రారంభం కానుందని తెలిసింది. సో.. జాన్ (జనవరి) నుంచి 'జాన్'తో ప్రభాస్ బిజీగా ఉంటారు. ఈ సినిమాకు సంబంధించిన ఆరు సెట్లను హైదరాబాద్‌లో నిర్మిస్తున్నారు. ఇందులో ప్రభాస్ పురాతన వాహనాల దొంగ పాత్రలో కనిపిస్తారని సమాచారం. వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమాకు అమితి త్రివేది సంగీత దర్శకుడు.



● కాజల్ అగర్వాల్

## మాల్దీవుల్లో మజా

హిందీ, తెలుగు, తమిళ సినిమాలతో బిజీ బిజీగా ఉన్నారు కాజల్ అగర్వాల్. ఖాళీ లేని కాల్షీట్లు. షూటింగ్స్ కోసం జర్నీల నుంచి చిన్న హాలిడే తీసుకున్నారామె. ఈ లీవ్‌లో మాల్దీవుల్లో ఫ్యామిలీతో కలసి చిన్న వెకేషన్‌కు వెళ్లారు. సరదాగా ఫ్యామిలీతో టైమ్ స్పెండ్ చేస్తున్నారు. ''ఈ హాలిడే కోసం చాలా రోజులుగా ఎదురు చూస్తున్నాను. ప్రశాంతంగా గడపడానికి మాల్దీవులకు మించిన హాలిడే స్పాట్ ఏముంటుంది?'' అని హాలిడేయింగ్ చేస్తున్న ఫొటోలను తన ఇన్‌స్ట్రాగామ్ ఖాతాలో పంచుకున్నారు కాజల్ అగర్వాల్.

## అతిథి

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు ఈవెంట్‌కు మెగాస్టార్ చిరంజీవి అతిథిగా రాబోతున్నారు. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. ఇందులో రష్మికా మందన్నా కథానాయికగా నటించారు. 'దిల్' రాజు, అనిల్ సుంకర, మహేశ్‌బాబు నిర్మించారు. జనవరి 5న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న ఈ చిత్రం ప్రీ–రిలీజ్ వేడుకకు చిరంజీవి అతిథిగా రాబోతున్నారు. 'మా ఆహ్వానాన్ని మన్నించి అతిథిగా వచ్చేందుకు అంగీకరించిన చిరంజీవిగారికి ధన్యవాదాలు' అని మహేశ్‌బాబు పేర్కొన్నారు. 'సరిలేరు నీకెవ్వరు' చిత్రం జనవరి 11న విడుదల కానుంది.



● మహేశ్‌బాబు, చిరంజీవి

# నితిన్ పవర్‌పేట



● నితిన్

నితిన్ హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాకు 'పవర్‌పేట' అనే టైటిల్ ఖరారైంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించనుంది. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం అవుతుంది. గత ఏడాది నితిన్ – కృష్ణచైతన్య కాంబినేషన్‌లో 'ఛల్ మోహన్ రంగ' అనే సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. నితిన్ హీరోగా నటించిన ఇష్క్ (2012), 'గుండెజారి గల్లంతయ్యిందే' (2013), 'అ ఆ' సినిమాలకు కృష్ణచైతన్య పాటలు రాశారు. మరోవైపు ప్రస్తుతం ఇటలీలో జరుగుతున్న 'భీష్మ' చిత్రీకరణలో పాల్గొంటున్నారు నితిన్. అలాగే దర్శకుడు చంద్రశేఖర్ ఏలేటి తెరకెక్కిస్తున్న 'చదరంగం', వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న 'రంగ్ దే' చిత్రాలతో నితిన్ వచ్చే ఏడాది వేసవి వరకు ఫుల్ బిజీ.



● హెబ్బా పటేల్

# వెబ్ సిరీస్‌లో హెబ్బా

డిజిటల్ మీడియమ్‌లో షోలు, సిరీస్‌లకు ఆదరణ విపరీతంగా పెరుగుతోంది. ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేయడానికి స్టార్స్ కూడా వెబ్ వరల్డ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. తాజాగా హెబ్బా పటేల్ కూడా ఓ వెబ్ సిరీస్‌లో కనిపించనున్నారు. నవదీప్, హెబ్బా పటేల్ ముఖ్య పాత్రల్లో దర్శకుడు అజయ్ భూయాన్ ఓ వెబ్ సిరీస్ తెరకెక్కిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ షూటింగ్ ఇటీవల ప్రారంభం అయింది. ఈ వెబ్ సిరీస్ జానర్, మిగతా నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం నితిన్ 'భీష్మ', రాజ్ తరుణ్ 'ఒరేయ్ బుజ్జిగా' సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు హెబ్బా పటేల్.

# ఈ సినిమాతో హ్యాట్రిక్ షురూ

– 'దిల్' రాజు



● జి.ఆర్. కృష్ణ, రాజ్‌తరుణ్, 'దిల్' రాజు, అబ్బూరి రవి

''లైఫ్ ప్రతివాడికి ఒక మూమెంట్ ఎక్స్‌పెక్ట్ చేయని సర్‌ప్రైజ్ ఇస్తుందట.. 'ఇద్దరిలోకం ఒకటే' ట్రైలర్‌లోని డైలాగ్ ఇది. రాజ్ తరుణ్, షాలిని పాండే జంటగా 'దిల్' రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. జి.ఆర్ కృష్ణ దర్శకత్వం వహించారు. ఈ నెల 25న విడుదల కానున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ మధ్యకాలంలో నేను నా జర్నీల్లో ఈ సినిమాలోని పాటలనే వింటున్నాను. మిక్కీ జె.మేయర్ అద్భుతమైన మెలోడీలు ఇచ్చారు. అబ్బూరి రవితో నేను 'బొమ్మరిల్లు' చిత్రం నుండి జర్నీ చేస్తున్నాను. ఈ చిత్రానికి కూడా మంచి డైలాగ్‌లు అందించారు. ఈ ఏడాది మా బేనర్‌లో 'ఎఫ్–2', 'మహర్షి' చిత్రాలతో బ్లాక్‌బస్టర్స్ కొట్టాం. 'ఇద్దరిలోకం ఒకటే'తో హ్యాట్రిక్ సాధిస్తాం'' అన్నారు. ''చివరి 30 నిమిషాల సినిమాను ప్రేక్షకులు మరచిపోలేరు. హృదయాలతో చూసే ప్యూర్ లవ్‌స్టోరీ ఇది'' అన్నారు అబ్బూరి రవి. ''హృదయాలను కదిలించే ఫీల్‌గుడ్ మూవీ ఇది'' అన్నారు రాజ్‌తరుణ్. ''అభినందన', నీరాజనం' చిత్రాలను ఈ సినిమా గుర్తు చేస్తుంది'' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్.

# కొత్త ఏడాది బ్యూటిఫుల్



● నైనా

దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ టైగర్ కంపెనీ ప్రొడక్షన్ పతాకంపై రూపొందించిన చిత్రం 'బ్యూటిఫుల్'. 'ట్రిబ్యూట్ టు రంగీలా' అన్నది ఉపశీర్షిక. సూరి, నైనా జంటగా అగస్త్య మంజు దర్శకత్వంలో తెరకెక్కింది. టి.అంజయ్య సమర్పణలో టి. నరేష్ కుమార్, టి.శ్రీధర్ నిర్మించిన ఈ సినిమా జనవరి 1న విడుదల కానుంది. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''రొమాంటిక్ ప్రేమ కథాంశంతో వైవిధ్యభరితంగా రూపొందిన చిత్రమిది. సూరి, నైనాల అభినయం మనసులను హత్తుకుంటుంది. యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి శంకర్, సహ నిర్మాతలు: నట్టి క్రాంతి, నట్టి కరుణ, రచన, కెమెరా, దర్శకత్వం: అగస్త్య మంజు.

# నేరస్తులు తప్పించుకోలేరు



● స్నేహా గుప్తా

శివ కంఠమనేని హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'రాఘవరెడ్డి'. 'క్రిమినల్స్ కాంట్ ఎస్కేప్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో నందితా శ్వేతా కథానాయిక. రాశీ, అజయ్‌ఘోష్, అజయ్, రఘుబాబు, పోసాని కృష్ణమురళి కీలక పాత్రధారులు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో జి. రాబాంబు యాదవ్, ఆర్. వెంకటేశ్వరరావు, కేఎస్ శంకర్‌రావు నిర్మిస్తున్నారు. 'ఆ... చదివిందే నే టెన్త్ రో.. అయ్యిందే డాక్టర్..' అనే ప్రత్యేక పాటను చిత్రీకరిస్తున్నారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీలో స్నేహా గుప్తా ఈ పాటకు డ్యాన్స్ చేస్తున్నారు. సంజీవ్ మాట్లాడుతూ– ''తెలుగులో 'అఘోరా, పౌరుషం' చిత్రాలు చేశా. తర్వాత కన్నడంలో కొన్ని సినిమాలు తీశాను. తెలుగులో ఇది నాకు మంచి కమ్‌బ్యాక్ అవుతుందనుకుంటున్నా. క్రిమినాలజీలో నేరపరిశోధన చేసే పాత్రలో హీరో శివ బాగా నటిస్తున్నారు'' అన్నారు. ''కథని నమ్మి ఈ సినిమా తీస్తున్నాం. మా సినిమా నిర్మాణ సారథిగా ఉన్న గంటా శ్రీనివాసరావుగారికి థ్యాంక్స్'' అన్నారు శివ. ''చిత్రీకరణ దాదాపు పూర్తయింది'' అన్నారు రాంబాబు యాదవ్. ఈ చిత్రానికి యశస్విని, సుధాకర్ స్వరకర్తలు.












సాక్షి స్పోర్ట్స్
శనివారం
21-12-2019

## రూ. 89 వేల 629 కోట్లు!

టోక్యోలో జరిగే 2020 ఒలింపిక్స్ తుది బడ్జెట్‌ను నిర్వాహక కమిటీ ప్రకటించింది. ఈ మెగా ఈవెంట్ కోసం 12.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 89 వేల 629 కోట్లు) ఖర్చు చేయబోతున్నట్లు వెల్లడించింది. వేడిని తట్టుకునేందుకు ఇటీవల కొన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి రావడంతో ఖర్చు కొంత పెరిగిందని కూడా జపాన్ పేర్కొంది. ఒలింపిక్స్ కమిటీ బడ్జెట్ ఖర్చును నిర్వాహక కమిటీ, టోక్యో మెట్రోపాలిటన్, కేంద్ర ప్రభుత్వం సమంగా భరిస్తాయి. జూలై 24నుంచి ఆగస్టు 9 వరకు ఒలింపిక్స్ క్రీడలు జరుగుతాయి.



అండర్-19 ప్రపంచ కప్‌లో పాల్గొనేందుకు గురువారం దక్షిణాఫ్రికాకు బయల్దేరిన భారత యువ జట్టు. మెగా టోర్నీకి ముందు కుర్ర టీమ్ దక్షిణాఫ్రికాతో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌తో పాటు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, జింబాబ్వేలతో తలపడే నాలుగు దేశాల వన్డే టోర్నీ కూడా ఆడుతుంది.

# త్వరలోనే కొత్త సీఏసీ: గంగూలీ



**కోల్‌కతా:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ)ని భర్తీ చేసే పనిలో నిమగ్న మయ్యాడు. భారత జట్టును ఎంపిక చేసే సెలక్షన్ కమిటీని ఎంపిక చేయడమే ప్రస్తుతం సీఏసీ పని. 'త్వరలోనే సీఏసీ సభ్యుల్ని నియమిస్తాం. ఇప్పటికే టీమిండియా హెడ్ కోచ్ ఎంపిక పూర్తి కావడంతో కొత్త కమిటీ సెలక్టర్లను మాత్రమే ఎంపిక చేస్తుంది' అని అన్నాడు. ఇప్పటి వరకు పనిచేసిన సీఏసీ సభ్యులందరూ పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశంతో ముడిపడి పదవుల్ని వదులుకున్నారు. దిగ్గజ బ్యాటింగ్ త్రయం సచిన్, వీవీఎస్ లక్ష్మణ్, గంగూలీలతో కూడిన తొలి కమిటీ, ఆల్‌రౌండ్ దిగ్గజం కపిల్‌దేవ్ నేతృత్వంలోని రెండో కమిటీ విరుద్ధ ప్రయోజనాలతోనే తమ పదవులకు రాజీనామా చేశారు. ఐపీఎల్ వేలంపాటపై స్పందిస్తూ 'ఆస్ట్రేలియా పేసర్ కమిన్స్ (రూ.15.5 కోట్లు)కు చాలా ఎక్కువ మొత్తం లభించిందనడం సరికాదు. ఎక్కడైనా డిమాండ్ బట్టే ధర ఉంటుంది. బెన్ స్టోక్స్ ఇది వరకే రూ.14.50 కోట్లు పలికాడు. కమిన్స్ ఇప్పుడు అతన్ని మించాడు అంతే' అని గంగూలీ పేర్కొన్నాడు.

### శాంత రంగస్వామి వంతు!

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఎథిక్స్ ఆఫీసర్ డి.కె.జైన్ నుంచి నోటీసులు అందుకునే వంతు తాజాగా శాంత రంగస్వామికి వచ్చింది. భారత మహిళల జట్టు మాజీ సారథి అయిన ఆమె కపిల్‌దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) సభ్యురాలిగా వ్యవహరించారు. ఈ కమిటీ భారత హెడ్ కోచ్‌గా రవిశాస్త్రిని కొనసాగించింది. అనంతరం పరస్పర విరుద్ధ ప్రయోజనాల సెగతో కపిల్, అన్షుమన్ గైక్వాడ్, శాంత రంగస్వామిలు తమ పదవులకు రాజీనామా చేశారు. ఇదివరకే కపిల్, గైక్వాడ్‌లు ఈ నెల 27, 28 తేదీల్లో ముంబైలో జరిగే విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసిన డి.కె.జైన్ ఇపుడు ఆమెకు కూడా 28న జరిగే విచారణకు స్వయంగా హాజరు కావాలని నోటీసులు పంపారు.

# అలా కుదరదు బుమ్రా..!

## పేసర్ ఫిట్‌నెస్ టెస్టుకు 'ఎన్‌సీఏ' నో ● గంగూలీ జోక్యం



బుమ్రా 'సొంత' ఉత్సాహంపై జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) నీళ్లుచల్లింది. తనకు తానుగా చేసుకున్న పునరావాసంపై ఫిట్‌నెస్ టెస్టు నిర్వహించలేమని సూటిగా, సున్నితంగా చెప్పింది. తద్వారా ఎంతటి స్టార్ క్రికెటర్ అయినా ఎన్‌సీఏనే పెద్దదిక్కని చెప్పకనే చెప్పింది.

**ముంబై:** భారత స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రాకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) షాక్ ఇచ్చింది. స్టార్ పేసర్‌కు ఫిట్‌నెస్ టెస్టు నిర్వహించలేమని సుతిమెత్తగా చెప్పింది. వెన్ను గాయం నుంచి కోలుకున్న అతను పునరాగమనం చేయాలంటే ఎన్‌సీఏలో ఫిట్‌నెస్ టెస్టు పాస్ కావాల్సిందే. ఈ టెస్టు రిపోర్టు ఆధారంగానే సీనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక ప్రక్రియపై నిర్ణయం తీసుకుంటుంది. గాయం నుంచి కోలుకునేందుకు బుమ్రా అకాడమీని కాదని, తన పునరావాసాన్ని తను చూసుకోవడం తగదని... అతనెలా పురోగతి సాధించాడో తెలియకుండా, క్రమం తప్పకుండా సమీక్షించకుండా... ఉన్నపళంగా ఫిట్‌నెస్ టెస్టు నిర్వహించడం కుదరదని రాహుల్ ద్రవిడ్ డైరెక్టర్‌గా ఉన్న ఎన్‌సీఏ సున్నితంగా ఆ పేసర్‌కు చెప్పేసింది. ఇక బరిలోకి దిగడమే తరువాయి అనుకుని, ఇటీవల విశాఖపట్నంలో భారత జట్టు సభ్యులతో కలిసి నెట్స్‌లో పాల్గొన్న బుమ్రాకిది ఊహించని పరిణామమే! నిజానికి బుమ్రాకు ఫిట్‌నెస్ పరీక్ష పెట్టేందుకు ఎన్‌సీఏ టీమిండియా ట్రెయినర్ నిక్ వెబ్‌ను బెంగళూరుకు పిలవాలనుకుంది. కానీ ఎక్కడైనా... ఎప్పుడైనా వ్యవస్థలో ఓ పద్ధతిని అనుసరించే ద్రవిడ్ బుమ్రా 'సొంత' తెలివితేటలపై గుర్రుగా ఉన్నాడు. అంతా బాగయ్యాక ఇక ఇక్కడెందుకు పరీక్షని భావించాడు. పేసర్‌కు టెస్టు నిర్వహించడం లేదని టీమిండియా అసిస్టెంట్ ట్రెయినర్ యోగేశ్ పర్మార్‌కు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీనిపై ద్రవిడ్ స్పందన తెలుసుకునేందుకు మీడియా ప్రయత్నించగా అతను అందుబాటులోకి రాలేదు. ఇటు బుమ్రా వివరణ కోరేందుకు వెళ్లినా ఫలితం లేకపోయింది.



ద్రవిడ్

### అసలేం చేయాలి...

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కాంట్రాక్టు ప్లేయర్ ఎవరైనా గాయపడితే ఎన్‌సీఏ పునరావాస శిబిరంలో పాల్గొనాల్సిందే. ఇక్కడ అకాడమీ డైరెక్టర్ నేతృత్వంలో అనుభవజ్ఞులైన ఫిజియో బృందం, వైద్య సిబ్బంది గాయపడిన ఆటగాడిని ఓ క్రమపద్ధతిలో బాగుచేస్తుంది. గాయాలకు గల కారణాలను విశ్లేషిస్తుంది. దీనివల్ల ఆ క్రికెటర్ మళ్లీ గాయపడకుండా ఎన్‌సీఏ బృందం సమష్టిగా చర్యలు తీసుకునే వీలుంటుంది. అంటే ఇక్కడ ఆ క్రికెటర్ కెరీర్ చాలా కాలం కొనసాగేందుకు అవసరమైన సూచనలు ఇస్తుంది.

### అతనేం చేశాడు...

కానీ బుమ్రా గాయం నుంచి ఇప్పుడు బాగయ్యేదాకా అంతా సొంత టీమ్ సహకారంతోనే కోలుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో తానొక బోర్డు కాంట్రాక్టు ఆటగాడినన్న సంగతే మరిచాడు. పూర్తిగా ఐపీఎల్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ చెప్పినట్లు నడుచుకున్నాడు. వారు చెప్పినట్లుగా ఢిల్లీ క్యాపిటల్ ట్రెయినర్ రజనీకాంత్ శివజ్ఞానం ఆధ్వర్యంలో ముంబైలో శిక్షణ తీసుకున్నాడు. ఎన్‌సీఏ వర్గాలను సంప్రదించడం గానీ, సూచనలు పాటించడంగానీ ఎప్పుడూ చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్‌సీఏ చివరాఖరికి ఓ ఫిట్‌నెస్ టెస్టు పెట్టి పాస్ మార్కులు వేస్తే, మళ్లీ అతని గాయం తిరగబెట్టినపుడు అప్పుడంతా ఎన్‌సీఏను, పునరావాస శిబిరం తీరుపై తప్పుబడతారనేది ద్రవిడ్ అభిప్రాయం.

### గాయాలకు 'ఎన్‌సీఏ' చికిత్స తప్పనిసరి: దాదా

'అసలు ఏం జరిగిందో ద్రవిడ్‌ను అడిగి తెలుసుకుంటాను. సమస్య ఎక్కడ మొదలైందో తెలుసుకొని పరిష్కరిస్తా. నేను బోర్డు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక ద్రవిడ్‌తో ఎన్‌సీఏ విషయమై భేటీ అయ్యాను. కుర్రాళ్లను తీర్చిదిద్దే అంశంలో అకాడమీలో అతని పరిధిని కూడా పెంచాను. అయితే గాయాలకు ఎన్‌సీఏనే చికిత్స చేస్తుంది. పునరావాస శిబిరాలు ఎన్‌సీఏ ఆధ్వర్యంలోనే జరగాలి. భారత ఆటగాడు ఎవరైనా ఇదే పాటించాలి' అని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ... తన సహచరుడు ద్రవిడ్‌ను సమర్థించాడు.

## వయసు దాటినవారు 51 మంది...

### జాతీయ అండర్-14 అథ్లెటిక్స్ మీట్‌లో ఘటన

**తిరుపతి:** క్రీడల్లో తప్పుడు వయోధ్రువీకరణ పత్రాలతో తక్కువ వయసు స్థాయి పోటీల్లో పాల్గొనడం తరచుగా జరుగుతూనే ఉంది. ఇలాంటిదే ఇటీవల జరిగిన ఒక ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి వేదికగా నవంబర్ 24 నుంచి 26 మధ్య వరకు జరిగిన జాతీయ జూనియర్ అంతర్ జిల్లా అథ్లెటిక్స్ మీట్‌లో ఇది చోటు చేసుకుంది. అండర్-14, అండర్-16 విభాగాల్లో పోటీ పడటానికి దేశవ్యాప్తంగా 494 జిల్లాలకు చెందిన 4500 మంది అథ్లెట్లు ఈ మీట్‌లో పాల్గొన్నారు. అయితే వీరి వయసును తెలుసుకోవడానికి భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) వారికి వయసు నిర్ధారిత పరీక్షలు నిర్వహించింది. ఇందులో భాగంగా అథ్లెట్లకు దంత పరీక్షలు, టానర్ వైట్‌హౌస్ (టీడబ్ల్యూ3- ఎక్స్‌రే ద్వారా ఎముక వయసును కనుగొనే పద్ధతి) పరీక్షలు నిర్వహించగా... అందులో 51 మందికి ఎక్కువ వయసు ఉన్నట్లు తేలింది. వీరంతా తప్పుడు వయో ధ్రువీకరణ పత్రాలతో పోటీల్లో పాల్గొంటున్నట్లు ఏఎఫ్ఐ కనిపెట్టింది. మరో 169 మంది పరీక్షల్లో పాల్గొనకుండా ముందే తప్పించుకున్నట్లు ఏఎఫ్ఐ వయసు నిర్ధారిత పరీక్షల నిర్వహణాధికారి రాజీవ్ ఖత్రి తెలిపారు. దీనిపై ఆయా రాష్ట్రాల వివరణను కోరనున్నట్లు ఏఎఫ్ఐ స్పష్టం చేసింది. గత నెలలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు వేదికగా జరిగిన జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్‌లో కూడా దాదాపు 100 మంది ప్లేయర్లు తప్పుడు వయసుతో పోటీల్లో పాల్గొంటూ పట్టుబడ్డారు.

## మహిళల ప్రపంచ కప్‌తో యూనిసెఫ్ ఒప్పందం

**దుబాయ్:** 'యూనిసెఫ్'తో తమ భాగస్వామ్యాన్ని మరింత కాలం కొనసాగించనున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం ప్రకటించింది. మహిళలు, బాలికల సాధికారికత కోసం వచ్చే ఏడాది జరిగే మహిళల టి20 ప్రపంచ కప్ టోర్నీ వరకు యూనిసెఫ్‌తో తాము కొనసాగుతామని ఐసీసీ స్పష్టం చేసింది. దీంతో క్రికెట్ ఆడే దేశాల్లో బాలల హక్కుల కోసం యూనిసెఫ్ చేపడుతోన్న కార్యక్రమాలకు నిధుల సేకరణలో ఐసీసీ సహాయపడినట్లవుతుంది. ఐసీసీ క్రికెట్ ఈవెంట్‌ల ద్వారా సమకూర్చిన నిధుల్ని బాలికలకు క్రికెట్ క్రీడ నేర్పించేందుకు, మౌలిక సదుపాయాలు, శిక్షణా సిబ్బంది ఏర్పాటు వంటి తదితర కార్యక్రమాల కోసం వినియోగించనున్నారు. తాజా వన్డే ప్రపంచ కప్-2019 సమయంలో సేకరించిన నిధులను కూడా అఫ్గానిస్తాన్‌లో బాలికల క్రికెట్ ప్రాజెక్ట్ కోసం వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు కూడా పాలుపంచుకోవచ్చని ఐసీసీ తెలిపింది. టిక్కెట్ల కొనుగోలు ద్వారా వారు ఇందులో భాగస్వాములు కావచ్చని పేర్కొంది.

# అదరగొట్టిన ఆంధ్ర

- ఢిల్లీపై 9 వికెట్ల తేడాతో ఘన విజయం
- చెరో 5 వికెట్లతో చెలరేగిన స్టీఫెన్, శశికాంత్
- రంజీ ట్రోఫీ

**సాక్షి, ఒంగోలు టౌన్:** సొంత మైదానంలో ఆంధ్ర జట్టు సత్తా చాటింది. శుక్రవారం ముగిసిన గ్రూప్-'ఎ' రంజీ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టిన ఆంధ్ర 9 వికెట్ల తేడాతో ఏడు సార్లు రంజీ చాంపియన్ అయిన ఢిల్లీని చిత్తు చేసింది. ఆంధ్ర బౌలర్లు శశికాంత్ (5/41), స్టీఫెన్ (5/91) చెలరేగడంతో ఢిల్లీ తన రెండో ఇన్నింగ్స్‌లో 72.2 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది 16 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర 2.3 ఓవర్లలో వికెట్ కోల్పోయి 20 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ జ్ఞానేశ్వర్ (0) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగగా... సారథి హనుమ విహారి (4) త్వరగా అవుట్ అయ్యాడు. మనీశ్ (15 నాటౌట్; 3 ఫోర్లు), ప్రశాంత్ కుమార్ (1 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు. ఓవర్‌నైట్ స్కోరు 89/6తో చివరి రోజు ఆటను కొనసాగించిన ఢిల్లీని లలిత్ యాదవ్ (145 బంతుల్లో 55; 11 ఫోర్లు), వికాశ్ మిశ్రా (151 బంతుల్లో 36; 5 ఫోర్లు) ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరు ఏడో వికెట్‌కు 61 పరుగులు జోడించి ఢిల్లీకి ఇన్నింగ్స్ పరాభవాన్ని తప్పించారు. అర్ధ శతకంతో నిలకడగా ఆడుతున్న లలిత్ యాదవ్‌ను శశికాంత్ పెవిలియన్‌కు పంపగా... వికాశ్ మిశ్రాను స్టీఫెన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. తర్వాత ఢిల్లీ ఇన్నింగ్స్‌కు తెరపడటానికి ఎంతో సేపు పట్టలేదు. ఈ విజయంతో ఆంధ్ర ఖాతాలో 4 పాయింట్లు చేరాయి.

### హైదరాబాద్‌కు రెండో ఓటమి

రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు రెండో పరాజయాన్ని చవిచూసింది. గ్రూప్-'ఎ'లో పటియాల వేదికగా పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్, 125 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. ఓవర్‌నైట్ స్కోరు 30/5తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 43.4 ఓవర్లలో 76 పరుగులకే కుప్పకూలింది. పంజాబ్ బౌలర్లలో మయాంక్ మార్కండే (5/19), అకుల్ (3/27) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు.



స్టీఫెన్ శశికాంత్

## ఈ జట్టుతో సంతోషంగా ఉన్నా

### ఆర్‌సీబీ కొత్త ఆటగాళ్లపై కోహ్లి



భారత జట్టు సహచరులతో కోహ్లి

**న్యూఢిల్లీ:** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఈ వేలంలో మేటి ఆటగాళ్లను దక్కించుకుందని ఆ ఫ్రాంచైజీ కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. కోల్‌కతాలో గురువారం జరిగిన వేలంలో బెంగళూరు జట్టు ఎనిమిది మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. వీరిలో ఆసీస్ కెప్టెన్ ఫించ్‌తో పాటు ఆల్‌రౌండర్లు మోరిస్, స్టెయిన్ (దక్షిణాఫ్రికా), కేన్ రిచర్డ్సన్ (ఆస్ట్రేలియా) కీలక ఆటగాళ్లు. దీనిపై భారత కెప్టెన్ కోహ్లి మాట్లాడుతూ 'కొత్తగా వచ్చిన ఆటగాళ్లతో జట్టు మరింత పటిష్టమైంది. మొత్తానికి మంచి జట్టు తయారైందని సంతోషంగా ఉంది. జట్టు నిర్మాణం, సమతౌల్యంపై మేం ఇదివరకే చాలా చర్చించుకున్నాం. అనుకున్నట్లుగానే అనుభవజ్ఞులు మా జట్టుకు జతయ్యారు. వచ్చే సీజన్‌లో మేం తప్పకుండా రాణిస్తాం' అని అన్నాడు.

## స్వర్ణం నెగ్గిన మీరాబాయి చాను



**దోహా:** భారత మహిళా వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను ఖతర్ ఇంటర్నేషనల్ కప్‌లో సత్తా చాటింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల 49 కేజీల విభాగంలో బరిలో దిగిన ఆమె 194 (83+111) కేజీల బరువు ఎత్తి స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. మొదట స్నాచ్‌లో 83 కేజీలు ఎత్తిన మీరా... క్లీన్ అండ్ జర్క్‌లో 111 కేజీలను ఎత్తింది. అనైస్ మిచెల్ (ఫ్రాన్స్-172 కేజీలు), మనోన్ లోరెంజ్ (165 కేజీలు) వరుసగా రజత, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. అయితే ఈ ఏడాది జరిగిన ప్రపంచ చాంపియన్ షిప్‌లో మీరాబాయి ఎత్తిన 201 కేజీల ప్రదర్శన అత్యుత్తమం కాగా... ఇక్కడ అదే ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది. ఒలింపిక్ క్వాలిఫయింగ్ సిల్వర్ లెవల్ ఈవెంట్ అయిన ఈ టోర్నీలో గెలుపుతో సాధించిన పాయింట్లు 2020 టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో మీరాబాయికి కీలకం కానున్నాయి.

## కేరళ నాలుగో ఓటమి

### ఇండియన్ సూపర్ లీగ్ సీజన్-6

**చెన్నై:** ఇండియన్ సూపర్ లీగ్ సీజన్-6 ఫుట్‌బాల్ టోర్నీలో కేరళ బ్లాస్టర్స్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. శుక్రవారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కేరళ బ్లాస్టర్స్ 1-3 గోల్స్ తేడాతో చెన్నైయిన్ ఎఫ్‌సీ చేతిలో ఓడింది. దీంతో తాజా సీజన్‌లో కేరళ నాలుగో పరాభవాన్ని మూటగట్టుకుంది. చెన్నై ఆటగాళ్లు ఆండ్రూ స్కెంబ్రి (4వ నిమిషంలో), చాంగ్టె (30వ నిమిషంలో), వలాస్కిస్ (40వ నిమిషంలో) తలా ఓ గోల్ సాధించారు. కేరళ తరపున నమోదైన ఏకైక గోల్‌ను ఒగ్బెచె (15వ నిమిషంలో) చేశాడు. నేటి మ్యాచ్‌లో అట్లెటికో డి కోల్‌కతాతో హైదరాబాద్ ఎఫ్‌సీ ఆడుతుంది.

## శ్రీలంక 271 ఆలౌట్

### షాహీన్ అఫ్రిదికి 5 వికెట్లు



అఫ్రిది

**కరాచీ:** పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంకకు 80 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 64/3తో ఆట కొనసాగించిన లంక తమ మొదటి ఇన్నింగ్స్‌లో 271 పరుగులకు ఆలౌటైంది. దినేశ్ చండిమాల్ (74) అర్ధ సెంచరీతో టాప్ స్కోరర్‌గా నిలవగా, దిల్‌రువాన్ పెరీరా (48) రాణించాడు. పాక్ యువ పేస్ బౌలర్ షాహీన్ అఫ్రిది 77 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టగా, మరో పేసర్ అబ్బాస్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 57 పరుగులు చేసింది. ఆబిద్ అలీ (32 బ్యాటింగ్), షాన్ మసూద్ (21 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు.

## 'బిర్లా'కూ మానసిక ఆందోళన!

### క్రికెట్‌కు విరామమిచ్చిన ఆర్యమాన్



*ముంబై:* *అతని వయసు 22 ఏళ్లు... కాలు కదపాల్సిన అవసరం లేకుండానే సిద్ధంగా ఉన్న కోట్ల రూపాయల సామ్రాజ్యం...దేశాన్ని శాసించగల సంపద ఉన్న వ్యక్తి కుమారుడు...కానీ అతడిని కూడా మానసిక ఆందోళన వదల్లేదు. తాను ఎంచుకున్న దారిలో లక్ష్యం చేరుకోలేకపోవడం, అనుకున్న స్థాయిలో రాణించలేకపోవడం బహుశా అందుకు కారణం కావచ్చు! ఆ కుర్రాడి పేరు ఆర్యమాన్ బిర్లా. ప్రముఖ వ్యాపారవేత్త కుమార మంగళం బిర్లా కొడుకు. మధ్య ప్రదేశ్ తరపున దేశవాళీ క్రికెట్ ఆడుతూ వచ్చిన ఆర్యమాన్ మానసికపరమైన ఆందోళనతో క్రికెట్‌నుంచి 'నిరవధిక విరామం' విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. తాను ఇష్టపడిన ఆటలో సాధ్యమైనంతంగా శ్రమించానని, అయితే ఇకపై తన ప్రయాణం గురించి కొత్తగా ఆలోచించాల్సి ఉందంటూ అతను వెల్లడించాడు. ఎడమచేతివాటం బ్యాట్స్‌మన్ అయిన ఆర్యమాన్ 9 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 27.60 సగటుతో 414 పరుగులు, 4 లిస్ట్-ఎ మ్యాచ్‌లలో 36 పరుగులు చేశాడు. 2018 ఐపీఎల్ వేలంలో అతడిని రూ. 30 లక్షలకు తీసుకున్న రాజస్తాన్ గత ఏడాది కూడా కొనసాగించింది. అయితే రెండు సీజన్లలో కలిపి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. ఈ సారి దేశవాళీ క్రికెట్ సీజన్ బరిలోకి దిగకపోగా, ఐపీఎల్ వేలంలోనూ పాల్గొనలేదు.*

అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిషనర్ మరియు డైరెక్టర్ కార్యాలయం
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గుంటూరు, అమరావతి
ప్రకటన నం. SE(AM)/AP/GNT/Ep/32/2019-20, తేది: 20-12-2019
నిల్వచేసిన వ్యవసాయ ఉత్పత్తుల నిర్వహణ మరియు పెంపుదలను మెరుగుపరిచే ఉద్దేశంతో మరియు గోదాముల ఆక్యుపెన్సీని పెంచుటకు వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్ మరియు రైతుబంధు పథకం స్కీమ్ (RBP) ఆపరేషన్స్ మరియు మేనేజ్‌మెంట్ నిర్వహించుట కోసం 3వ పార్టీ ఏజెన్సీ ఎంపిక ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం. EoI డాక్యుమెంట్‌ను tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఏదేని తదుపరి సమాచారం కోసం సంప్రదించండి: ఫోన్ నం. 9182361172.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (AM) (F.A.C.)

EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P.LTD
Corporate Office, P&T Colony, Seethammadhara, Visakhapatnam-13.
e- Tender Notice
The APEPDCL is opting for e-tendering from the eligible bidders for "Providing of Comprehensive Annual Maintenance Contract (AMC) to existing Video Conferencing equipments provided at Corporate Office and all Circle and Division Offices in APEPDCL for a period of 03 Years." against Bid No's 01/2019-20. For further details please visit at www.eprocurement.gov.in Phone Nos.0891-2582398 & 2582397.
Advt-91 Chief General Manager/OCS, CIVIL & IT
CC bills can be paid thru PayTm and also POS machines at our counters at ERO s for cashless transactions

SBI
Internal Audit Department, Hyderabad.
ENGAGEMENT OF CHARTERED ACCOUNTANT FIRMS AND RETIRED OFFICERS AS CONCURRENT AUDITORS (CCV)
Applications are invited from eligible **Chartered Accountant Firms (Category 1/2/3/4) and Retired Officers** of SBI (including Retired Officers of Associate Banks of SBI) in Scale 2/3 who have retired under normal superannuation for empanelment as concurrent auditors (CCV) for Currency Chest Verification on weekly basis (NOT on daily basis) in the identified branches. Proforma for application, eligibility criteria, selection process and other details are available under Empanelment News in Bank's website https://sbi.co.in/web/sbi-in-the-news/empanelment-of-vendors
Place: Hyderabad
Date: 21.12.2019
Sd/-
Dy. General Manager (OMA)

SAINIK SCHOOL KORUKONDA
An Autonomous Body under Ministry of Defence, Government of India
Dist. Vizianagaram (A.P) Pin : 535214
Phone : 08922-246119, 128 & 168 Fax : 08922-246150
Website : www.sainikschoolkorukonda.org
WALK-IN FOR RECRUITMENT
(1) For the post of Counselor (contractual basis).
(2) Eligible and interested candidates may appear for walk in for selection with full Bio-Data and certificates at 0830 hrs on **26 Dec 2019** at Sainik School, Korukonda, Vizianagaram Dist A.P. TA/DA will not be admissible.
For details of the advertisement please log on to our school website.
Principal,
Sainik School Korukonda

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 8 ▲ | 12 ▲ |
| 41,682 | 12,272 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,923 | ▲ | 36 |
| డోజోన్స్ | 28,486 | ▲ | 109 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,582 | ▲ | 9 |
| డాక్స్ | 13,319 | ▲ | 107 |
| షాంఘై | 3,005 | ▼ | 12 |
| నికాయ్ | 23,817 | ▼ | 48 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.35 | 71.99 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.07 | 94.27 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.67 | 80.59 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.90 | 66.29 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 48.05 | 50.21 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.61 | 53.41 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.18 | 19.78 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.90 | 19.90 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.53 | 10.93 |




# మందగమనాన్ని ఎదుర్కోగలం

- ఎకానమీ మళ్లీ అధిక వృద్ధి బాట పడుతుంది
- కార్పొరేట్లు పెట్టుబడులు పెట్టాలి
- సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

**న్యూఢిల్లీ:** భారత ఆర్థిక వ్యవస్థకు .. ప్రస్తుత మందగమనం నుంచి బైటపడే సత్తా ఉందని, మళ్లీ అధిక వృద్ధి బాట పట్టగలదని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధికి ఊతమిచ్చేలా పెట్టుబడులకు సంబంధించి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాలంటూ కార్పొరేట్లకు పిలుపునిచ్చారు. పరిశ్రమల సమాఖ్య అసోచాం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. వ్యాపారాల నిర్వహణ సులభతరం చేసేందుకు, కార్పొరేట్లకు తోడ్పాటునిచ్చేందుకు తీసుకున్న చర్యలను పునరుద్ఘాటించారు. సహేతుకమైన కారణాలతో నిజాయితీగా నిర్ణయాలు తీసుకున్న పక్షంలో కార్పొరేట్లపై ఎలాంటి చర్యలు ఉండబోవన్నారు. రాబోయే రోజుల్లో మౌలిక సదుపాయాల కల్పనపై రూ. 100 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు, గ్రామీణ ఎకానమీని అభివృద్ధి చేసేందుకు మరో రూ. 25 లక్షల కోట్లు వ్యయం చేయనున్నట్లు చెప్పారు. 2024 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీగా మారడం లక్ష్యమన్నారు. 'ప్రస్తుత ఆర్థిక మందగమనంపై జరుగుతున్న చర్చల గురించి నాకు అంతా తెలుసు. అయితే, ప్రతికూల వ్యాఖ్యల గురించి నేనేమీ మాట్లాడబోను. కేవలం సానుకూలాంశాల గురించే తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటాను' అని ప్రధాని చెప్పారు.

### 130 కోట్ల భారతీయులకు ఏజెంట్లం...

వ్యాపారాల నిర్వహణ సులభతరంగా ఉన్న దేశాల జాబితాలో మూడేళ్ల వ్యవధిలోనే భారత్ 142వ స్థానం నుంచి ఏకంగా 63వ స్థానానికి చేరిందని మోదీ చెప్పారు. గడిచిన మూడేళ్లుగా నిరంతరం మెరుగుపడుతున్న టాప్ 10 దేశాల్లో ఒకటిగా ఉంటోందన్నారు. 'ఇదేమీ.. ఆరోపణలు, ప్రజాగ్రహాలు ఎదుర్కొనకుండానే సాధ్యపడలేదు. మమ్మల్ని కార్పొరేట్ ఏజెంట్లంటూ ఆరోపించారు. కానీ మేం 130 కోట్ల మంది భారతీయులకు ఏజంట్లము' అని ప్రధాని పేర్కొన్నారు. కంపెనీల చట్టంలోని చాలా మటుకు నిబంధనలను క్రిమినల్ చర్యల పరిధి నుంచి తప్పించామని, మరిన్ని సవరణలు తేబోతున్నామని ఆయన వివరించారు. ఇక, విఫలమైన సంస్థలు బైటపడేందుకు దివాలా కోడ్ ద్వారా వెసులుబాటు లభిస్తోందని చెప్పారు. వ్యవస్థలో బలహీనతలను చాలా మటుకు అధిగమించామని తెలిపారు. ఇక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం, పెట్టుబడులు పెట్టడం మొదలైనవి బ్యాంకింగ్, కార్పొరేట్ వర్గాల వంతని ప్రధాని చెప్పారు. అయితే, ఈ క్రమంలో కార్మికుల ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. 'అధిక వృద్ధి సాధించే క్రమంలో హెచ్చుతగ్గులు చోటుచేసుకోవడం గతంలోనూ జరిగింది. అయితే, భారత దేశానికి ఇలాంటి ప్రతికూల పరిస్థితుల నుంచి బైటపడే సత్తా ఉంది' అని మోదీ పేర్కొన్నారు.

## పన్ను ఎగవేతదారులను పట్టుకోండి: ఆర్థికశాఖ

**న్యూఢిల్లీ:** ఆర్థిక మందగమనంలో లక్ష్యం మేరకు పన్నుల ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు అధికారులు అనుసరించాల్సిన మార్గాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సూచించింది. పన్నుల ఎగవేతదారులను డేటా అనలైటిక్స్ సాయంతో గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరింది. పన్నుల అధికారులతో కేంద్ర ఆర్థిక శాఖ ఢిల్లీలో సమీక్షా సమావేశం నిర్వహించింది. దీనికి రెవెన్యూ విభాగం కార్యదర్శి అజయ్‌భూషణ్ పాండే అధ్యక్షత వహించారు. అధిక ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకుంటే, ఈ వివరాలు వారి వ్యక్తిగత ఆదాయపన్ను రిటర్నుల్లో ప్రతిఫలించకపోవడం.. అటువంటి సమాచారం జీఎస్‌టీ, ఆదాయపన్ను విభాగాల మధ్య పంపిణీ చేసుకోవడంపై ఇందులో చర్చించారు. ఈ తరహా పన్నుల ఎగవేతదారులను గుర్తించేందుకు సమాచారాన్ని జీఎస్‌టీ విభాగం ఆదాయపన్ను శాఖతో పంచుకోవాలని పాండే కోరారు.



# స్పెక్ట్రం వేలానికి లైన్ క్లియర్

- మార్చి–ఏప్రిల్‌లో నిర్వహణ...
- రూ. 5.22 లక్షల కోట్ల రిజర్వ్ ధర
- డీసీసీ ఆమోదముద్ర



**న్యూఢిల్లీ:** దాదాపు రూ. 5.22 లక్షల కోట్ల రిజర్వు ధరతో స్పెక్ట్రం వేలం ప్రణాళిక ఖరారైంది. డిజిటల్ కమ్యూనికేషన్స్ కమిషన్ (డీసీసీ) శుక్రవారం దీనికి ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం 22 సర్కిళ్లలో 8,300 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రంను మార్చి–ఏప్రిల్‌లో వేలం వేయనున్నారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ సిఫార్సుల మేరకు డీసీసీ ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసినట్లు టెలికం శాఖ కార్యదర్శి అన్షు ప్రకాష్ తెలిపారు. మరోవైపు, కొచ్చి, లక్షద్వీప్ మధ్య సబ్‌మెరైన్ ఫైబర్ కేబుల్ కనెక్టివిటీ ప్రతిపాదనకు కూడా డీసీసీ ఆమోదం తెలిపింది. సుమారు రూ. 1,072 కోట్ల వ్యయమయ్యే ఈ ప్రాజెక్టుతో 11 ద్వీపాలకు కనెక్టివిటీ లభిస్తుంది.

**ముందుగా 25 శాతం కట్టాలి..**

స్పెక్ట్రం వేలానికి సంబంధించి ప్రాథమికంగా రూ. 4.9 లక్షల కోట్ల విలువ చేసే స్పెక్ట్రం వేలానికి ట్రాయ్ సిఫార్సులు చేసింది. అయితే, కొన్ని సర్కిళ్లలో రిలయన్స్ కమ్యూనికేషన్స్, భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యులార్ సంస్థల లైసెన్సులు ముగిసిపోనుండటంతో.. ఆ తర్వాత వాటిని కూడా ప్రణాళికలో కలిపింది. తాజా వేలంలో 1 గిగాహెర్ట్జ్ లోపు స్పెక్ట్రం కొనుగోలు చేసిన సంస్థలు ముందుగా ధరలో 25 శాతం మొత్తాన్ని, 1 గిగాహెర్ట్జ్‌కు మించి కొనుగోలు చేసిన సంస్థలు 50 శాతం మొత్తాన్ని కట్టాల్సి ఉంటుంది. ముందస్తుగా కొంత కట్టిన తర్వాత రెండేళ్ల పాటు మారటోరియం లభిస్తుంది. ఆ తర్వాత మూడో ఏడాది నుంచి 16 వార్షిక వాయిదాల్లో మిగతా మొత్తాన్ని కట్టాలి. ప్రభుత్వ సూచన మేరకు అధ్యయనం చేసిన ట్రాయ్.. 700 మెగాహెర్ట్జ్ నుంచి 3400–3600 మెగాహెర్ట్జ్ దాకా వివిధ బ్యాండ్‌లలో స్పెక్ట్రంను వేలం వేయొచ్చని సిఫార్సు చేస్తూ 2018 ఆగస్టు 1న నివేదికనిచ్చింది.

## జనవరి 15లోగా తేల్చండి

**'కార్వీ–యాక్సిస్ బ్యాంక్' షేర్ల వివాదంపై సెబీకి శాట్ ఆదేశాలు**

**న్యూఢిల్లీ:** బ్రోకింగ్ సంస్థ కార్వీ తనఖా ఉంచిన షేర్ల స్వాధీనానికి సంబంధించి .. యాక్సిస్ బ్యాంకు పిటిషన్‌పై జనవరి 15లోగా తగు ఉత్తర్వులు ఇవ్వాలంటూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) శుక్రవారం సూచించింది. దీనిపై 15 రోజుల్లోగా తీర్పునివ్వాలంటూ డిసెంబర్ 17న ఇచ్చిన ఆదేశాలను తాజాగా సవరించింది. క్లయింట్ల షేర్లను సొంతానికి వాడుకుందని ఆరోపణలున్న కార్వీపై (కేఎస్‌బీఎల్) పలు ఆంక్షలు అమలవుతున్న సంగతి తెలిసిందే. కార్వీ తనఖా పెట్టిన షేర్లపై యాక్సిస్ బ్యాంక్ రూ. 81 కోట్లు రుణమిచ్చింది. ఆ షేర్లను స్వాధీనం చేసుకునేందుకు వీలుగా.. కార్వీ ఖాతాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలంటూ నియంత్రణ సంస్థలను యాక్సిస్ బ్యాంక్ కోరుతోంది.




# అవరోధాలు సృష్టించే దేశాలపై చర్యలు

**ఎగుమతిదారులకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హామీ**

**న్యూఢిల్లీ:** టారిఫ్‌యేతర ఆంక్షలు విధిస్తూ, భారత్ నుంచి ఎగుమతులకు అవరోధాలు సృష్టిస్తున్న దేశాల పేర్లు చెప్పాలని వ్యాపారవేత్తలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. అలాంటి దేశాలపై కచ్చితంగా ప్రతీకార చర్యలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ 92వ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా గోయల్ ఈ విషయాలు తెలిపారు. ఏ ఒక్కరి విషయంలోనో కాకుండా అందరికీ ప్రయోజనాలు కలిగేలా సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కరించాలన్నది తమ ప్రభుత్వ విధానమని ఆయన చెప్పారు. 'ఏ దేశమైనా మీ ఎగుమతులపై టారిఫ్‌యేతర ఆంక్షలు విధించడం గానీ.. ఇతరత్రా అవరోధాలు గానీ సృష్టించడం గానీ చేస్తుంటే ప్రభుత్వానికి చెప్పండి. ప్రభుత్వం మీ వెన్నంటే ఉంటుంది.




ఆయా దేశాలపై అదే తరహా వాణిజ్యపరమైన ఆంక్షలతో తగు చర్యలు తీసుకుంటుంది' అని గోయల్ తెలిపారు.

**వాస్తవ పరిస్థితులు మీరే చెప్పండి ..**

'మా అధికారులు నాకు చెప్పేవన్నీ.. అంతా బాగానే ఉందనే అభిప్రాయం కలిగేలా ఉంటాయి. కానీ మిమ్మల్ని చూస్తుంటే కచ్చితంగా అలా ఉన్నట్లు అనిపించడం లేదు. కాబట్టి వ్యవస్థ సరిగ్గా పనిచేస్తోందా లేదా.. సమస్యలేమైనా ఉన్నాయా.. వాస్తవ పరిస్థితులను మీరే ప్రభుత్వానికి తెలియజేయండి. నేను, మా అధికారులు మీకు ఇరవై నాలుగ్గంటలూ అందుబాటులో ఉంటాం' అని చెప్పారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, పరిశ్రమ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## ద్రవ్యలోటును కట్టడి చేయాలి: ఐఎంఎఫ్

ఇదిలావుండగా, భారత్ ద్రవ్యలోటును కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) చీఫ్ ఎకనమిస్ట్ గీతా గోపీనాథ్ పేర్కొన్నారు. వ్యయాల హేతుబద్ధీకరణ, ఆదాయం పెంపు మార్గాల ద్వారా ఇది సాధ్యమని ఆమె పేర్కొన్నారు. ఫిక్కీ న్యూఢిల్లీలో నిర్వహించిన 92వ వార్షిక సదస్సులో ఆమె మాట్లాడారు. గడచిన కొద్ది త్రైమాసికాలుగా చూస్తే, ప్రైవేటు రంగం డిమాండ్ మందగమనంలో ఉందని ఆమె పేర్కొన్నారు. అలాగే పెట్టుబడుల్లో బలహీనత కొనసాగితే, దీర్ఘకాలంలో అది వృద్ధితీరుపై ప్రభావం చూపిస్తుందని పేర్కొన్నారు.



## బజాజ్ వ్యాఖ్యలకు కౌంటర్!

ప్రభుత్వ విధానాలను విమర్శించే దమ్మెవరికీ లేకుండా పోయిందని, భయాందోళనలకు గురి చేసే వాతావరణం నెలకొందని పారిశ్రామిక దిగ్గజం రాహుల్ బజాజ్ చేసిన వ్యాఖ్యలపై గోయల్ స్పందించారు. ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అయితే, తమ ప్రభుత్వం ప్రతీ ఒక్కరినీ గౌరవిస్తుందని, అందరి అభిప్రాయాలనూ వింటుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో.. ప్రజలు, పరిశ్రమవర్గాల నుంచి మరింతగా తెలుసుకోవాలనుకుంటోందని అసోచాం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా తెలిపారు.

# టెలికంను కష్టాల నుంచి గట్టెక్కించండి

**లైసెన్స్, స్పెక్ట్రమ్ చార్జీలు తగ్గించాలి ● ఆర్థిక మంత్రికి సీవోఏఐ వినతి**



**న్యూఢిల్లీ:** టెలికం పరిశ్రమ తాను ఎదుర్కొంటున్న సవాళ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో 2020–21 బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల సమావేశం జరిగింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్) విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు తర్వాత టెలికం కంపెనీలు ప్రభుత్వానికి రూ.1.47 లక్షల కోట్లను బకాయిలుగా చెల్లించాల్సి వస్తుంది. దీన్ని పరిష్కరించాలని సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ) ఈ సందర్భంగా మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరింది. ''ఏజీఆర్ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించాం. ప్రస్తుతం ఆదాయంలో 8 శాతంగా ఉన్న స్పెక్ట్రమ్ ఫీజును 3 శాతానికి తగ్గించాలని కోరాం. స్పెక్ట్రమ్ వినియోగ చార్జీని ప్రస్తుతమున్న 5 శాతం నుంచి 1 శాతానికి తగ్గించాలని అడిగాం. తగిన వ్యవధిలోపు దీన్ని చేస్తారేమో చూడాలి. ఒక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంకును ఏర్పాటు చేసి, పన్ను రహిత బాండ్ల జారీ ద్వారా నిధులు సమీకరించి.. తక్కువ రేటుకు రుణాలు ఇచ్చే ఏర్పాటు చేయాలని కూడా కోరాం'' అని సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ ఎస్ మాథ్యూస్ మీడియాకు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు విషయంలో స్పష్టత కోసం వేచి చూస్తున్నామని టెలికం శాఖ తమకు తెలిపినట్టు చెప్పారు. జీఎస్‌టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ బకాయిలు రూ.36,000 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరినట్టు వెల్లడించారు. ''స్పెక్ట్రమ్, లైసెన్స్ ఫీజుపై 18 శాతం పన్ను విధిస్తున్నారు. ఎందుకంటే వీటిని సేవలుగా పేర్కొన్నారు. అవి సేవలు కావని వివరించాం'' అని మాథ్యూస్ తెలిపారు.

### జీఎస్‌టీని సులభంగా మార్చాలి: ఆర్థిక వేత్తలు

వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)ను సులభంగా మార్చాలని, ప్రత్యక్ష పన్నుల కోడ్ (చట్టం)ను అమలు చేయాలని కేంద్రానికి ఆర్థిక వేత్తలు సూచించారు. వృద్ధికి మద్దతుగా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించాలని, అందుకు అన్ని రంగాల్లోనూ విధానపరమైన పరిష్కారాలు వేగంగా అమలయ్యేలా చూడాలని కోరారు. అలాగే, ద్రవ్య నిర్వహణ, విద్యుత్ రంగంలోనూ సంస్కరణలు అవసరమని బడ్జెట్ ముందస్తు సమావేశంలో సూచించారు. ''వృద్ధి క్షీణత పరంగా కనిష్ట స్థాయి ముగిసింది. వృద్ధిని 7–7.5 శాతానికి వేగవతం చేయడానికి ఏమి చేయగలమన్నదే ముఖ్యం'' అని మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ విర్మాణి సమావేశం అనంతరం మీడియాతో అన్నారు. చిన్న వ్యాపారాలకు డీటీసీ అమలు ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

### సందేహాత్మక స్థితి నుంచి బయట పడాలి

**నిర్మలా సీతారామన్**

దేశీయ పరిశ్రమలు సందేహాత్మక స్థితి నుంచి బయటకు రావాలని, సహజ ఉత్సాహాన్ని ప్రదర్శించాలని మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. బడ్జెట్ తర్వాత నుంచి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నట్టు ఆమె చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన అసోచామ్ సదస్సులో ఆమె మాట్లాడారు. ''స్వీయ సందేహాత్మక ధోరణి నుంచి బయటకు రావాలి. మేం ఇది చేయగలమా? భారత్ ఇది చేయగలదా?.. ఎందుకీ ప్రతికూల భావన? ఈ అనుమానాల నుంచి బయటకు రండి. భారత వ్యవస్థను మార్చే విషయమై ప్రభుత్వం తన దృఢత్వాన్ని చూపించింది. కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా పరిశ్రమల పట్ల స్పందిస్తుందని నమ్మకం కలిగించాం'' అని చెప్పారు. దేశ వృద్ధి ఆరేళ్ల కనిష్ట స్థాయికి చేరి, ప్రభుత్వంపై ఎన్నో విమర్శలు, పరిశ్రమల నుంచి ఎన్నో డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో ఆమె ఈ విధంగా స్పందించడం గమనార్హం. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందని, స్థూల ఆర్థిక మూలాలు బలంగానే ఉన్నాయని, ఎఫ్‌డీఐల రాక బలంగా ఉందని, విదేశీ మారక నిల్వలు రికార్డు గరిష్టాల వద్ద ఉన్నాయని వివరించారు. ''దేశ వృద్ధి పథంలో పాల్గొనాలి. తొలి బిడ్ వేయడం ద్వారా ప్రభుత్వరంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి'' అని పిలుపునిచ్చారు.

# భారత్‌లో గూగుల్ నియామకాలు

**ప్రపంచ వ్యాప్తంగా 3,800 కస్టమర్ సపోర్ట్ ఉద్యోగాలు**

**న్యూఢిల్లీ:** టెక్ దిగ్గజం గూగుల్.. ప్రపంచ వ్యాప్తంగా 3,800 మంది ఉద్యోగులను నియమించుకోనుంది. భారత్, అమెరికా, ఫిలిప్పీన్స్ దేశాల్లో ఈ నియామకాలు జరగనున్నాయని సంస్థ శుక్రవారం ప్రకటించింది. కస్టమర్, యూజర్ సపోర్ట్ ఉద్యోగాల్లో నేరుగా కంపెనీ ఉద్యోగాలు ఉండనున్నాయని వివరించింది. గతంలో థర్డ్‌పార్టీ సేవల ద్వారా ఈ నియామకాలు జరిగేవి. ప్రస్తుతం కస్టమర్ సపోర్ట్ విభాగంలో కంపెనీకి 1,000 మంది ఉద్యోగులు ఉన్నారని 2020 చివరినాటికి వీరి సంఖ్యను 4,800 మందికి పెంచనున్నామని ఆపరేషన్స్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ ట్రాయ్ డికెర్సన్ తెలిపారు.




# మహీంద్రా మేనేజ్‌మెంట్‌లో భారీ మార్పులు

- చైర్మన్‌గా తప్పుకుంటున్న ఆనంద్ మహీంద్రా
- ఇకపై నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొనసాగింపు
- ఎండీ, సీఈవోగా పవన్ కుమార్ గోయెంకా
- 2020 ఏప్రిల్ నుంచి అమల్లోకి
- 2021 తర్వాత సీఈవో, ఎండీగా అనీష్ షా



ఆనంద్ మహీంద్రా



పవన్ కుమార్ గోయెంకా



అనీష్ షా

**న్యూఢిల్లీ:** వ్యవసాయోత్పత్తుల నుంచి ఐటీ దాకా వివిధ రంగాల్లో విస్తరించిన మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) టాప్ మేనేజ్‌మెంట్‌లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఎగ్జిక్యూటివ్ చైర్మన్ హోదా నుంచి ఆనంద్ మహీంద్రా (64) తప్పుకోనున్నారు. 2020 ఏప్రిల్ 1 తర్వాత నుంచి నాన్–ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొనసాగుతారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కంపెనీ ఈ విషయాలు వెల్లడించింది. దీని ప్రకారం పవన్ కుమార్ గోయెంకా మరోసారి మేనేజింగ్ డైరెక్టరుగా నియమితులయ్యారు. అలాగే, 2020 ఏప్రిల్ 1 నుంచి ఏడాది పాటు ఆయన చీఫ్ ఎగ్జిక్యూటివ్ (సీఈవో) బాధ్యతలు కూడా నిర్వర్తించనున్నారు. అటుపైన గోయెంకా పదవీ విరమణ అనంతరం 2021 ఏప్రిల్ 1 నుంచి అనీష్ షా .. ఎండీ, సీఈవోగా ఉంటారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీతో పాటు సమీప భవిష్యత్‌లో చేపట్టే ఇతరత్రా ప్రాజెక్టులు సజావుగా అమలయ్యేలా చూసేందుకు ప్రత్యేకంగా సీఈవో పదవిని ఏర్పాటు చేసినట్లు ఎంఅండ్‌ఎం తెలిపింది. ఇంకా కొన్ని మార్పులు, చేర్పులు ఉంటాయని, డిసెంబర్ 23న వాటిని వెల్లడించనున్నామని పేర్కొంది. కీలక నియామకాలకూ సంబంధించి కంపెనీలో అంతర్గత సిబ్బందితో పాటు బైటివారినీ ఇంటర్వ్యూ చేసినట్లు గవర్నెన్స్, నామినేషన్ కమిటీ (జీఎన్‌ఆర్‌సీ) చైర్మన్ ఎంఎం మురుగప్పన్ తెలిపారు. కొత్త నాయకత్వం.. మహీంద్రా విలువలను కాపాడుతూ, సంస్థను ముందుకు తీసుకెళ్లగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

'సంస్థను ముందుకు నడిపించగలిగే సత్తా గల సమర్థులకు ఎంఅండ్‌ఎంలో కొదవేమీ లేదనడానికి ఇది నిదర్శనం. ఆయా బాధ్యతల్లో నియమితులైన వారు కంపెనీ సంస్కృతి, విలువలు, మెరుగైన నిర్వహణ ప్రమాణాలు కొనసాగించగలరు. కొత్త పాత్రలో మహీంద్రా గ్రూప్ విలువలకు కస్టోడియన్‌గా, షేర్‌హోల్డర్ల ప్రయోజనాల పరిరక్షకుడిగానూ వ్యవహరిస్తాను. అంతర్గత ఆడిట్ ఇకపైనా నాకే రిపోర్ట్ చేస్తుంది. బోర్డు పర్యవేక్షణ నా సారథ్యంలోనే ఉంటుంది' అని తాజా మార్పులపై ఆనంద్ మహీంద్రా వెల్లడించారు.

**ఆనంద్ సారథ్యంలో భారీ విస్తరణ..**

దాదాపు 20.7 బిలియన్ డాలర్ల గ్రూప్‌గా ఎదిగిన ఎంఅండ్‌ఎం గ్రూప్‌నకు ఆనంద్ మహీంద్రా మేనమామ కేశుభ్ మహీంద్రా సుమారు 45 ఏళ్ల పాటు సారథ్యం వహించారు. 2012 ఆగస్టులో ఆయన చైర్మన్ హోదా నుంచి తప్పుకోవడంతో ఆనంద్ మహీంద్రా ఆ బాధ్యతలు చేపట్టారు. ఆనంద్ నేతృత్వంలో ఎంఅండ్‌ఎం గ్రూప్ దేశ, విదేశాల్లో.. ఆటోమొబైల్స్, వ్యవసాయం, ఐటీ, ఏరోస్పేస్ తదితర అనేక రంగాల్లో దూకుడుగా విస్తరించింది. పలు కంపెనీల కొనుగోళ్లలో కూడా ఆనంద్ కీలకపాత్ర పోషించారు. దేశీయంగా సత్యం కంప్యూటర్ సర్వీసెస్, రెవా ఎలక్ట్రిక్ కార్ కంపెనీ మొదలుకుని సాంగ్‌యాంగ్ మోటార్స్, ప్యూజో మోటార్‌సైకిల్స్, గిప్స్‌ల్యాండ్ ఏరోనాటిక్స్ తదితర అంతర్జాతీయ సంస్థలను ఎంఅండ్‌ఎం కొనుగోలు చేసింది. సీఈవోగా కూడా బాధ్యతలు చేపట్టనున్న పవన్ గోయెంకా .. ఎంఅండ్‌ఎంలో అంచెలంచెలుగా ఎదిగారు.

### కొత్త బాధ్యతల్లో...

- ప్రస్తుతం గ్రూప్ ప్రెసిడెంట్ (స్ట్రాటజీ విభాగం)గా ఉన్న అనీష్ షా.. ఇకపై డిప్యూటీ ఎండీగాను, గ్రూప్ సీఎఫ్‌వోగాను వ్యవహరిస్తారు. ప్రస్తుత సీఎఫ్‌వో వీఎస్ పార్థసారథి ఇకపై.. మహీంద్రా లాజిస్టిక్స్, ఆటో మొబిలిటీ సర్వీసెస్‌ను కలిపి ఏర్పాటు చేసే మొబిలిటీ సేవల విభాగానికి సారథ్యం వహిస్తారు.
- ప్రస్తుతం వ్యవసాయ పరికరాల విభాగం ప్రెసిడెంట్‌గా ఉన్న రాజేష్ జెజూరికర్.. ఇక మీదట ఎంఅండ్‌ఎం బోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా (ఆటో, వ్యవసాయ విభాగాలు) చేరతారు.
- టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నాని.. 2020 ఏప్రిల్ 1 నుంచి గ్రూప్ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా చేరతారు.
- 2020 ఏప్రిల్ 1న పదవీ విరమణ చేయనున్న గ్రూప్ ప్రెసిడెంట్ రాజీవ్ దూబే.. ఆ తర్వాత నుంచి నాన్–ఎగ్జిక్యూటివ్, సలహాదారు హోదాలో కొనసాగుతారు.

## జెట్ ఎయిర్‌వేస్ దివాలా పరిష్కార గడువు పెంపు




**ముంబై:** జెట్ ఎయిర్‌వేస్ దివాలా పరిష్కార గడువును 90 రోజుల పాటు పొడిగించేందుకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అనుమతించింది. దక్షిణాఫ్రికాకు చెందిన సినర్జీ గ్రూపు మరింత సమయం కోరుతుండడం, మరో ఇద్దరు ఇన్వెస్టర్లు ఆసక్తి వ్యక్తీకరిస్తున్న నేపథ్యంలో జెట్ ఎయిర్ వేస్ రుణ దాతల కమిటీ (సీవోసీ) దివాలా పరిష్కార గడువును పొడిగించాలంటూ ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్‌ను కోరింది. జెట్ ఎయిర్‌వేస్‌కు కార్పొరేట్ దివాలా పరిష్కార గడువు (180 రోజులు) ఈ నెల 16న ముగియగా, ఈ గడువును మరో 90 రోజులు పాటు పొడిగిస్తూ ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు జారీ చేసింది. జెట్ ఎయిర్‌వేస్‌కు సినర్జీ గ్రూపు ఒక్కటే బిడ్ దాఖలు చేయగా, వాటాదారుల ప్రయోజనం దృష్ట్యా పెట్టుబడులపై సరైన నిర్ణయం తీసుకునేందుకు మరింత సమయం కోరుతుండడం గమనార్హం.

## క్రిసిల్ చేతికి గ్రీన్‌విచ్ అసోసియేట్స్

**న్యూఢిల్లీ:** గ్రీన్‌విచ్ అసోసియేట్స్ ఎల్ఎల్‌సీ కంపెనీతో పాటు దాని అనుబంధ సంస్థలను రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ కొనుగోలు చేయనున్నది. ఆర్థిక సేవల సంస్థలకు అవసరమయ్యే ప్రొప్రైటరీ బెంచ్‌మార్కింగ్ డేటాను అందించే గ్రీన్‌విచ్, దీనికి చెందిన ఆరు అనుబంధ కంపెనీలను రూ.284 కోట్లు(4 కోట్ల డాలర్లు)కు కొనుగోలు చేయనున్నామని క్రిసిల్ వెల్లడించింది. ఈ కంపెనీలన్నింటినీ తమ పూర్తి అనుబంధ సంస్థ క్రిసిల్ ఇరెవ్న యూఎస్ ఎల్ఎల్‌సీ టేకోవర్ చేస్తుందని పేర్కొంది. వచ్చే ఏడాది మార్చికల్లా ఈ డీల్ పూర్తవ్వగలదని, వివిధ నియంత్రణ సంస్థల ఆమోదాలు పొందాల్సి ఉందని వివరించింది.

### కొత్త శిఖరాలకు సూచీలు

| సూచీ | ఇంట్రాడే | ముగింపు |
|---|---|---|
| సెన్సెక్స్ | 41,810 | 41,682 |
| నిఫ్టీ | 12,294 | 12,272 |

# రికార్డుల వారం...

- నాలుగు రోజులు ఆల్‌టైమ్‌హైలు
- ఇంట్రాడేలో, ముగింపులో కొనసాగిన రికార్డులు
- 8 పాయింట్ల లాభంతో 41,682కు సెన్సెక్స్
- 12 పాయింట్లు పెరిగి 12,272కు నిఫ్టీ



స్టాక్ మార్కెట్ శుక్రవారం స్వల్ప లాభాలతో గట్టెక్కింది. చివర్లో అమ్మకాలు జోరుగా సాగడంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. అయినప్పటికీ.. సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా నాలుగో రోజూ ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ కొత్త రికార్డ్‌లను సృష్టించాయి. వృద్ధి అంచనాలను ఫిచ్ రేటింగ్స్ తగ్గించడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ తగ్గడం ఒక దశలో ప్రతికూల ప్రభావం చూపించాయి. సెన్సెక్స్ 8 పాయింట్ల లాభంతో 41,682 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 12 పాయింట్లు పెరిగి 12,272 వద్ద ముగిశాయి. ఇక వారం పరంగా చూస్తే, ఆల్‌టైమ్ హై రికార్డులు హోరెత్తిపోయాయి. మొత్తం 5 ట్రేడింగ్ రోజుల్లో 4 రోజులు సెన్సెక్స్, నిఫ్టీలు కొత్త శిఖరాలకు ఎగబాకాయి. ఈ వారంలో సెన్సెక్స్ 672 పాయింట్లు, నిఫ్టీ 185 పాయింట్ల మేర పెరిగాయి. బడ్జెట్‌లో మరిన్ని ఉద్దీపన చర్యలు ఉంటాయన్న అంచనాలతో ఆరంభంలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. లిక్విడిటీ కొరతను పూడ్చటానికి ఆర్‌బీఐ ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా రూ.10,000 కోట్ల బాండ్ల క్రయ, విక్రయాలను నిర్వహించడం, ట్రెజరీ లాభాలు పెరుగుతాయనే అంచనాలతో ప్రభుత్వ రంగ షేర్లు పెరగడం, క్రిస్మస్ సెలవులకు ముందు ప్రపంచ మార్కెట్లు 'బుల్లిష్ మూడ్'లో ఉండటం సానుకూల ప్రభావం చూపించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, యూరప్ మార్కెట్లు లాభపడ్డాయి.

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 2,039 |
| ఎన్ఎస్ఈ | 41,791 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 7,32,177 |
| ఎఫ్ఐఐ | 339 |
| డీఐఐ | - 285 |

### 2.2 రెట్లు సబ్‌స్క్రైబయిన ప్రిన్స్ పైప్స్ ఐపీఓ

ప్రిన్స్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ కంపెనీ ఐపీఓ 2.2 రెట్లు సబ్‌స్క్రైబయింది. శుక్రవారం ముగిసిన ఈ ఐపీఓ ప్రైస్‌బాండ్ రూ.177–178గా ఉంది. ఈ నెల 31న ఈ కంపెనీ షేర్లు స్టాక్ మార్కెట్లో లిస్టవుతాయి.

## మైండ్‌స్పేస్‌కు అవార్డు



**హైదరాబాద్:** ఆఫీస్ స్పేసెస్ రంగంలో ఉన్న కె రహేజా కార్పొరేషన్‌కు చెందిన మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్‌కు బ్రిటీష్ సేఫ్టీ కౌన్సిల్ నుంచి స్వోర్డ్ ఆఫ్ హానర్ అవార్డులు లభించాయి. అవార్డు అందుకున్న మూడు పార్కుల్లో మైండ్‌స్పేస్ మాదాపూర్ కూడా ఒకటి. అత్యున్నత ఆరోగ్య, భద్రత నిర్వహణలో సంస్థకు ఈ గౌరవం దక్కింది.

## రూ.1,956 కోట్లు సమీకరించిన లెన్స్‌కార్ట్

**న్యూఢిల్లీ:** కళ్లజోళ్ల రిటైల్ కంపెనీ లెన్స్‌కార్ట్ భారీగా నిధులు సమీకరించింది. సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ నుంచి రూ.1,956 కోట్లు(27.5 కోట్ల డాలర్లు) సమీకరించామని లెన్స్‌కార్ట్ సీఈఓ పీయుష్ బన్సాల్ తెలిపారు. సాంకేతిక సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడానికి, సరఫరా సంబంధిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పటిష్టం చేసుకోవడానికి ఈ నిధులను వినియోగిస్తామని పేర్కొన్నారు.

## ఎస్‌బీఐ కార్డ్స్ కమర్షియల్ పేపర్ లిస్టింగ్!

### మరో మూడు కంపెనీలు కూడా



**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ కంపెనీ తన కమర్షియల్ పేపర్స్(సీపీ)ను బీఎస్ఈ బాండ్స్ ప్లాట్‌ఫార్మ్‌పై లిస్టింగ్ చేయనున్నది. ఈ కంపెనీతో పాటు మరో మూడు కంపెనీలు కూడా తమ సీపీలను లిస్టింగ్ చేయాలని దరఖాస్తు చేశాయని బీఎస్ఈ వెల్లడించింది. ఐసీఐసీఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్, ఆదిత్య బిర్లా మనీలు ఈ జాబితాలో ఉన్నాయని తెలిపింది. ఈ కంపెనీల సీపీలను ఈ నెల 23న(సోమవారం) లిస్టింగ్ చేస్తామని వివరించింది. ఇప్పటివరకూ 17 కంపెనీలు కమర్షియల్ పేపర్స్‌ను జారీ చేయడం ద్వారా రూ.18,885 కోట్లు సమీకరించాయని పేర్కొంది.

## 1.7 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయిన భారత్ బాండ్ ఈటీఎఫ్

**న్యూఢిల్లీ:** భారత దేశపు తొలి కార్పొరేట్ బాండ్ ఈటీఎఫ్, భారత్ బాండ్ ఈటీఎఫ్(ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్) ఇష్యూ 1.7 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. శుక్రవారం ముగిసిన ఈ ఇష్యూ ద్వారా రూ.7,000 కోట్లు సమీకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా రూ.12,000 కోట్ల మేర బిడ్‌లు వచ్చాయి. ఈ బాండ్ యూనిట్ల మెచ్యూరిటీ 3, 10 ఏళ్లుగా ఉంది.

### బులియన్ రూ.లలో



| | | | |
|---|---|---|---|
| **హైదరాబాద్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,180 | | |
| బంగారం (22 క్యారెట్లు) | 36,360 | | |
| వెండి (కిలో) | 47,900 | | |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,850 | ▲ | 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,020 | ▲ | 100 |
| వెండి (కిలో) | 45,700 | ▲ | 300 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,080 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,350 | | 0 |
| వెండి (కిలో) | 45,500 | | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,340 | ▲ | 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,360 | ▲ | 70 |
| వెండి (కిలో) | 45,600 | ▲ | 300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 60.20 (రాత్రి 11.30కు) | \$61.18 (గురువారం ముగింపు) |
| బ్రెంట్ | 65.94 (రాత్రి 11.30కు) | \$66.54 (గురువారం ముగింపు) |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ –నెక్ /100కు రూ.లలో) 21-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470–00 |
| చిత్తూరు | 448–00 |
| వరంగల్ | 418–00 |
| విజయవాడ | 452–00 |
| గోదావరి | 452–00 |
| **20–12–2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 415–00 |

## ఐదేళ్లలో గ్రామీణ పరిశ్రమల టర్నోవర్ 2లక్షల కోట్లు

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ:** ఖాదీ, గ్రామీణ పరిశ్రమల వ్యాపార ఆదాయాన్ని ప్రస్తుతమున్న రూ.75,000 కోట్ల నుంచి వచ్చే ఐదేళ్ల కాలంలో రూ.2 లక్షల కోట్లకు పెంచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అంతర్జాతీయ వాణిజ్యంలో తన వాటాను 10 శాతానికి పెంచుకోవాలని ఈ పరిశ్రమకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వాణిజ్యంలో 17% వాటా కలిగిన చైనా.. పెరిగిన వ్యయాలతో సతమతం అవుతుండడంతో, ఈ అవకాశాలను అందిపుచ్చుకుని విస్తరించాలని సూచించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఒక సమావేశంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల (రూ.350 లక్షల కోట్లు సుమారు) స్థాయికి తీసుకెళ్లే సామర్థ్యాలు మౌలిక రంగం, ఎంఎస్ఎంఈలకు ఉందన్నారు. ''అంతర్జాతీయ ఎగుమతుల్లో చైనా వాటా 17%. మన వాటా 2.6 శాతమే. దీన్ని 8–10 శాతానికి తీసుకెళ్లగల అవకాశం మన ముందున్నది. ముఖ్యంగా చైనా పెరిగిన వ్యయాలతో ఇబ్బంది పడుతున్న తరుణంలో మన వాటా పెంచుకోవడంపై దృష్టి పెట్టాలి'' అని మంత్రి సూచించారు. దేశంలో అపార వనరులు ఉండి, స్వీయ ఉత్పత్తికి అవకాశాలు ఉన్నా కానీ.. బొగ్గు, పేపర్‌ను దిగుమతి చేసుకోవడం బాధాకరమన్నారు.

## సైబర్ పాలసీలకు పెరుగుతున్న ఆదరణ

### ఐసీఐసీఐ లాంబార్డ్ ఈడీ అలోక్ అగర్వాల్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** సైబర్ దాడుల ముప్పు తీవ్రమవుతున్న నేపథ్యంలో సైబర్ లయబిలిటీ బీమా పాలసీలకు క్రమంగా ఆదరణ పెరుగుతోందని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలోక్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం ఈ మార్కెట్ సుమారు రూ. 30 కోట్లుగా ఉందని.. వచ్చే ఏడాది వ్యవధిలో రూ. 75 కోట్లకు చేరవచ్చన్న అంచనాలు ఉన్నాయని ఆయన వివరించారు. తాము త్వరలోనే వ్యక్తిగత సైబర్ పాలసీని కూడా ప్రవేశపెట్టబోతున్నట్లు అగర్వాల్ శుక్రవారమిక్కడ విలేకరులకు చెప్పారు. దీనికి ఇటీవలే బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ అనుమతులు లభించాయన్నారు. మరోవైపు, వాహన విక్రయాలు మందగించడం .. మోటార్ పాలసీల విభాగంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని అగర్వాల్ తెలిపారు. అయితే, బీమా పాలసీ నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానాలు విధించేలా మోటార్ వాహనాల చట్టంలో తెచ్చిన సవరణలు కాస్త ఊతమిచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి టెక్నాలజీలను ఉపయోగించి, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని అగర్వాల్ వివరించారు.

# రుణ వృద్ధిలేదు... వ్యాపారాలూ బాగోలేదు!

- భారత్ ఆర్థిక వ్యవస్థపై ఫిచ్ తాజా నివేదిక
- వృద్ధి రేటు అంచనా 5.6 శాతం నుంచి 4.6 శాతానికి కోత
- వినియోగ విశ్వాసం సన్నగిల్లినట్లు విశ్లేషణ




**న్యూఢిల్లీ:** భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు అంచనాలను అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజ సంస్థ– ఫిచ్ కుదించింది. 2019 (ఏప్రిల్)–2020 (మార్చి) ఆర్థిక సంవత్సరంలో కేవలం 4.6 శాతం వృద్ధి రేటు మాత్రమే నమోదవుతుందని తాజాగా అంచనావేసింది. ఇంతక్రితం ఈ అంచనా 5.6 %. బ్యాంకింగ్ రుణ వృద్ధి మందగమనం, పుంజుకోని పారిశ్రామిక, వ్యాపార రంగాలు, వినియోగ విశ్వాసం దెబ్బతినడం వంటి కారణాలను ఫిచ్ తన నివేదికలో ఉటంకించింది. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- భారత్ రేటింగ్‌ను స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ–'గానే కొనసాగిస్తున్నాం. మధ్యకాలికంగా చూస్తే, వృద్ధి అవుట్‌లుక్ పటిష్టంగా ఉండడమే దీనికి కారణం. విదేశీ మారకపు నిల్వల స్థాయి పటిష్టంగా ఉండడం సానుకూల అంశం.
- ఆర్‌బీఐ (5 శాతం), మూడీస్ (4.9 శాతం), ఏడీబీ (5.1శాతం) కన్నా తాజాగా ఫిచ్ అంచనాలు తక్కువగా ఉండడం గమనార్హం.
- 2020–21లో జీడీపీ క్రమంగా పుంజుకునే అవకాశం ఉంది. ఈ రేటు 5.6 శాతంగా నమోదుకావచ్చు. 2021–22లో వృద్ధి రేటు మరింత పెరిగి 6.5 శాతానికి చేరే వీలుంది. ఆర్‌బీఐ తీసుకున్న ద్రవ్య పరపతి విధాన చర్యలు (వరుసగా ఐదు ద్వైమాసిక సమావేశంలో 135 శాతం రెపో కోత. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు రెపో ప్రస్తుతం 5.15 శాతం), పన్నురేటు తగ్గించడంసహా కేంద్రం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు వృద్ధిరేటు పురోగతికి దోహదపడే వీలుంది.
- 2019–20 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.3 శాతంగా ఉండాలన్నది లక్ష్యమయినా, ఇది కొంత అదుపు తప్పే అవకాశం ఉంది. 2019–20లో మొత్తంలో ద్రవ్యలోటు పరిమాణం రూ.7.03 లక్షల కోట్లుగా ఉండాలన్నది (జీడీపీలో 3.3 శాతం) బడ్జెట్ లక్ష్యం. కానీ అక్టోబర్ ముగిసే నాటికే ఈ మొత్తం రూ.7,20,445 కోట్లకు చేరింది. అంటే బడ్జెట్ అంచనాల్లో 102.4 శాతానికి చేరిందన్నమాట.
- 2020లో ఆర్‌బీఐ మరో 65 బేసిస్ పాయింట్ల రేటు కోత నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇదే జరిగితే రెపో రేటు 4.5 శాతానికి వస్తుంది.
- నవంబర్‌లో ధరల పెరుగుదల రేటు 5.5 శాతంగా ఉంది.

**రాష్ట్రీయం**



హన్మకొండలో లక్ష్మీనారాయణ కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో రామానుజ జీయర్‌స్వామి)

## మానవాళి శ్రేయస్సుకే యాగాలు

### శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి

**హన్మకొండ కల్చరల్:** యాగాలు నిర్వహించడం మానవాళి శ్రేయస్సు కోసమేనని భాష్యకార సిద్ధాంత పీఠం అధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి ఉద్బోధించారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో జరుగుతున్న అతిరుద్ర యాగంలో భాగంగా శుక్రవారం శృంగేరి పీఠం వేద పండితులు విరివింటి ఫణిశశాంక్ శర్మ, వ్యాసోజుల గోపీకృష్ణ శర్మ, ఎన్.జి.నరసింహామూర్తి పాల్గొని చండీ, సుదర్శన యాగానికి మహాపూర్ణాహుతి నిర్వహించారు. రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో లక్ష్మీనారాయణ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

## చెట్లు నరికినందుకు రూ.45 వేలు ఫైన్

**సాక్షి, హైదరాబాద్/సిద్దిపేటజోన్:** సిద్దిపేట పట్టణంలో నాలుగు చెట్లను నరికేసినందుకు అధికారులు రూ.45 వేల జరిమానా విధించారు. పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో కొత్త బస్టాండ్ వద్ద ఉన్న సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారు తమ హోర్డింగ్ ఏర్పాటు చేశారు. అయితే అది అందరికీ కనిపించాలని డివైడర్‌పైన ఉన్న చెట్లను నరికి వేశారు. శుక్రవారం తెల్లవారు జామున 3.45 నిమిషాలకు నాలుగు చెట్లను నరికిన వారిని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఐలయ్య సీసీ కెమెరాల సహాయంతో గుర్తించారు. మునిసిపల్ చైర్మన్ రాజనర్సు, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఆయన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రకటనల కాంట్రాక్టరుకు రూ.45 వేల జరిమానా విధించారు. సిద్దిపేటలో ఎవరైనా చెట్లను నరికినా, హరితహారం మొక్కలను తొలగించినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

## పునర్వ్యవస్థీకరణ దిశగా తొలి అడుగు

### నేడు ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ల వర్క్‌షాప్ ప్రాజెక్టుల నిర్వహణపై ప్రధానంగా చర్చ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో సాగునీటి శాఖ పునర్వ్యవస్థీకరణ దిశగా తొలి అడుగు పడనుంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు శనివారం ఉదయం 11 గంటల నుంచి 5 గంటల వరకు ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆడిటోరియంలో శాఖ ఇంజనీర్లు వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌కు ఈఎన్‌సీలు, ఈఈలు అన్ని స్థాయిల ఇంజనీర్లు పాల్గొననున్నారు. శాఖలో చేయాల్సిన మార్పులు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చించడంతోపాటుగా శాఖ పరిధిలో మరింతమంది ఈఎన్‌సీల సంఖ్య పెంచడం, వారికి సర్కిళ్ల వారీగా బాధ్యతలు కట్టబెట్టి పనిభారాన్ని వికేంద్రీకరణ చేయడం, మేజర్,మీడియం,మైనర్,ఐడీసీ విభాగాలను ఒకే గూటికిందికి తేవడం వంటి అంశాలను కూడా చర్చించనున్నారు. రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తి కావస్తుండటం, వాటి కింద పెద్దఎత్తున ఆయకట్టు సాగులోకి వస్తున్న నేపథ్యంలో పంపులు, మోటార్లు, కాల్వలు, గేట్లు, సబ్‌స్టేషన్ల ఆపరేషన్ మెయింటనెన్స్ (ఓఅండ్‌ఎం)కు ప్రత్యేకంగా ఏ విధమైన విభాగాన్ని ఏర్పాటు చేయాలి, దానికి బడ్జెట్ కేటాయింపులు, సిబ్బంది నియామకాలు ఎలా ఉండాలన్న దానిపై కూడా చర్చించనున్నారు.

# యాదాద్రి క్యూలైన్ల డిజైన్ ఖరారు



**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసే క్యూలైన్ల డిజైన్‌ను సీఎం కేసీఆర్ ఖరారు చేసినట్లు ఆర్కిటెక్టు ఆనందసాయి తెలిపారు. మూడు క్యూలైన్ల డిజైన్లను సీఎం పరిశీలించగా.. అందులో ఒక డిజైన్‌కు ఇటీవల ఆలయాన్ని సందర్శించిన సమయంలో ఓకే చెప్పినట్లు ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించిన నమూనాను ఆనందసాయి శుక్రవారం యాదాద్రిలో విడుదల చేశారు. లక్నో నుంచి క్యూలైన్లు తయారు చేసే కార్మికులను త్వరలోనే యాదాద్రికి రప్పించనున్నట్లు తెలుస్తోంది. క్యూలైన్లు ఎలా ఉండాలన్నదానిపై లక్నోకు చెందిన టెక్నీషియన్లు ఇటీవలే యాదాద్రికి వచ్చి పరిశీలించి వెళ్లారు. కొత్తగా నిర్మించే ప్రసాదం కౌంటర్ నుంచి బ్రహ్మోత్సవ మండపం మీదుగా తూర్పు రాజగోపురం ముందు నుంచి బంగారు రంగులో మెరిసే క్యూలైన్లు నిర్మించనున్నట్లు తెలుస్తోంది.

## డిశ్చార్జ్ పిటిషన్ కొట్టివేత

### సమత కేసులో 23 నుంచి 31 వరకు సాక్షుల విచారణ

**ఆదిలాబాద్‌టౌన్:** సమత కేసులో నిందితులకు ఎదురుదెబ్బ తగిలింది. డిశ్చార్జ్ పిటిషన్‌ను శుక్రవారం కోర్టు కొట్టేసింది. ఈ సందర్భంగా డిశ్చార్జ్ పిటిషన్‌పై నిందితుల తరపు న్యాయవాది రహీం, పీపీ రమణారెడ్డి ఇద్దరు తమ తమ వాదనలు వినిపించారు. చార్జ్ ఫ్రేమ్ చేసిన తర్వాత డిశ్చార్జ్ పిటిషన్ వేయడం నిబంధనలకు వ్యతిరేకమని, గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను పీపీ రమణారెడ్డి వాదనలు వినిపించారు. దీంతో న్యాయవాది రహీం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. సోమవారం నుంచి షెడ్యూల్ ప్రారంభించాలని ఆదేశించింది. ఈనెల 23 నుంచి 31వ తేదీ వరకు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించింది. పోలీసులు చార్జ్‌షీట్‌లో పొందుపర్చిన 44 మంది సాక్షులను రోజువారీగా కోర్టు విచారణ చేపట్టనుంది. సెలవు రోజుల్లో మినహా మిగతా రోజుల్లో విచారణ జరగనుంది.

## మేడారం జాతరలో అప్‌డేట్ సమాచారం

### ఎఫ్ఎం, టీవీ చానల్స్ ద్వారా అందిస్తాం: ములుగు కలెక్టర్

**ఏటూరునాగారం:** మేడారం జాతరలో భక్తులకు సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ములుగు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. భక్తులు ఏ దారిలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయనే అప్‌డేట్ సమాచారాన్ని ఎఫ్ఎం రేడియో, టీవీ చానల్స్ ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అలాగే వంద ఎల్ఈడీలతో ప్రదర్శించనున్నట్లు వివరించారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

### మంత్రి జగదీశ్‌రెడ్డి • సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

**నాగార్జునసాగర్:** నాగార్జునసాగర్ ప్రాజెక్టునుంచి విడుదలయ్యే సాగునీటిని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. రబీ సీజన్ పంటల కోసం సాగర్ ఎడమకాల్వకు శుక్రవారం ఆయన మిర్యాలగూడ, నల్లగొండ, కోదాడ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్‌లతో కలసి నీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు కురవక కృష్ణా పరీవాహక ప్రాంతం నుంచి వరదలు ఆలస్యమై జలాశయాల్లోకి తగిన నీరు చేరడం లేదన్నారు. అందుకే ఈ సీజన్‌లో నీటిని పొదుపుగా వాడుకుంటే జలాశయంలో నీటి నిల్వలుంటాయన్నారు. మిగిలిన నీటిని వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు మందస్తుగా విడుదల చేసే అవకాశాలుంటాయన్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసి అధిక దిగుబడులు సాధించేందుకు అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తామన్నారు.

# 'కాళేశ్వరం'లో ఉగ్ర కలకలం!

### నలుగురిని హతమార్చిన ఆక్టోపస్ బృందం?

- అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల వద్ద ఉత్కంఠ
- చివరకు మాక్‌డ్రిల్ అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న జనం



ఆక్టోపస్ బృందం సభ్యులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు



అన్నారం బ్యారేజీలో కాల్పులు జరుపుతున్న ఆక్టోపస్ బృందం సభ్యులు

**కాళేశ్వరం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో శుక్రవారం ఉగ్రవాదులు చొరబడ్డారన్న వార్త కలకలం రేపింది! ఆక్టోపస్ బృందం ఉరుకులు పరుగులు పెట్టింది. 46 మందితో ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొంది. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో కలసి బ్యారేజీని ఇరువైపులా చుట్టుముట్టింది. అన్నారంలోని సరస్వతి, మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీ ప్రాంతాల్లో ఆక్టోపస్ బృందాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు అక్కడికక్కడే మృతి చెందారు. ఒక ఆక్టోపస్ సభ్యుడు గాయపడగా.. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. తుపాకులు, బాంబుల మోతతో అన్నారం, మేడిగడ్డ పరిసర పొలాల్లోని రైతులు, ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏమి జరుగుతుందో అర్థం కాక భయాందోళనకు గురయ్యారు. మావోయిస్టులు వచ్చారని.. లేదు ఉగ్రవాదులు చొరబడ్డారేమోనని ఆందోళన చెందారు. ఆపరేషన్ నేపథ్యంలో పోలీసులు రెండు బ్యారేజీల మీదా రెండు గంటల పాటు రాకపోకలు నిలిపివేశారు. అయితే.. ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహిస్తోందని అసలు విషయం తెలుసుకున్న జనం ఊపిరి పీల్చుకున్నారు.

**రక్షణ చర్యలపై సూచనలు**

బ్యారేజీలకు ఉగ్రవాదులు, తీవ్రవాదులు, నక్సలైట్ల నుంచి ముప్పు ఏర్పడినప్పుడు ఎదుర్కొని బ్యారేజీలను ఎలా రక్షించాలి.. వారిని ఎలా హతమార్చాలి.. గాయపడిన వారికి ప్రథమ చికిత్స ఎలా అందించాలి.. అనే అంశాలపై అన్నారం బ్యారేజీ వద్ద మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు, మేడిగడ్డ వద్ద సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు మాక్ డ్రిల్ నిర్వహించారు. దీంతో రెండు బ్యారేజీలపైనా రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆక్టోపస్ బృందాల వెంట కాటారం డీఎస్పీ బోనాల కిషన్, మహదేవపూర్ సీఐ అంబటి నర్సయ్య, ఎస్సైలు శ్రీనివాస్, సత్యనారాయణ, శ్యాంరాజ్‌లతో పాటు సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

## పరకాల కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు

- కొత్త కమిషనర్‌గా ఎల్.రాజాకు బాధ్యతలు
- ఎన్నికల డాక్యుమెంటేషన్ జాప్యంతో అధికారుల సీరియస్



బి.శ్రీనివాస్

**పరకాల:** వార్డుల పునర్విభజన డాక్యుమెంటేషన్ అందించడంలో జరిగిన జాప్యంపై పరకాల పురపాలక సంఘం కమిషనర్ బి.శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కొత్త కమిషనర్‌గా పురపాలక శాఖ ఆడిట్ విభాగం సీనియర్ అధికారి ఎల్. రాజాకు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం సీడీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మరికొద్ది రోజుల్లో మునిసిపాలిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న దృష్ట్యా ఎన్నికల నిర్వహణకు ఉన్నతాధికారులు వేగవంతమైన చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 17న అందించిన వార్డుల పునర్విభజన, మ్యాప్ వంటి డాక్యుమెంటేషన్‌లో జరిగిన పొరపాట్లపై వివరణ కోరేందుకు సీడీఎంఏ ప్రయత్నించగా కమిషనర్ అందుబాటులో లేకపోవడం.. పైగా ఫోన్ చేసినా స్పందించకపోవడాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. మార్పులు చేసిన డాక్యుమెంటేషన్‌ను మరుసటి రోజు కమిషనర్ శ్రీనివాస్ కార్యాలయంలో అందజేయకుండా కింది స్థాయి అధికారులతో పంపడాన్ని క్రమశిక్షణ రాహిత్యంగా పరిగణిస్తూ ఆయనను విధుల నుంచి తొలగిస్తూ సీడీఎంఏ అధికారి శ్రీదేవి ఆదేశాలు జారీ చేశారు.

## ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శంకర్

**కేయూ క్యాంపస్:** వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని కాకతీయ యూనివర్సిటీ వేదికగా మూడు రోజుల నుంచి జరుగుతున్న ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శంకర్ (వరంగల్), కార్యదర్శిగా అంబాల కిరణ్ (కేయూ, వరంగల్) ఉపాధ్యక్షులుగా డాక్టర్ జాన్‌రెడ్డి (హైదరాబాద్), డాక్టర్ అనల్‌దాస్ మురళి (జగిత్యాల), డాక్టర్ సూర్యకుమార్ (బోధన్), డాక్టర్ రాజేందర్(కేయూ, వరంగల్), సంయుక్త కార్యదర్శులుగా అనిత (కోఠి ఉమెన్స్ కాలేజీ), శ్రీధర్ (పాలమూరు యూనివర్సిటీ, మహబూబ్‌నగర్), జీవన్ (సికింద్రాబాద్), వేణు(వరంగల్), సుమన్ (ఓయూ), అనిల్ (నిజామాబాద్), కోశాధికారిగా డాక్టర్ లింబాద్రి, ఆఫీస్ సెక్రటరీగా గిరీష్, రాష్ట్ర సంఘటన మంత్రిగా జమ్మలపూర్ నిరంజన్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

# భారత నావికులకు వలపు వల

## పాకిస్తాన్‌కు భారత నౌకాదళ రహస్య సమాచారం చేరవేత

### ఫేస్‌బుక్ ద్వారా నావికులకు యువతులతో హనీట్రాప్

ఈ ఏడాది జనవరిలో.. ఫేస్‌బుక్‌లో అనితా చోప్రా అనే పాక్ యువతి వేసిన వలలో ఆర్మీ జవాన్లు చిక్కుకుని మన సైనిక సమాచారాన్ని శత్రు దేశానికి చేరవేసిన ఘటన ప్రకంపనలు సృష్టించింది. దాయాది దేశమైన పాకిస్తాన్ భారత నౌకాదళ సమాచారాన్ని దోచుకున్న వైనం తాజాగా వెలుగు చూసింది. భారత నావికులకు ఫేస్‌బుక్ ద్వారా అమ్మాయిల్ని పరిచయం చేసి.. వారితో ఏకాంతంగా ఉన్నప్పటి సెక్స్ వీడియోలు తీసిన పాక్ గూఢచారి విభాగం.. వాటితో బెదిరింపులకు పాల్పడి.. నౌకాదళ సమాచారం సేకరిస్తూ దేశద్రోహ చర్యలకు పాల్పడింది. దీనిపై ఉప్పందడంతో నిఘా వర్గాలు నెల రోజుల పాటు నిర్వహించిన 'ఆపరేషన్ డాల్ఫిన్ నోస్'లో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఏడుగురు ఇండియన్ నేవీ సెయిలర్స్ (నావికులు)తో పాటు ఒక హవాలా ఆపరేటర్‌ను అరెస్ట్ చేశారు. – సాక్షి, విశాఖపట్నం/విజయవాడ



### ఏడాది నుంచి సమాచారం

ఈ సెయిలర్స్ 2018 అక్టోబర్ నుంచి పాకిస్తాన్‌కు సమాచారం అందించడం ప్రారంభించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ముఖ్యంగా యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు శత్రు దేశానికి చేరవేసినట్లు సమాచారం. ఏ యుద్ధ నౌక ఎక్కడ ఉంది, వివిధ జలాంతర్గాముల ప్రెజెంట్ స్టేటస్ ఏమిటి.. తదితర కీలక సమాచారం సెయిలర్లు దాయాది దేశానికి చేరవేశారు. సమాచారం ఇచ్చిన ప్రతి నెలా వారికి పాక్ ఏజెంట్లు హవాలా రూపంలో డబ్బులు అందజేసేవారు. ఇందుకోసం ఒక హవాలా ఆపరేటర్‌ను సైతం నియమించారు. ఒకరికి తెలియకుండా మరొకరి ద్వారా ఈ కార్యకలాపాలకు పాల్పడ్డారు.

### 'ఆపరేషన్ డాల్ఫిన్ నోస్'తో బట్టబయలు

భారత నౌకాదళంలో కొందరు దేశద్రోహులున్నారని అధికారిక వర్గాలకు రహస్య సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన నౌకాదళ నిఘా వర్గాలు నాలుగు నెలల క్రితం ఓ సెయిలర్ ఫోన్ మాట్లాడుతుండగా.. రహస్య సమాచారాన్ని చేరవేస్తున్నట్లు గుర్తించాయి. దీనిపై మరింత లోతైన దర్యాప్తు చేపట్టాయి. మిగిలిన వారిపైనా నిఘా పెంచగా.. ఏడుగురు నావికులు వేర్వేరు మహిళలతో మాట్లాడుతున్నట్లు గుర్తించారు. వారందరి ఫేస్‌బుక్ సంభాషణల్నీ గమనించారు. దీంతో ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ), ఏపీ ఇంటెలిజెన్స్, సెంట్రల్ ఇంటెలిజెన్స్, నేవీ ఇంటెలిజెన్స్ సంయుక్తంగా 'ఆపరేషన్ డాల్ఫిన్ నోస్' మొదలుపెట్టాయి. హవాలా ద్వారా డబ్బులు తీసుకుంటున్న సమయంలో నావికుల్ని వివిధ ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఏడుగురు నేవీ సెయిలర్స్‌తో పాటు ఒక హవాలా ఆపరేటర్‌ను శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరిని గూఢచర్యం కేసులో అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కర్ణాటకకు చెందిన ఇద్దరు, ముంబైకి చెందిన ఇద్దరు, విశాఖకు చెందిన ముగ్గురు నౌకాదళ సిబ్బందితో పాటు ముంబైకి చెందిన ఓ హవాలా ఏజెంట్ ఉన్నారు. నిందితుల్ని విజయవాడలోని ఎన్ఐఏ కోర్టుకు తరలించగా.. జనవరి 3 వరకు రిమాండ్ విధించినట్లు తెలుస్తోంది. వీరి నుంచి పెద్ద మొత్తంలో హవాలా సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

### హనీ ట్రాప్ ఇలా!

నౌకాదళ సమాచారాన్ని తెలుసుకునేందుకు శత్రు దేశమైన పాకిస్తాన్ కుట్ర పన్నింది. ఇందుకు 2017లో భారత నావికులను లక్ష్యంగా చేసుకుంది. ఫేస్‌బుక్‌ను ఉపయోగించుకుని కొందరు యువతులతో హనీ ట్రాప్ (వలపు వల) వేసింది. ఇందులో భాగంగా కొందరు యువతులు ఫేస్‌బుక్ ద్వారా నావికులతో పరిచయం పెంచుకున్నారు. తాము వ్యాపారవేత్తలమంటూ ఆ యువతులు నావికుల్ని నమ్మించి వారితో శారీరక సంబంధం వరకు వెళ్లారు. నావికులతో ఏకాంతంగా గడుపుతున్న సమయంలో పాక్ ఏజెంట్లు ఆ దృశ్యాలను రహస్యంగా వీడియోలు చిత్రీకరించారు. వాటిని చూపి పాక్ గూఢచర్య విభాగం భారత నావికుల్ని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టింది. భారత నౌకాదళ సమాచారం తమకు చేరవేయాలని, ఇందుకు ప్రతిఫలంగా హవాలా ద్వారా సొమ్ము కూడా ఇస్తామని ఆశ చూపడంతో నేవీ సెయిలర్స్ వారికి లొంగిపోయారు.




## ఫిల్మ్‌నగర్ అక్రమాలను తేల్చండి

### ఏసీబీ విచారణ కోరుతూ గవర్నర్‌కు ఎఫ్‌జీజీ ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీలో చోటుచేసుకున్న భారీ అక్రమాలపై ఏసీబీ విచారణ చేయించి దోషులను శిక్షించటంతోపాటు అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి సమాచార హక్కు చట్టం ద్వారా తాము సేకరించిన వివరాలను వెల్లడించారు. సొసైటీ నిబంధనల మేరకు సినిమా రంగంలో పనిచేస్తున్న వారికే సభ్యత్వం ఇచ్చి నివాసం లేని భర్త లేదా భార్యల్లో ఒక్కరికే ప్లాట్ కేటాయించాల్సి ఉందన్నారు. సొసైటీ నిర్వాహకులు ఇవేమీ పట్టించుకోలేదని, సినీ నటుడు మురళీమోహన్ ఒక్కరే బినామీ పేర్లతో 7 ప్లాట్లను అలాట్ చేయించుకుని ఇతరులకు విక్రయించారని తెలిపారు. సొసైటీ కార్యదర్శి సూర్యనారాయణ తనతోపాటు తన భార్య పేరుపై కూడా ప్లాట్ అలాట్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను విచారించిన జస్టిస్ రాధాకృష్ణారావు, అదనపు రిజిస్ట్రార్ కిరణ్మయి కమిటీలు నివేదికలు ఇచ్చినా అమలు చేయలేకపోయారన్నారు.

## అశ్వత్థామరెడ్డి సెలవు వినతి తిరస్కృతి



సాక్షి, హైదరాబాద్: సమ్మె ముగిసిన అనంతరం విధుల్లో చేరిన ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి.. వెంటనే 6 నెలలు సెలవు కావాలంటూ దాఖలు చేసిన అభ్యర్థనను ఆర్టీసీ తిరస్కరించింది. ప్రస్తుతం ఆర్టీసీ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున, సంస్థ ఉన్నతికి సిబ్బంది అంతా శ్రమించాల్సిన అవసరం ఉందని, ఈ సమయంలో సెలవు మంజూరు చేయలేమంటూ అధికారులు స్పష్టం చేశారు. వెంటనే విధుల్లో చేరాలంటూ సూచించారు. ఇక ఆర్టీసీలో పనిచేస్తున్న క్రిస్టియన్ ఉద్యోగులకు క్రిస్మస్ పండుగ సందర్భంగా అడ్వాన్స్ ఇవ్వనున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. అర్హులైన ఉద్యోగులకు డిసెంబర్ 24 లోగా చెల్లించనున్నట్లు వెల్లడించింది.

## ఏడాది పొడవునా 'ఆపరేషన్ స్మైల్ : డీజీపీ



సాక్షి, హైదరాబాద్: ఏడాది పొడవునా.. బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకు పనిచేయాలని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న 'ఆపరేషన్ స్మైల్'కార్యక్రమం సన్నాహక సమావేశం శుక్రవారం డీజీపీ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో స్టేట్ లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి జగదీశ్వర్, ఏడీజీ (లా అండ్ ఆర్డర్) జితేందర్, ఐజీ స్వాతి లక్రా, సీఐడీ ఎస్పీ సుమతి పాల్గొన్నారు. చిన్నారులను వెట్టి చాకిరీ నుంచి విముక్తి చేసి, వారిని తల్లిదండ్రులకు వద్దకు చేర్చితే దక్కే తృప్తి వెలకట్టలేనిదని డీజీపీ అన్నారు. పిల్లలను అక్రమ రవాణా చేసే వారు జనవరి, జూన్ మాసాల్లో అప్రమత్తంగా ఉంటారని, అందుకే, ఏడాది మొత్తం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలను రక్షించడంతోనే సరిపోదని, వారికి మంచి భవిష్యత్తు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 33 జిల్లాల నుంచి వచ్చిన పలువురు పోలీసు అధికారులకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు.

## ఇంధన పొదుపులో ఆర్టీసీకి రెండు అవార్డులు



సాక్షి, హైదరాబాద్: ఇంధన పొదుపులో చురుగ్గా వ్యవహరించిన తెలంగాణ ఆర్టీసీలోని రెండు డిపోలకు తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్‌కో) పురస్కారాలు దక్కాయి. కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ అధీనంలోని బ్యూరో ఆఫ్ ఎఫీషియెన్సీతో కలసి టి.ఎస్.రెడ్‌కో శుక్రవారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ఆర్టీసీ అధికారులు బంగారు, వెండి పురస్కారాలు అందుకున్నారు. ఇంధన పొదుపులో మెరుగ్గా వ్యవహరిస్తున్న సంస్థలకు ప్రతి యేటా పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. రవాణా రంగానికి సంబంధించి ఆర్టీసీకి పురస్కారాలు దక్కాయి. 2018–19 సంవత్సరానికి గానూ నల్లగొండ డిపో 106 బస్సులు, 171.51లక్షల కిలోమీటర్ల ఆపరేషన్‌తో 1.65లక్షల లీటర్ల ఇంధనం ఆదా చేసింది. తద్వారా రూ.1.09కోట్ల ఖర్చు తగ్గింది. ఇందుకు గానూ ఇంధన పొదుపులో నల్లగొండ డిపో టాప్‌గా నిలిచి బంగారు పతకం దక్కించుకుంది. కల్వకుర్తి డిపోలో 77 బస్సులతో 98.71లక్షల కిలోమీటర్లు ఆపరేట్ చేసి, 1.37లక్షల లీటర్ల ఇంధనం ఆదాతో రూ.91.45 లక్షల ఖర్చు తగ్గింది. ఆ డిపో వెండి పతకం సాధించింది. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) సి.వినోద్ కుమార్, సీఎంఈ టి.రఘునాథరావు, నల్లగొండ రీజినల్ మేనేజర్ వెంకన్న, నల్లగొండ, కల్వకుర్తి డిపో మేనేజర్లు సురేశ్, సుధాకర్, పలువురు మెకానిక్‌లు, డ్రైవర్‌లు పురస్కార స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మను అధికారులు కలిసి ఆయనకు అవార్డులను చూపించారు. రెండు పురస్కారాలు రావటంతో విశేష చొరవ చూపిన అధికారులను ఎండీ అభినందించారు.

## ఐఎస్ఎస్ఏఆర్ జాయింట్ సెక్రటరీగా రాంసింగ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ యానిమల్ రీప్రొడక్షన్ (ఐఎస్ఎస్ఏఆర్) అధ్యక్షుడిగా కర్ణాటకకు చెందిన డా.వి.చంద్రశేఖర్‌మూర్తి, ఉపాధ్యక్షులుగా బిహార్‌కు చెందిన డా.జేకే ప్రసాద్, తమిళనాడుకు చెందిన డా.కె.కృష్ణకుమార్, సంయుక్త కార్యదర్శిగా రాష్ట్రానికి చెందిన డా.ఎల్.రాంసింగ్ ఎన్నికయ్యారు. తమిళనాడులోని నామక్కల్‌లో జరిగిన 35వ ఐఎస్ఎస్ఏఆర్ వార్షిక భేటీలో సొసైటీకి ఎన్నికలు నిర్వహించారు. సొసైటీ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు తెలంగాణ ప్రాంతం నుంచి ఎవరూ ఎన్నిక కాలేదని, ప్రతిష్టాత్మక సొసైటీకి జాయింట్ సెక్రటరీగా ఎన్నికవడం తనకు సంతోషాన్ని కలిగించిందని డా.రాంసింగ్ సాక్షికి తెలిపారు. ప్రస్తుతం ఆయన జగిత్యాల జిల్లా కోరుట్లలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ వెటర్నరీ గైనకాలజీ, అబ్‌స్టెట్‌రిక్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

## ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు ఇస్తే కఠిన చర్యలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లు యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు, వ్యాల్యుయేషన్ సర్టిఫికెట్లు, ఇతర సర్టిఫికెట్లు మంజూరు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. కొందరు మున్సిపల్ కమిషనర్లు తెలంగాణ మున్సిపాలిటీ 1965, 2019 చట్టాలకు విరుద్ధంగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ పాలన విభాగం డైరెక్టర్ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

## అదనపు సొలిసిటర్ జనరల్‌గా సూర్యకరణ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హై కోర్టు సీనియర్ న్యాయవాది టి.సూర్యకరణ్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సౌత్‌జోన్ నుంచి భారత అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సూర్యకరణ్‌రెడ్డి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో కూడిన సౌత్ జోన్ పక్షాన అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులైన తొలి తెలుగు వ్యక్తి సూర్యకరణ్‌రెడ్డి కావడం గమనార్హం. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.